

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

20-9-2026 ఆదివారం సంపుటి: 32 సంచిక: 231 పేజీలు: 10+4 వెల: 8.00



పర్యావరణ పరిరక్షణలో భారత్ దిక్సూచి: ప్రధాని మోడీ

కిమ్ అణు పరీక్షలతో 1399 భూకంపాలు 5




శనివారం న్యూఢిల్లీలో జరిగిన కేంద్ర ఆర్థిక శాఖ సదస్సులో ప్రసంగిస్తున్న డి.సిఎం భట్టి

## వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం

**దేశ ఆర్థిక వ్యవస్థలో రాష్ట్రవాటా 10 శాతానికి పెంచే ప్రణాళిక**

**2047కు 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ**

**ఢిల్లీ జాతీయ సదస్సులో డిప్యూటీ సిఎం భట్టి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు19:** వికసిత్ భారత్-2047 లక్ష్య సాధనలో తెలంగాణ కీలక పాత్ర పోషించేందుకు సిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దేశం నిర్దేశించుకున్న భారీ ఆర్థిక లక్ష్యాలను సుదూర ఆశయాలుగా కాకుండా, తక్షణ కార్యాచరణ బాధ్యతగా తెలంగాణ భావిస్తోందని పేర్కొన్నారు.కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నేతృత్వంలో శనివారం ఢిల్లీలో జరిగిన 'వికసిత్ భారత్ దిశగా భారతదేశ ప్రయాణానికి ఆర్థిక వనరుల సమీకరణ' సదస్సులో డిప్యూటీ సీఎం ప్రసంగించారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఆర్థిక మంత్రులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, ఆర్థిక నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు. తెలంగాణ నుంచి డిప్యూటీ సీఎంతో పాటు రాష్ట్ర.ఆర్థిక, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు. దేశం కనీవినీ ఎరుగని స్థాయిలో అభివృద్ధిని సాధించేందుకు అవసరమైన ఆర్థిక వనరులను సమకూర్చుకుంటూనే, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవడం, ఉత్పాదకతను పెంచడం, అభివృద్ధి ఫలాలను ప్రతి పౌరుడికి, ప్రతి ప్రాంతానికి అందించడం ప్రధాన సవాలని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.వికసిత్ భారత్ నిర్మాణాన్ని కేంద్రం లేదా రాష్ట్రాలు విడివిడిగా >>2


**దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది**

వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి

రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి 2


**రష్యా, ఇరాన్ ఆంక్షల బిల్లుపై సంతకం చేసిన యుఎస్ అధ్యక్షుడు**

భారత్, చైనా సహా పలు దేశాలపై తీవ్ర ప్రభావం

**జిన్‌పింగ్‌తో ట్రంప్ భేటీకి వారం ముందు సుంకాల బాంబు**

## 100% సుంకాలకు ట్రంప్ ఓకే




ప్రజల ఇంధన భద్రతే తమకు ప్రధానం: భారత్

**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** ఉక్రెయిన్‌పై క్రెమ్లిన్ సాగిస్తున్న సుదీర్ఘ పోరాటానికి అవసరమైన ఆర్థిక మూలాలను పూర్తిగా అణచివేసే అత్యంత కఠినమైన వ్యూహంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నారు. రష్యా ఇంధన, >>2

## తాగునీరు లేదు.. సాగునీరు రాదు!



**కృష్ణా, గోదావరి బేసిన్ రిజర్వాయర్లలో 349.61 టిఎంసిల లోటు**

**జూరాల, తుంగభద్ర, కడెం మినహా మిగిలిన ప్రాజెక్టుల్లో నీరు సగమే**

**మధ్యతరహా ప్రాజెక్టులూ అంతంత మాత్రమే..**

**సాగర్‌నీటిని గరిష్టంగా వాడుతున్న ఏపి, తెలంగాణ**

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రత తీవ్రంగాపెగడంవల్ల ఏర్పడిన అత్యంత శక్తివంతమైన గాడ్జిల్లా ఎల్‌నినో కారణంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని సాగు,తాగునీటిపై సర్వత్రా అనిశ్చితి మొదలైంది. కృష్ణా,గోదావరి బెసిన్‌లోని ప్రధాన భారీనీటి ప్రాజెక్టులు, మధ్య తరహా ,చిన్ననీటి వనరులలో నిలువ సామర్థ్యం కంటే తక్కువ నీరు ఉండటంతో నీటి అవసరాలు తీర్చుకోవడంపై భయాందోళనలు మొదలవుతున్నాయి. గోదావరి నీటిని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇతర బేసిన్‌లకు మళ్ళించి గరిష్టంగా వినియోగించుకొన్నప్పటికి ఈ సంవత్సరం గోదావరి డెల్టానుంచి 1172.72 టిఎంసిలనీరు ఉప్పుసముద్రంపాలైనాయి. మేడిగడ్డ కుంగుబాటు మల్లన్నసాగర్, కొండపోచమ్మ వంటి అనేక జలాశయాలను నింపుకోలేకపోయాం. కృష్ణానదిలో జూరాల,తుంగభద్ర గోదావరి బేసిన్‌లో కడెం, తాలిపేరు రిజర్వాయర్‌లో మాత్రమే గరిష్ట నీటినిల్వ సామర్థ్యంకు సమీపంలో నీటి నిల్వ ఉంది కానీ మిగితా రిజర్వాయర్లలో సగాని కంటే తక్కువ నీరు వచ్చి చేరింది. కృష్ణా,గోదావరి నదులపై ఉన్న 18 రిజర్వాయర్లలో గరిష్ఠంగా 792.74టిఎంసిల నీరు నిలుపుకొనే సామర్థ్యం ఉంది.గత ఏడాది వర్షాలు బాగానే కురవడంతో సెప్టెంబరు 19న 745.57 టిఎంసిలనీరు ఉంటే ప్రస్తుతం 443.33టిఎంసిల నీరు మాత్రమే >>2



**'సుప్రీం'కు దానం**

## అప్పీలు

**హైకోర్టు అనర్హత తీర్పును సవాల్ చేసిన దానం**

**బిఆర్‌ఎస్, బిజెపి కేవియట్‌లు**

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. తెలంగాణ హైకోర్టు తనపై ఇచ్చిన అనర్హత తీర్పును సవాల్ చేస్తూ దానం నాగేందర్ శనివారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మధ్యాహ్నం ఆయన తరఫు న్యాయవాదులు పిటిషన్ దాఖలు చేసినట్లు సమాచారం. ఈ పిటిషన్ సోమవారం విచారణకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.దానం నాగేందర్ పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో >>2


మహిళ పట్ల హోంగార్డు **అమానుషం**

జుట్టుపట్టుకుని ఈడ్చుకువెళ్లిన వైనం

హోంగార్డును డిస్మిస్ చేసిన అధికారులు

3

2 ఘోర ప్రమాదాలు

ఏడుగురు దుర్మరణం

గణేశ నిమజ్జనంలో విషాదం..


**తీవ్ర వాయుగుండంగా**

## అల్పపీడనం

**పలు జిల్లాల్లో భారీ వర్షాలు**



**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** ఉత్తర అండమాన్ సముద్ర పరిసరాల్లో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో నేడు అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇది క్రమంగా పశ్చిమవాయవ్య దిశగా కదులుతూ బలపడి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే సూచనలున్నాయి. ఈ క్రమంలో సెప్టెంబర్ 20 లేదా 21 నాటికి వాయుగుండంగా, 22వ తేదీ నాటికి తీవ్ర వాయుగుండంగా మారవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో ముఖ్యంగా సెప్టెంబర్ 22, 23 తేదీలలో తెలంగాణలో రాగల కొద్దిరోజుల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. రాష్ట్రంలోని ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, కామారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని విపత్తు నిర్వహణ విభాగం స్పష్టం చేసింది. లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతులు వ్యవసాయ పనుల్లో అప్రమత్తంగా ఉండాలని, నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వర్షం >>2

**మామునూర్ ఎయిర్‌పోర్టుకు**

## రూ.295 కోట్లు



**మంచి పేరు సూచించాలని ప్రజలను కోరిన సిఎం రేవంత్**

**సేకరించిన భూమి ఎఎఐకి అప్పగింత**

**వరంగల్లు సత్వరాభివృద్ధికి సోపానం: ముఖ్యమంత్రి**

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** వరంగల్‌లో ప్రపంచస్థాయి విమానాశ్రయం నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. మామునూర్ విమానాశ్రయం కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి.. సేకరించిన భూమిని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఎఐ)కి అప్పగించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మామునూర్ విమానాశ్రయ అభివృద్ధికి ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ కలను సాకారం చేసే దిశగా ఇది ముఖ్యమైన అడుగు అని సీఎం అన్నారు. ఈ సందర్భంగా వరంగల్ ఎయిర్‌పోర్టుకు పేరు సూచించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా శనివారంనాడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజా ప్రభుత్వం కృషితో వరంగల్ విమానాశ్రయం కల సాకారం కాబోతుందన్నారు. బిఆర్‌ఎస్ నేతలు పదేళ్ల పాటు కుటుంబ ప్రయోజనాలు,విలాసవంతమైన ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారు తప్ప, వరంగల్ విమానాశ్రయం సాధించటంపై దృష్టి సారించలేదని విమర్శించారు. విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్ నగరంతో పాటు ఉమ్మడి వరంగల్‌ప్రాంతంలో పరిశ్రమలు, వాణిజ్యం, పర్యాటక రంగాలకు మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు విద్య, ఉద్యోగ,ఉపాధి అవకాశాలుపెరిగేందుకు మామునూర్ విమానాశ్రయం >>2

**జన్వాడ భూముల వాస్తవాలు పరిశీలిస్తున్నాం**

**ఫామ్‌హౌస్ ప్రదీప్‌రెడ్డికి ఎలా వచ్చింది?**

**అక్రమాలు పరిశీలించాలని హైడ్రా కమిషనర్‌ను అడిగాం: ఎంపీలు మల్లు రవి, చామల**

**కాంగ్రెస్ నేతలను బిఆర్‌ఎస్ శ్రేణులు అడ్డుకొనే యత్నం**

**భారీగా పోలీసు బందోబస్తు**



శంకర్‌పల్లి మండలం జన్వాడ ఫామ్‌హౌస్ వద్ద శనివారం భారీగా మోహరించిన పోలీసులు

## నాలా పరిధిలో కెటిఆర్ ఫామ్‌హౌస్!



మీడియాతో కాంగ్రెస్ నేతలు మల్లు రవి, చామల తదితరులు

**శంకర్‌పల్లి, సెప్టెంబర్19, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడ మియాఖాన్‌గడ్డ పరిధిలోని ఫామ్‌హౌస్ వ్యవహారం మరోసారి రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.జన్వాడలోని ఫామ్‌హౌస్ భూములు, నిర్మాణాలు,వాటికి సంబంధించిన అనుమతులు, నాలా ఆక్రమణలపై వివరాలను తెలుసుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ప్రతినిధి బృందం శనివారం జన్వాడకు చేరుకుంది. ప్రజాభవన్ నుంచి ప్రత్యేక బస్సులో బయలుదేరిన కాంగ్రెస్ నేతలు ఫామ్‌హౌస్ పరిసర ప్రాంతాలకు చేరుకుని అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఫామ్‌హౌస్ భూములకు సంబంధించిన రికార్డులు, యాజమాన్య వివరాలు,సర్వే నంబర్లు,నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశాలను పరిశీలించడమే తమ పర్యటన ఉద్దేశమని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈ సందర్భంగా ఫామ్‌హౌస్ వద్దకు కాంగ్రెస్ నేతలు చేరుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కాంగ్రెస్ బృందాన్ని అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రయత్నించడంతో పోలీసులు వారిని పక్కకు పంపించారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**నాలాపై ఫామ్‌హౌస్ నిర్మించారు: ఎంపీ మల్లు రవి**

కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ జన్వాడ ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూములు, నిర్మాణాలపై వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకే తాము ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. ఫామ్‌హౌస్ బుల్కాపూర్ నాలా పరిధిలో నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయని, నిర్మాణానికి అవసరమైన అనుమతులు ఉన్నాయా లేదా అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉందన్నారు. ఫామ్‌హౌస్ ఎవరి పేరుపై ఉందనే >>2



**సింగరేణి కార్మికుల ఇళ్ల సమస్యకు**

## శాశ్వత పరిష్కారం

**మంత్రి పొంగులేటి**

**హైదరాబాద్,సెప్టెంబరు19,ప్రభాతవార్త:** తెలంగాణ నేలకు వెలుగులు పంచేందుకు భూమిపొరల్లోకి దిగి, తమ చెమటను నల్ల బంగారంగా మారుస్తున్న సింగరేణి కార్మికుల సేవలు వెలకట్టలేనివని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి >>2

## ఎపికి నీళ్లు దోచిపెడుతున్న సిఎం

**ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే రోడ్డెక్కుతున్నరైతులు**

**కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కేదాకా ఊరుకోం**

**పెబ్బేరు వద్ద రోడ్‌షోలో కెటిఆర్**



శనివారం పెబ్బేరు రోడ్‌షోలో మాట్లాడుతున్న కెటిఆర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు19, ప్రభాతవార్త:** ఎల్‌నినో పేరిట సీఎం రేవంత్‌రెడ్డి ఆంధ్రాకు సాగుజలాలు దోచిపెడుతున్నారని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. వనపర్తి నియోజకవర్గం పెబ్బేరులో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ప్రకృతి కావాల్సినన్ని నీళ్లు ఇచ్చినా రైతులకు సాగునీరు లేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ముందుచూపు లేకపోవడమే కారణమన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 7వేల మెగావాట్లు ఉన్న విద్యుత్ స్థాపిత సామర్థ్యాన్ని తమ ప్రభుత్వం 24 వేల మెగావాట్లకు పెంచామన్నారు. కేసీఆర్ హయాంలో కృష్ణాజలాల్లో 30 శాతానికి పైగా నీళ్లు వాడుకున్నామని, పాలమూరులో పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి 7 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చామని గుర్తు చేశారు.సీఎం సొంత జిల్లాలోనే రైతులు కరెంట్, సాగునీటి కష్టాలతో రోడ్డెక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను రెండు సబ్ స్టేషన్లకు రైతుల తో కలిసి వెళితే అధికారులు సమాధానం చెప్పలేకపోయారని, ఆరు గంటలకు మించి విద్యుత్ రావడం లేదని, లో ఓల్టేజీతో మోటర్లు కాలిపోతున్నాయని రైతులు చెబుతున్నారన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలే కరెంట్, తాగునీటి కష్టాలు ఉన్నాయని చెబుతు న్నారని ఎద్దేవా చేశారు.పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా ఏపీకి నీళ్లు పోతుంటే తెలంగాణకు ఎందుకు రావడం లేదని >>2



మీరట్‌లో శనివారం జరిగిన ఎయిర్ షోలో విన్యాసాలు చేస్తున్న భారత్ వైమానిక దళానికి చెందిన 'సూర్యకిరణ్ ఏరోబాటిక్ బృందం'

# అమిత్‌షాకు అస్వస్థత

## కర్ణాటక నుంచి నేరుగా ఢిల్లీకి పయనం

**బెంగళూరు, సెప్టెంబరు 19:** కేంద్ర హోంమంత్రి అమిత్ షా అనారోగ్యానికి గురయ్యారు. దీంతో కర్ణాటక, మహారాష్ట్రలో అధికారిక కార్యక్రమాలు రద్దయ్యాయి. అస్వస్థత కారణంగా హుబ్బళ్లి నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. కొల్హాపూర్ పర్యటన కూడా రద్దైంది. వైద్యుల సూచన మేరకు విశ్రాంతి కోసం ఢిల్లీకి వెళ్లిపోయారు. ఈరోజు, రేపు అమిత్ షా మహారాష్ట్ర, కర్ణాటకలో పర్యటించాల్సి ఉంది. హుబ్బళ్లి, కొల్హాపూర్‌లో పర్యటించాల్సి ఉంది.
అయితే అకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వైద్యులు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలో హుబ్బిళ్లి నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లిపోయారు. వాస్తవంగా హుప్రిలోని కల్లప్పన అవడే జవహర్ షెట్కారి సహకారి షుగర్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో మహాలక్ష్మి గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. జీరో వేస్ట్ వేస్ట్ టు బెస్ట్ అనే ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 600 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం ఈకార్యక్రమాలన్నింటిలోనూ కేంద్ర మంత్రి ప్రహ్లాద్‌జోషి పాల్గొన్నారు.

# 'సుప్రీం'కు దానం అప్పీలు

>> ఇప్పటికే బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. తాజాగా బీజేపీ కూడా హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో కేవియట్ దాఖలు చేసింది. దానం నాగేందర్ అప్పీల్‌పై ఎలాంటి ఆదేశాలు జారీ చేసే ముందు తమ వాదనలు కూడా వినాలని రెండు పార్టీలు కేవియట్ ద్వారా కోరాయి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్ అనంతరం కాంగ్రెస్‌లో చేరి 2024 లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు.
దీనిపై బీఆర్ఎస్, బీజేపీ నేతలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు, దానం నాగేందర్‌పై స్పీకర్ అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పక్కనపెట్టి, 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు కోర్టు స్పష్టం చేసింది.

# మామునూర్ ఎయిర్ పోర్టుకు రూ.295 కోట్లు

>> కీలక గేట్‌వేగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. వరంగల్ సమగ్ర అభివృద్ధిలో మామునూర్ విమానాశ్రయానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెరుగైన విమాన రాకపోకలతో హైదరాబాద్‌పై రవాణా ఒత్తిడి తగ్గడంతో పాటు వరంగల్ ప్రాంతానికి దేశ.. విదేశీ పెట్టుబడులు వచ్చే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి, పర్యాటక రంగ విస్తరణ, విద్యా సంస్థలు, ఐటీ మరియు సేవా రంగాలకు కొత్త అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో వరంగల్ ఎయిర్‌పోర్ట్ కల సాకారం దిశగా అడుగులు పడుతున్నాయని సీఎం అన్నారు. మామునూర్ విమానాశ్రయం ద్వారా వరంగల్‌ను మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు కొనసాగిస్తుందని తెలిపారు.
కాగా, వరంగల్ ఎయిర్‌పోర్డు కోసం అనుమతుల దగ్గర నుంచి భూసేకరణ, సాంకేతిక పరమైన పరిశీలన దశలను దాటుకొని నిర్మాణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్ణయించింది. ఇప్పటికే 2 ప్యాకేజీల పనులకు వేర్వేరుగా టెండర్లు పిలిచి ప్రక్రియను పూర్తి చేసిన విషయం తెలిసిందే. విమానాశ్రయం నిర్మాణాలు జరిగే ప్రాంగణం 953 ఎకరాల చుట్టూ ప్రహరీ నిర్మాణం తొలి ప్యాకేజీలో చేపట్టనున్నారు. రన్‌వే అవరణలో పార్కింగ్, సీవరేజ్ వ్యవస్థ నిర్మాణ పనులను రెండో ప్యాకేజీలో ప్రతిపాదించారు. ఇక ఆఖరు ప్యాకేజీ పనులైన టెర్నినల్ భవనం, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, ఫైర్ స్టేషన్, విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణాలను చేపట్టనున్నారు. డిసెంబర్‌లో శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయనున్నట్లు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ద్వారా సమాచారం.

# నీళ్లు దోచిపెడుతున్న సిఎం

>> ప్రశ్నించారు. జూరాలకు ఎగువ నుంచి నీళ్లు లేవని కాలువకు నీటి విడుదల ఆపామని అధికారులు చెప్పడం విడ్డూరమన్నారు. కల్వకుర్తి పంపులు ఆన్ చేయడం లేదని, అవి రోజుకు రెండు మూడు సార్లు ఆన్ ఆఫ్ చేసే పంపులు కావని, ఒకసారి ఆన్ చేస్తే కంటిన్యూగా నడపాలని అన్నారు. కర్ణాటక, ఏపీ ప్రణాళికతో వెళ్తుంటే తెలంగాణ ప్రభుత్వం కృష్ణా జలాల విషయంలో ప్రణాళిక లేకుండా ఉందని విమర్శించారు. ఆలమట్టి ఎత్తు పెంచే యోచనలో కర్ణాటక ఉందని, దీంతో భవిష్యత్తులో పాలమూరుకు నీళ్లు రావని, ఈ విషయంలో పక్కనే ఉన్న కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. ఐదు మీటర్ల ఎత్తు పెంపునకు కర్ణాటక లక్ష కోట్లు ఖర్చు పెడుతుందని, కృష్ణా జలాల్లో పాలమూరు వాటా దక్కే వరకు ఊరుకోమని స్పష్టం చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై హైకోర్టు తీర్పు చెంపపెట్టు అని, పార్టీ ఫిరాయించిన ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ లో చేరిన మిగతా ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మర్రి జనార్ధన్ రెడ్డి , షార్ట్ మాజీ చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తీవ్ర వాయుగుండంగా అల్పపీడనం

>> కురిసే సమయంలో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున చెట్లు, విద్యుత్ స్తంభాల కింద నిలబడవద్దని, వర్షాలు తీవ్రమయ్యే వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని అధికారులు హెచ్చరించారు.

# సాగునీరు రాదు!

>> రిజర్వాయర్లలో ఉంది. ప్రధాన ప్రాజెక్టుల్లో ఇంకా 349.61టిఎంసిల నీటి లోటు కనపడుతోంది. 36 మధ్యతరహా ప్రాజెక్టులో 60213 మిలియన్ క్యూబిక్ ఫీట్స్ నీటిని నిలుపుకొనే సామర్థ్యంఉన్నప్పటికి 43502ఎంసిఎఫ్‌టి నీరు మాత్రమే ఉంది. గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులు నీరులేక కలావిహీనంగా ఉన్నాయి. సింగూరు ప్రాజెక్టులో 29.91 టిఎంసిల గరిష్ఠనీటిని ల్వను చేసుకొనే సౌకర్యం ఉన్నప్పటికి వర్షాభావంతో 4.23టిఎంసిలనీరు మాత్రమే ఉంది. నిజామ్‌సాగర్‌లో 17.89టిఎంసిలకు గాను 11.89టిఎంసిలనీరు ఉంది. శ్రీరామ సాగర్‌లో 80.50టిఎంసిల నీటి నిల్వసార్థ్యం ఉన్నా అందులో 46.65టిఎంసిలు, మధ్య మానేరులో 27.55టిఎంసిల నీటినిల్వ సామర్థ్యం ఉన్నా అందులో 22టిఎంసిల, లోయర్ మానేరుడ్యామ్‌లో24టిఎంసిల గరిష్ఠ నీటికిగాను 11టిఎంసిలనీరు మాత్రమే ఉంది. ఒక్క కడెం ప్రాజెక్టులో మాత్రం నీరు గరిష్ఠనీటి మట్టం 3.50టిఎంసిలకు చేరులోఉంది. శ్రీపాద ఎల్లంపలో 20.18గరిష్ఠనీటి మట్టం కుగాను 18.28టిఎంసిల నీరు మాత్రమే ఉంది. కృష్ణానదిపై జలజగడం రెండురాష్ట్రల లో నెలకొంది నాగర్జునసాగర్‌లో నీటిని తాగునీటిఅవసరాలకు మాత్రమే వినియోగించాలని కెఆర్ఎంబి తెలిపినా ఇటీవల ఇరురాష్ట్రాలు పోటిపడి ఏకపక్షంగా నీటిని వాడుకొన్నారు. ఎపి ఎనిమిది టిఎంసిలు వాడుకొంటే పోటిగాతెలంగాణ అంతే మొత్తం విడుదల చేసుకొంటున్నది. నాగార్జునసాగర్‌లో 312 టిఎంసిల నీరు నిలుపుకొనే గరిష్ఠ సామర్థ్యం ప్రస్తుతం పూడికవల్ల కుదించబడినప్పటికి అందులో 178టిఎంసిలనీరు మాత్రమే ఉంది గత ఏడాది ఎన్ఎస్‌పిలో 305 టిఎంసిల నీరు ఇదే రోజు ఉండేది. శ్రీశైలంలో 215టిఎంసిల గరిష్టనీటి నిలుపుకొనే సామర్థ్యంకు భిన్నంగా 104టిఎంసిలనీరు అందులో ఉంది. ఇటీవల కొత్తగా వెలిగొండ టన్నెల్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించడంతో పాటు పోతిరెడ్డి పాడు వద్ద గేట్ మరమ్మతుకు గురికావడంతో వృధాగా శ్రీశైలం నుంచి పెద్దఎత్తున నీరు బయటకు పోయింది. గత ఏడాది శ్రీశైలంలో 211టిఎంసినీరు ఉండేది కానీ ఇప్పుడు ఇంకా 111టిఎంసిలనీటి లోటు ఆ జలాశయంలోఉంది. నాగార్జునసాగర్‌లో 133టిఎంసిల నీటిలోటు ఉంది. ఏదీ ఏమైనా ఇక నైరుతి రుతుపవనాలు ముగింపు దశకు చేరుకోవడంతో నీటికొరత పై భయాందోళనలు మొదలవుతున్నాయి. భూగర్భజలాలు కూడా దాదాపు అడుగంటి పోవడంతో వచ్చే రెండేళ్ళు ఎంతటిఘోరమైన పరిస్థితి నెలకొంటుందో అని రైతులు ఆవేదన చెందుతున్నారు.

## వారం - వర్జ్యం

**20-09-2026, ఆదివారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం,**
**భాద్రపద మాసం, దక్షిణాయణం,**
**వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,**
తి.నవమి సా.5.50, న.పూర్వాషాఢ తె.4.34
వ.మ.12.27 - మ.2.14
దు.సా.4.24 - సా.5.13
రాహు సా.4.30-సా.6.00 శుభ స. లేదు

## వార్తాఫలం

**మేషం :** మీ పేరుమీద చేసే వ్యాపారాలు మధ్యస్తంగా ఉంటాయి. ఋణభారాన్ని దించుకోగలుగుతారు.

**వృషభం :** మార్పురాని వ్యక్తులలో మార్పు తీసుకురావడానికి కృషి చేస్తారు. ఇచ్చిన మాటను నిలుపుకుంటారు. ధనం చేతికందుతుంది.

**మిథునం :** మీరు ఊహించిన విధంగానే నేడు కొన్ని సంఘటనలు చోటు చేసుకుంటాయి. వ్యవహారాలలో స్పష్టత ఏర్పడుతుంది.

**కర్కాటకం :** కుటుంబ సభ్యులతో కలిసి వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. శుభకార్య ప్రసంగాలను, చర్చలను సాగిస్తారు.

**సింహం :** ఇష్టంలేని అంశాలపట్ల అంటి ముట్టనట్లు వ్యవహరిస్తారు. సహోదర, సహోదరీ వర్గం యొక్క యోగక్షేమాలను విచారిస్తారు.

**కన్య :** నేర్పును కనబరుస్తారు. నేల విడిచి సాము చేయరు. స్వయం నిర్ణయాలకు ప్రాముఖ్యతనిచ్చి లాభ పడతారు.

**తుల :** ముఖ్యమైన పత్రాలు చేతికందుతాయి. ఆత్మసాక్షికి విరుద్ధంగా వ్యవహరించవలసి వచ్చినప్పటికీ పరిస్థితులకు లొంగరు.

**వృశ్చికం :** పెండింగ్లో ఉన్న రిజిస్ట్రేషన్ పనులు సానుకూలపడతాయి. మనీ రొటేషన్స్ స్కీమ్లు, లక్కీడ్రాలు అమితంగా ఆకర్షిస్తాయి.

**ధనుస్సు :** స్నేహబృందంతో కలిసి కష్టసుఖాలను చర్చించుకుంటారు. నూతన ఉద్యోగ అవకాశాలు కలిసి వస్తాయి. ప్రోత్సాహం లభిస్తుంది.

**మకరం :** ఆర్థిక పరమైన విషయాలు ప్రధాన ప్రస్తావనాంశాలవుతాయి. గృహంలేక వాహనం మరమ్మత్తులను జరుపుతారు.

**కుంభం :** అప్రయత్నంగా ఓకార్యంలో సఫలత లభిస్తుంది. ఆరోగ్యం సాధారణం. స్వల్పమైన విషయాలకు కూడా ఎక్కువగా ఆందోళన పడతారు.

**మీనం :** రాజకీయ, పారిశ్రామిక వర్గాలలోని వారికిప్రోత్సాహం లభిస్తుంది. క్రయవిక్రయాలు లాభసాటిగా సాగుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# వికసిత్ భారత్‌లో తెలంగాణ కీలకం

>> సాధించలేవని, సహకార సమాఖ్య స్ఫూర్తితో కేంద్రం-రాష్ట్రాలు కలిసి ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ వనరులను సమర్థంగా సమీకరించడంతో పాటు బలమైన సంస్థలు, పరస్పర సహకార విధానాలు అవసరమన్నారు. తెలంగాణ కేవలంనిధులను కోరేందుకు కాకుండా, స్పష్టమైన అభివృద్ధి ప్రణాళిక, ఆర్థిక వనరుల సమీకరణకు నిర్దిష్ట విధానం, దీర్ఘకాలిక లక్ష్యంతో ఈ చర్చలో భాగస్వామ్యమవుతోందని తెలిపారు. తెలంగాణ బలమైన ఆర్థిక పునాదులతో తదుపరి దశ వృద్ధికి సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. 2025-26లో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జిఎస్‌డిపి) రూ.17.82 లక్షల కోట్లకు చేరిందని, ప్రస్తుత ధరల ప్రకారం 10.7 శాతం వృద్ధి నమోదైందన్నారు. స్థిర ధరల ప్రకారం వాస్తవ జిఎస్‌డిపి వృద్ధి 8.5 శాతంగా అంచనా వేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, ఇది జాతీయ సగటు రూ.2,19,575 తో పోలిస్తే దాదాపు రెండింతలని వివరించారు. సేవల రంగం 13.5 శాతం, ద్వితీయ రంగం 9.4 శాతం వృద్ధి సాధించాయని తెలిపారు, ప్రస్తుత వృద్ధి పథంలో కొనసాగితే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 1.21 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా ఉందని, అయితే రాష్ట్రప్రభుత్వం అంతకంటే పెద్దలక్ష్యాన్ని నిర్దేశించుకుందని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలని సంకల్పించామని ప్రకటించారు. తద్వారా దేశ ఆర్థిక వ్యవస్థలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న దాదాపు 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలన్నది లక్ష్యమని తెలిపారు.
3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించాలంటే మౌలిక వసతులకు నిధులు సమకూర్చే విధానంలో మార్పు అవసరమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రోడ్లు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల కోసం ప్రభుత్వ రుణాలపైనే అధికంగా ఆధారపడే పద్ధతి నుంచి క్రమంగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ పెట్టుబడులు, సంస్థాగత నిధులు, సావరిన్ ఫండ్స్ నుంచి అధిక మొత్తంలో పెట్టుబడులను సమీకరించి, ప్రభుత్వ నిధులను వ్యూహాత్మకంగా వినియోగించే నమూనా వైపు తెలంగాణ అడుగులు వేస్తోందన్నారు.
గ్రేటర్ హైదరాబాద్ కేంద్రంగా క్యూర్(కోర్ అర్బన్ రీజియన్)ను అత్యున్నత సేవలు, కృత్రిమ మేధ, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు, ఫిన్‌టెక్, లైఫ్ సైన్సెస్, నాలెడ్జ్ ఆధారిత పరిశ్రమలకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రధాన రవాణా మార్గాల వెంట ప్యూర్(పెరి-అర్బన్ రీజియన్)ను పారిశ్రామిక, తయారీ రంగాలకు కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. రేర్(రూరల్ అగ్రికల్చరల్ అండ్ రిసోర్సెస్ ఎకానమీ) ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపు తీసుకురానున్నట్లు తెలిపారు. వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికత వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ల విస్తరణ, కోల్డ్‌చైన్ వ్యవస్థల ఏర్పాటు ద్వారా గ్రామీణ ఉత్పత్తిదారులను అధిక ఆదాయం అందించే దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లతో అనుసంధానించనున్నట్లు చెప్పారు. దేశంలో భవిష్యత్ నగరాలకు నమూనాగా 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. దేశంలో తొలి నెట్‌జీరో, ఏఐ ఆధారిత గ్రీన్ మెగాసిటీగా దీన్ని తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాలు, అంతర్జాతీయ పరిశోధనా కేంద్రాలు, క్లీన్ టెక్నాలజీ పార్కులు, పర్యావరణహిత నివాస ప్రాంతాలు ఇందులో భాగంగా ఉంటాయని వివరించారు. క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలను అనుసంధానించే కీలక మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో ..రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రధానమైనదని పేర్కొన్నారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థకు మౌలిక వసతులు, పెట్టుబడులతో పాటు మానవ వనరులే అసలైన పునాది అని డిప్యూటీ సీఎం అన్నారు. తెలంగాణ యువతే రాష్ట్రానికి అతిపెద్ద బలమని పేర్కొన్నారు. ఉన్నత విద్యకు, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకు ప్రముఖ అంతర్జాతీయ సంస్థల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆర్థిక వృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికీ చేరాలని, సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సామాజిక భద్రత, అందుబాటులో వైద్యం, నాణ్యమైన గృహ వసతి, మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాలకు మద్దతు ద్వారా అభివృద్ధిలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయాలన్నదే తమ విధానమన్నారు. తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న లక్ష్యం రాష్ట్రానికే పరిమితమైనది కాదని, 2047 నాటికి సుసంపన్నమైన, స్వావలంబనతో కూడిన వికసిత్ భారత్ నిర్మాణానికి తెలంగాణ అందించే భాగస్వామ్యమని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆర్థిక వ్యవస్థలు సమన్వయంతో పనిచేస్తూ పెట్టుబడులు, స్థిరమైన ఆర్థిక వనరులు, మానవ సామర్థ్యానికి ప్రాధాన్యం ఇస్తే వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించగలమని ఆయన అన్నారు.

# నాలా పరిధిలో కెటిఆర్ ఫామ్‌హౌస్!

>> విషయంలోనూ అనేక ప్రశ్నలు ఉన్నాయని పేర్కొన్నారు. భూముల రికార్డులు, నిర్మాణ అనుమతులు, ఇతర అధికారిక పత్రాలను పరిశీలించిన తర్వాత వాస్తవాలు వెలుగులోకి వస్తాయని మల్లు రవి తెలిపారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జన్వాడ ఫామ్‌హౌస్ భూమి ప్రదీప్‌రెడ్డికి ఎలా వచ్చిందనే అంశంపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. ఇంత విస్తీర్ణంలో ఫామ్‌హౌస్ నిర్మాణం ఎలా జరిగింది, నిర్మాణానికి ఏ శాఖల నుంచి అనుమతులు తీసుకున్నారు, నాలా పరిధిలో నిర్మాణాలు ఉన్నాయా అనే అంశాలను అధికారులు పరిశీలించాలని కోరారు. సర్వే నంబర్ 311, 301, 313లో అక్రమాలు జరిగితే నిగ్గు తేలుస్తాం. సత్యం రామలింగరాజు కంపెనీ నుంచి ఈ భూములు రాజేష్‌కు బదిలీ అయ్యాయి. రాజేష్ నుంచి ఈ భూములు ప్రదీప్‌రెడ్డికిబదిలీ అయ్యాయి.
ఈ భూములు కేటీఆర్‌కు స్నేహితుడు ఇచ్చినట్లు ఆధారాలు లేవు అని చెప్పారు. ఫామ్‌హౌస్ భూముల యాజమాన్యం, భూముల బదిలీలు, నిర్మాణ అనుమతులపై పూర్తిస్థాయి వివరాలు బయటకు రావాల్సిన అవసరం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమించి నిర్మించిన ఫామ్‌హౌస్ యజమానులపై చర్యలు తీసుకోవాలని కిరణ్‌కుమార్‌రెడ్డి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు ఉన్నట్లు అధికారిక పరిశీలనలో తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎంపీ కోరారు. అదేవిధంగా మున్సిపల్ అధికారులతోనూ కాంగ్రెస్ నేతలు మాట్లాడి ఫామ్‌హౌస్ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల వివరాలను అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. గతంలో నిర్మాణ అనుమతుల గురించి అడిగినప్పుడు సర్పంచ్ అనుమతితో నిర్మించుకున్నట్లు యజమాని చెప్పినట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించినట్లు కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఈ అంశాలపై అధికారిక రికార్డులను పరిశీలించాల్సి ఉందని తెలిపారు.

**ప్రదీప్‌రెడ్డి స్పందన...**

మరోవైపు జన్వాడ ఫామ్‌హౌస్ తనదేనని పేర్కొంటున్న ప్రదీప్‌రెడ్డి ఇప్పటికే స్పందించారు. భూమిని తాను చట్టబద్ధంగా కొనుగోలు చేశానని, కేటీఆర్ తన చిన్ననాటి స్నేహితుడు కావడంతో ఫామ్‌హౌస్‌ను ఆయనకు లీజుకు ఇచ్చినట్లు తెలిపారు. ఎలాంటి అక్రమాలు జరగలేదని, తన వద్ద భూమికి సంబంధించిన పత్రాలు ఉన్నాయని ఆయన కాంగ్రెస్ నేతల పర్యటనకు ముందే మీడియాతో చెప్పారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పర్యటన నేపథ్యంలో జన్వాడ ఫామ్‌హౌస్ పరిసరాల్లో పోలీసులు భారీగా మోహరించారు.
కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు ఎదురెదురుగా రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారే అవకాశం ఉండటంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు. ఫామ్‌హౌస్ ప్రైవేట్ ఆస్తి కావడంతో అనుమతి లేకుండా లోపలికి ప్రవేశించరాదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినట్లు సమాచారం. జన్వాడ ఫామ్‌హౌస్ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలు చేసిన ఆరోపణలకు సంబంధించి భూముల అధికారిక రికార్డులు, సర్వే వివరాలు, నిర్మాణ అనుమతులు, నాలా హద్దులకు సంబంధించిన ప్రభుత్వ శాఖల నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.



న్యూఢిల్లీలో శనివారం జరిగిన 'పర్యావరణం, వాతావరణ గతిశీలత భవిష్యత్తు' సదస్సు ప్రారంభించిన అనంతరం అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

# 100% సుంకాలకు ట్రంప్ ఓకే

>> రక్షణ రంగాలు లక్ష్యంగా రూపొందించిన లిండ్సే ఓ గ్రాహం రష్యా, ఇరాన్ ఆంక్షల చట్టం 2026బిల్లుపై ఆయన సంతకం చేశారు. ఈ చట్టం ప్రకారం, పాశ్చాత్య దేశాల ఆంక్షలను ధిక్కరించి రష్యా నుండి భారీగా ముడి చమురు, సహజ వాయువులను కొనుగోలు చేస్తున్న భారతదేశం, చైనాలతో సహా ప్రధాన వినియోగదారుల ఉత్పత్తులపై ఏకంగా 100 శాతం వరకు దిగుమతి సుంకాలు విధించే అపరిమితమైన అధికారాలను అమెరికా అధ్యక్షుడికి కల్పిస్తోంది. అమెరికా కాంగ్రెస్‌లో సుదీర్ఘ చర్చల అనంతరం ఈ చట్టం ఆమోదం పొందింది. రిపబ్లికన్లు మెజారిటీగా ఉన్న ప్రతినిధుల సభ 262-159 ఓట్ల తేడాతో ఈ ఆంక్షల ప్యాకేజీకి ఆమోదముద్ర వేయగా, సెనేట్ ఇప్పటికే దీనిని ఆమోదించింది. గత జూలైలో మరణించిన సౌత్ కరోలినా రిపబ్లికన్ సెనేటర్, రష్యా విధానాల తీవ్ర విమర్శకుడు లిండ్సే గ్రాహం జ్ఞాపకార్థం ఈ చట్టానికి ఆయన పేరును ఖరారు చేశారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఉన్నతాధికారులు, సైనిక రంగానికి సహకరించే అంతర్జాతీయ సంస్థలు, అంతర్జాతీయ నిషేధాలను దాటవేసేందుకు రష్యా ఉపయోగిస్తున్న షాడో ఫ్లీట్ ఆఫ్ ట్యాంకర్స్ పై తీవ్రమైన ఆంక్షలు అమల్లోకి వస్తాయి. దీనితో పాటు ఇరాన్ ఆర్థిక మూలాలను సైతం దెబ్బతీసే ఉద్దేశంతో ఇరాన్ ఆంక్షల చట్టాన్ని 2031 వరకు మరో ఐదేళ్ల పాటు పొడిగించే నిబంధనలను ఇందులో స్పష్టంగా చేర్చారు. ఈ చట్టం అమెరికా అంతర్గత రాజకీయంలో కొత్త వైరుధ్యాలకు దారితీసింది.
సాధారణంగా ఉక్రెయిన్ ప్రతిఘటనకు సంపూర్ణ మద్దతు ఇచ్చే డెమోక్రాటిక్ పార్టీ చట్టసభ సభ్యులు, ఈ చట్టంలోని విస్తృత వాణిజ్య నిబంధనలను తీవ్రంగా వ్యతిరేకించారు. అంతర్జాతీయ వాణిజ్య విధానాలపై వైట్ హౌస్‌కు, డొనాల్డ్ ట్రంప్‌కు పరిమితి లేని అపారమైన అధికారాలు ఇవ్వడం వల్ల, భవిష్యత్తులో ఇతర మిత్రదేశాలు కూడా అమెరికా ఆగ్రహానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. వాషింగ్టన్‌లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జరగనున్న కీలక దౌత్య సమావేశానికి కేవలం ఒక వారం ముందే ట్రంప్ ఈ తీవ్రమైన చట్టంపై సంతకం చేయడం అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ వర్గాలలో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అమెరికా తీసుకున్న ఈ సడన్ నిర్ణయంపై భారత ప్రభుత్వం స్పష్టమైన ప్రాధాన్యతలను వ్యక్తపరిచింది. ప్రపంచంలో రష్యా చమురును కొనుగోలు చేస్తున్న రెండో అతిపెద్ద దేశంగా ఉన్న భారత్, విదేశాంగ మంత్రిత్వ శాఖ ద్వారా ప్రకటన విడుదల చేస్తూ.. 140 కోట్ల మంది పౌరుల ఇంధన భద్రత తమకు అత్యంత ప్రాథమిక బాధ్యత అని పునరుద్ఘాటించింది.
మారుతున్న గ్లోబల్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ విదేశీ వనరుల ద్వారా చమురు కొనుగోళ్లను నిరంతరం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. భారత పారిశ్రామిక రంగాన్ని, ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ ఈ చట్టం ఆమోదంపై హర్షం వ్యక్తం చేస్తూ అమెరికా చట్టసభలకు ధన్యవాదాలు తెలియజేశారు. అయితే, ఈ చట్టం ట్రంప్ ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత కూడా నిరంతరంగా అమల్లో ఉండేలా డిజైన్ చేయడం వల్ల, గ్లోబల్ ట్రేడ్ కారిడార్లు, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లు, భారత్‌అమెరికా దౌత్య సంబంధాలపై రాబోయే దశాబ్ద కాలంలో ఇది తీవ్ర ప్రభావం చూపనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉంది

## వికసిత్ భారత్ లక్ష్యంగా ముందుకు సాగాలి

### రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** దేశ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రోజ్‌గార్ మేళా మరో మైలురాయిని తాకింది. 20వ విడత రోజ్‌గార్ మేళాలో భాగంగా నూతనంగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన యువతకు కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి అభినందనలు తెలిపారు. శనివారం మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగిన రోజ్‌గారి మేళా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కిషన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వంలో వివిధ శాఖల్లో ఉద్యోగాలు పొందిన యువతీ యువకులకు అపాయింట్మెంట్ లెటర్స్ అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం అంటే కేవలం ఉపాధి మాత్రమే కాదని, దేశానికి సేవ చేసే ఒక గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు.
ఇప్పటివరకు జరిగిన 19 విడతల రోజ్‌గార్ మేళాల ద్వారా 12.50 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించగా, నేటి(శనివారం)విడతతో ఆ సంఖ్య 13 లక్షలకు చేరిందని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ ఉద్యోగాలు అందుకుంటున్న యువత వయస్సు ఎక్కువగా 20-30 సంవత్సరాల మధ్యే ఉంటుందని, 2047 నాటికి భారత్‌కు స్వాతంత్రం వచ్చి వందేళ్లు పూర్తయ్యే సమయానికి వీరంతా అత్యంత కీలకమైన స్థానాల్లో ఉంటారని పేర్కొన్నారు. మోదీ కల అయిన వికసిత భారత్2047 సాధనలో ఈ యువత పాత్ర ఎంతో కీలకమని అన్నారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న వారు ఏ శాఖలో పనిచేసినా.. ప్రజలకు అందుబాటులో ఉంటూ, టెక్నాలజీని వినియోగిస్తూ, పారదర్శకతకు పెద్దపీట వేయాలని పిలుపునిచ్చారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా.. మౌలిక వసతులు తయారీ రంగం స్టార్టప్‌లు, ఎంఎస్ఎంఈ, డిజిటల్ ఎకానమీ వంటి రంగాల్లో కేంద్ర ప్రభుత్వం భారీగా అవకాశాలు సృష్టిస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే 2026-27 బడ్జెట్‌లో మూలధన వ్యయం కోసం రూ.12.22 లక్షల కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వ విధానాల వల్ల దేశంలో స్టార్టప్‌ల సంఖ్య విపరీతంగా పెరిగిందని తెలిపారు. 2014కు ముందు వందల్లో ఉన్న స్టార్టప్‌లు, 2026 జూన్ నాటికి 2.3 లక్షలకు పైగా చేరుకున్నాయని, వీటి ద్వారా 23 లక్షలకు పైగా ప్రత్యక్ష ఉద్యోగాలు సృష్టించబడ్డాయని వెల్లడించారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఏఐ, రోబోటిక్స్, డ్రోన్ టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ వంటి ఫ్యూచరిస్టిక్ రంగాల్లో నైపుణ్యాలు పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన (పిఎంకెవివై 4.0) ద్వారా కోట్లాది మందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. తాను బాధ్యతలు నిర్వహిస్తున్న బొగ్గు, గనుల రంగంలోనూ డిజిటలైజేషన్, ఆటోమేషన్, క్లీన్ కోల్ టెక్నాలజీల ద్వారా సరికొత్త అవకాశాలు వస్తున్నాయని, ఇంజనీరింగ్ యువత ఈ నూతన రంగాలను గమనించాలని కోరారు. కాగా, అంతకు ముందు ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆదిలాబాద్‌లో జాయింట్ యూజర్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నామని, ఎయిర్‌పోర్టు ఏర్పాటుపై సీఎం, కేంద్రమంత్రులతో అనేక సార్లు చర్చలు జరిపామని తెలిపారు. ఆదిలాబాద్‌లో ఎయిర్‌ఫోర్స్ బేస్ రాబోతోందన్న కిషన్ రెడ్డి, 1,500 ఎకరాల్లో ఆదిలాబాద్‌లో వాయుసేన బేస్ ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఎయిర్‌పోర్టు, ఎయిర్‌ఫోర్స్ బేస్ కోసం రక్షణ శాఖ ఎక్కువ శాతం ఖర్చు చేయబోతోందన్న ఆయన, రాష్ట్రప్రభుత్వం నోడల్ ఆఫీసర్‌ను త్వరలోనే నియమించాలని సూచించారు. ప్రధాని మోదీతో ఎయిర్‌పోర్టు శంకుస్థాపన చేయిస్తామన్నారు.

# ఇళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం

>> అన్నారు. సింగరేణి కుటుంబాలు దశాబ్దాలుగా నివసిస్తున్న తమ ఇళ్ల స్థలాలపై హక్కు పత్రాల కోసం నిరీక్షి స్తున్నాయని, వారి సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సింగరేణి బొగ్గు బెల్ట్ ప్రాంతంలోని ఇళ్ల స్థలాల సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం చూపుతూ, అర్హులైన కుటుంబాలకు హక్కు కల్పించే ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని చెప్పారు.
సింగరేణి కార్మికుల ఇండ్ల స్థలాల సమస్యపై శనివారం నాడు సచివాలయంలో అధికారులతో సమీక్షి ంచారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి సమయంలో జారీ చేసిన జిఒ. నెం. 76, పరిగణనలోకి తీసుకొని, భూముల స్వభావం, ప్రభుత్వ/సింగరేణి హక్కులు, ప్రస్తుత నివాస పరిస్థితులు, చట్టపరమైన అంశాలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తున్నామని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.

# ఎర్రవల్లి రైతులకు నోటీసులు జారీ

## సర్వే నం.325పై సమగ్ర సర్వే

### 388.5 గుంటల ప్రభుత్వ భూమిపై విచారణకు నోటీసులు

### 21న హాజరుకావాలని పట్టాదారులకు ఆదేశం

**మర్కుక్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** మండల పరిధిలోని కెసిఆర్ ఫాంహౌస్ ఎర్రవల్లి గ్రామ శివారులోని సర్వే నెం.325లో ఉన్న ప్రభుత్వ భూములపై రెవెన్యూ అధికారులు సమగ్ర సర్వే చేపట్టారు. మర్కుక్ తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎర్రవల్లి రైతులకు నోటీసులు జారీ అయ్యాయి.



అధికారులు జారీచేసిన నోటీసును చూపుతున్న ఎర్రవల్లి రైతు

అందుబాటులో ఉన్న రైతులకు నోటీసులు అందజేయగా, మిగతా వారివి గ్రామపంచాయతీ కార్యాలయంలో నోటీస్ బోర్డులో ఏర్పాటు చేశారు. సర్వే నెం.325లో మొత్తం 388.5 గుంటల భూమికి సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. సర్వే నెం.325కు సంబంధించిన భూముల హద్దులు, విస్తీర్ణం, ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు నోటీసు ద్వారా స్పష్టం చేశారు. ఈనెల 21న భూముల వద్దకు రైతులు హాజరై తమ వద్ద ఉన్న పత్రాలను అధికారులకు చూపించాలని నోటీసులో పేర్కొన్నారు. సర్వే సందర్భంగా భూమి హద్దులు, రికార్డులో ఉన్న వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తదుపరి నివేదికను సిద్ధం చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియలో భాగంగా సంబంధిత రెవెన్యూ, సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనున్నారు. జిల్లా కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ అధికారి, జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి తదితర అధికారులకు నోటీసు ప్రతులను పంపించినట్లు పత్రంలో పేర్కొన్నారు. సర్వే నెం.325లోని 388.5 గుంటల భూమిపై సమగ్ర సర్వేకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం స్థానికంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈనెల 21న నిర్వహించే క్షేత్రస్థాయి సర్వేలో భూమికి సంబంధించిన వాస్తవ పరిస్థితులు, రికార్డులోని వివరాలను అధికారులు పరిశీలించనున్నారు.

# మహిళ పట్ల హోంగార్డు అమానుషం

## హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌లో గొడవకు దిగిందని

## జుట్టుపట్టుకుని ఈడ్చుకువెళ్లిన వైనం

### హోంగార్డును డిస్మిస్ చేసిన అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** శివార్లలోని హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌లో ఒంటరి మహిళపై హోంగార్డు అమానుషంగా ప్రవర్తించిన తీరు పోలీసు శాఖకు తలవంపులు తెచ్చిపెట్టింది. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌లో కొందరు గొడవపడుతు న్నట్లు అందిన సమాచారం మేరకు అక్కడే విధుల్లో వున్న హోంగార్డు కడిగా ఆనంద్ (37) వచ్చాడు. ఈ సమయంలో గుంపులోని ఓ మహిళ హోంగార్డుతో ఎదో విషయమై గొడవకు దిగగా దీనిని సహించని ఆనంద్ ఆ మహిళను లాఠీతో కొట్టి జుట్టు పట్టుకుని కొంతదూరం ఈడ్చుకుని వెళ్లాడు. ఆ సమయంలో ఒక చిన్నారి సదరు మహిళ వెంట ఏడుస్తూ వెంట రావడం కనిపించింది.



హోంగార్డు ఆనంద్ మహిళ జుట్టు పట్టుకు ని ఈడ్చుకు పోవడాన్ని పక్కనే వున్న మరో వ్యక్తి నివారించగా అతను వినిపించుకోలేదు. కాగా హోంగార్డు ఆనంద్ దాష్టికాన్ని అక్కడే వున్న కొం దరు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి సోషల్ మీడియాలో వుంచారు. అర్థరాత్రి ఒంటి గంట సమయంలో ఇది వైరల్‌గా మారడంతో దీనిపై మియాపూ ర్ పోలీసులు వెంటనే స్పందించి మహిళ పట్ల అమానుషంగా ప్రవర్తించిన హోంగార్డు ఆనంద్‌పై పలు సెక్షన్ల కింద సుమోటోగా కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు. ఇదే సమయంలో హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్‌లో డిప్యూటేషన్‌పై విధుల్లో వున్న హోంగార్డు ఆనంద్‌ను రైల్వే శాఖ వెంట నే రిలీవ్ చేసింది. ఇతను వికారాబాద్ జిల్లాకు చెందిన హోంగార్డు కావడంతో అక్కడకు పంపించారు. హోంగార్డు దాష్టికం శనివారం ఉదయం మరింతగా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దీనిపై సైబరాబాద్ కమిషనర్ రమేష్ రెడ్డి స్పందించి వీడియో విడుదల చేశారు. మహిళపట్ల అమానుషంగా ప్రవర్తించిన హోంగార్డు ఆనంద్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించిన ట్లు ఆయన తెలిపారు. మరోవైపు హోంగార్డు ఆనంద్‌ను వికారాబాద్ జిల్లా ఎస్పి స్నేహ మెహ్రా ఉద్యోగం నుంచి డిస్మిస్ చేశారు. ఇదే ఉదంతంపై డిజిపి ఆనంద్ ట్విటర్‌లో స్పందించారు. మహిళపట్ల అమానుషంగా ప్రవర్తించిన హోంగార్డు ఆనంద్‌పై చట్టపరంగా కఠిన చర్యలు వుంటా యని తెలిపారు. అతన్ని ఉద్యోగం నుంచి తొలగించామని వివరించారు. కాగా ఈ ఘటనలో బాధిత మహిళ ఎవరన్నది ఇంతవరకు తెలియరాలే దు. హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ సమీపంలో చెత్త ఏరుకునే వారిలో ఒకరుగా స్థానికులు చెబుతున్నారు. ఆమె కోసం మియాపూర్ పోలీసులు గాలి స్తున్నారు. ఆమె ఆచూకి తెలుసుకుని ఫిర్యాదు తీసుకునేందుకు మియాపూర్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.



# చాట్‌జిపిటిలో ప్రశ్నపత్రం అప్‌లోడ్

## పట్టుబడిన విద్యార్థి ఆత్మహత్య

**ముంబై, సెప్టెంబరు 19:** ఐఐటీ ముంబై ఎనర్జీ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన రెండో సంవత్సరం విద్యార్థి పరీక్ష సమయంలో మొబైల్ ఫోన్ ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. అతను పరీక్ష ప్రశ్నపత్రాన్ని చాట్‌జిపిటిలో అప్‌లోడ్ చేసి సమాధానాలు పొందేందుకు ప్రయత్నించినట్లు సంస్థ తెలిపింది. అయితే ఈ ఘటనపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోలేదని ఐఐటి బాంబే స్పష్టం చేసింది. ఇన్‌స్ట్రక్టర్, విభాగాధిపతి విద్యార్థితో మాట్లాడి కౌన్సెలింగ్ ఇచ్చారని, ఈ ఘటన అతని విద్యా భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపదని భరోసా ఇచ్చారని సంస్థ వెల్లడించింది. అనంతరం విద్యార్థి హాస్టల్ గదికి వెళ్లగా, అదే రోజు సాయంత్రం అతను మృతి చెందిన స్థితిలో కనిపించాడు. పరీక్ష సాయంత్రం 4 గంటల వరకు జరిగింది. అనంతరం విద్యార్థి హాస్టల్ గదికి వెళ్లి ఈ ఘటనకు పాల్పడినట్లు తెలిపారు. పోలీసులు దీనిపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటన అనంతరం ఐఐటి బాంబే క్యాంపస్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు నిరసనకు దిగారు. 400 మందికి పైగా విద్యార్థులు సంస్థ ప్రధాన భవనం వద్దకు చేరుకుని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడించాలని, పారదర్శకతతో వ్యవహరించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల వర్గం మాత్రం ఈ ఘటనకు సంబంధించి తమకు తెలిసిన వివరాలు సంస్థ అధికారిక ప్రకటనకు భిన్నంగా ఉన్నాయని ఆరోపించింది. క్రమశిక్షణా చర్యలు, సస్పెన్షన్ వంటి అంశాలపై విద్యార్థుల్లో భయాందోళనలు నెలకొన్నాయని కొందరు పేర్కొన్నారు. అయితే ఈ వాదనలు స్వతంత్రంగా ధృవీకరించబడలేదు. ఐఐటి బాంబే మాత్రం విద్యార్థిపై ఎలాంటి క్రమశిక్షణా చర్యలు ప్రారంభించలేదని స్పష్టం చేసింది.

# గ్రామీణ ప్రాంతాల్లో పనులను వేగవంతం చేయాలి

## శాఖల మధ్య సమన్వయంతో

## భవనాల నిర్మాణం పూర్తి

## చేయాలి: మంత్రి సీతక్క

**హైదరాబాద్, సెప్టెంబరు19, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన గ్రామపంచాయతీ భవనాలు, గ్రామ సమైక్య భవనాలు, అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. శనివారం సచివాలయంలో గ్రామ పంచాయతీ భవనాలు, గ్రామ సమైక్య భవనాలు, అంగన్వాడీ భవనాల నిర్మాణ పనుల పురోగతిపై పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో స్పెషల్ సీఎస్ దాన కిశోర్, పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కమిషనర్ శృతి ఓఝా, పంచాయతీరాజ్ ఈఎన్సీ జగదీష్‌తోపాటు వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



సమీక్ష సందర్భంగా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ భవన నిర్మాణ పనుల పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్రంలో మొత్తం 9,745 గ్రామ సమైక్య భవనాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 534 భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మరో 6,141 భవనాల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయని, 3,070 భవనాల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కావాల్సి ఉందని మంత్రికి వివరించారు. పనులు ప్రారంభం కాని భవనాలకు సంబంధించి కారణాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశిం చారు. నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను శాఖల మధ్య సమన్వయంతో పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో 3,906 గ్రామపంచాయతీ భవనాలు మంజూరు కాగా, ఇప్పటికే 444 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన 3,444 భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. గ్రామపంచాయతీ భవనాలు గ్రామీణ ప్రాంతాల్లో పరిపాలనకు కీలకమైన మౌలిక వసతులని పేర్కొన్న మంత్రి, నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

అంగన్వాడీ భవనాల నిర్మాణంపై మంత్రి సీతక్క ప్రత్యేకంగా సమీక్షి ంచారు. రాష్ట్రంలో 2,313 అంగన్వాడీ భవనాలు మంజూరు కాగా, ఇప్పటివరకు 200 భవనాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన 2,113 భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్నందున వాటి నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు అందుబాటులో ఉన్న అన్ని రకాల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అంగన్వాడీ భవనాల నిర్మాణానికి అదనపు నిధులను సమీకరించేందుకు ఎంపీ లాడ్స్ నిధులను కూడా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని మంత్రి నిర్ణయించారు. ఇందుకోసం రాష్ట్రంలోని ఎంపీలకు తానే లేఖలు రాయనున్నట్లు తెలిపారు. చిన్నారుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఎంపీ లాడ్స్ నుంచి కనీసం రూ.1 కోటి చొప్పున కేటాయించేలా ఎంపీలను కోరుతూ లేఖలు రాయనున్నట్లు మంత్రి సీతక్క తెలిపారు.

అలాగే అంగన్వాడీ భవనాల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నుంచి రూ.8 లక్షల వరకు వినియోగించుకునే అవకాశం ఉందని, మిగిలిన రూ.4 లక్షల కోసం అందుబాటులో ఉన్న ఇతర నిధులను వినియోగించాలని కలెక్టర్లను మంత్రి కోరారు. ప్రతి నెలా నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. మంజూరైన పనుల్లో ఏవి పూర్తయ్యాయి, ఏవి పురోగతిలో ఉన్నాయి, ఇంకా ప్రారంభం కాని పనులు ఎందుకు ప్రారంభం కాలేదు అనే అంశాలపై ప్రతి సమీక్షలో వివరాలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# తెలుగు రాష్ట్రాల్లో రూ.2.95 లక్షల కోట్ల మ్యూచువల్ ఫండ్

## అసోసియేషన్ ఆఫ్

## మ్యూచువల్ ఫండ్స్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో మ్యూచువల్ ఫండ్ భాగస్వామ్యం పెరుగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కలిసి రూ. 2.95 లక్షల కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్ ఆస్తులను కలిగి ఉన్నాయి. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియా (ఎఎమ్ఎఫ్ఐ) శనివారం విడుదల చేసిన డేటాలో వెల్లడించింది. జూలై నాటికి తెలంగాణలోని మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తుల నిర్వహణలో 87 శాతం వాటా హైదరాబాద్‌దే. ఈ డేటా ప్రకారం నగరంలోని మ్యూచువల్ ఫండ్ ఆస్తులు రూ. 1,84,261 కోట్లకు చేరాయి. ఇది జూలై 2025తో పోలిస్తే 18 శాతం అధికం. మ్యూచువల్ ఫండ్ ఆస్తుల విషయంలో భారతదేశంలోని అగ్ర 30 నగరాలలో హైదరాబాద్ ఎనిమిదో స్థానంలో నిలిచింది. దేశ మొత్తం ఆస్తులలో 2.10 శాతం వాటాను కలిగి ఉంది. ఇక్కడ 54.44 లక్షల మ్యూచువల్ ఫండ్ ఫోలియోలు ఉన్నాయి, ఇది తెలంగాణ మొత్తం ఫోలియోల సంఖ్యలో 66.2 శాతంగా ఉంది. తెలంగాణ మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తుల నిర్వహణలో (ఎయుఎమ్) జూలై నాటికి రూ. 2,12,856 కోట్లకు చేరుకుంది, ఇది గత ఏడాది ఇదే నెలతో పోలిస్తే 19 శాతం పెరుగుదల. అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఈ రాష్ట్రం ఎనిమిదో స్థానంలో నిలిచింది. భారత దేశ మొత్తం మ్యూచువల్ ఫండ్ ఆస్తులలో 2.5 శాతం వాటాను కలిగి ఉంది. ఈ రాష్ట్రంలో 82.24 లక్షల ఫోలియోలు ఉన్నాయి, ఇది జాతీయ మొత్తంలో సుమారు 2.9 శాతం. జూలై 2026 నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు కలిసి రూ. 2.95 లక్షల కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్ ఆస్తులను కలిగి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ మ్యూచువల్ ఫండ్ ఎయుఎమ్ రూ. 82,409 కోట్లుగా నమోదైంది. ఇది జులై 2025తో పోలిస్తే 23 శాతం పెరుగుదల. ఈ రాష్ట్రం జాతీయంగా 15వ స్థానంలో నిలిచింది. భారతదేశ మ్యూచువల్ ఫండ్ ఆస్తులలో దాదాపు 1 శాతం వాటాను కలిగి ఉంది. దీని ఫోలియోల సంఖ్య 79.44 లక్షలు దాటింది. విశాఖపట్నం రూ. 16,614 కోట్ల ఎయుఎమ్‌తో ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద మ్యూచువల్ ఫండ్ కేంద్రంగా నిలిచింది. ఇది రాష్ట్ర మొత్తం ఎయుఎమ్‌లో దాదాపు ఐదవ వంతు కాగా, రూ. 8,337 కోట్లతో విజయవాడ దాని తర్వాతి స్థానంలో ఉంది.

# థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపోనిగ్ గంజాయి స్మగ్లింగ్

## 96 మంది నిందితులు గుర్తింపు

## గుజరాత్, మహారాష్ట్రకు చెందిన 67 మందికి ఈగల్ నోటీసులు

## విచారణకు హైదరాబాద్ రావాలని ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు ఇటీవల పలుమా ర్లు స్మగ్లింగ్ అయిన హైడ్రోపోనిక్ గంజాయి వెనుక అంతర్జాతీయ నెట్‌వర్క్ వుందని ఈగల్ పోలీసులు గుర్తించారు. ఈ నెట్‌వర్క్‌లో లింకులున్న 67 మంది గుజరాత్, మహారాష్ట్రకు చెందిన వ్యక్తులకు ఈగల్ పోలీసులు నోటీసులు జారీ చేశారు. భారత్‌లో లభించే గంజాయి తో పోలిస్తే థాయ్‌లాండ్‌లో లభించే హైడ్రోపోనిక్ గంజాయి నాణ్యత ఎక్కువగా వుండడం తో పాటు ఘాటు, మత్తు కూడా హెచ్చుగానే వుంటుందని నిపుణులు వెల్లడించడం తెలిసిం దే. ఈ క్రమంలోనే భారత్‌కు చెందిన కొందరు డ్రగ్స్ స్మగ్లర్లు థాయ్‌లాండ్‌లో నెలల తరబ డి మకాం వేసి కొన్ని చోట్ల భూములు లీజుకు తీసుకుని హైడ్రోపోనిక్ గంజాయిని సాగు చేస్తుండడం విదితమే. వీరికి వ్యవసాయంలో నైపుణ్యం వున్న కొందరు శాస్త్రవేత్తలు సహక రించడంతో నాణ్యమైన గంజాయి ఆ దేశంలో సాగవుతోంది. ఈ గంజాయికి అంతర్జాతీయ ంగా మంచి మార్కెట్ వుంది. గడచిన కొన్నేళ్లు థాయ్‌లాండ్ నుంచి పలుమార్గాలలో ఈ గం జాయి భారత్‌లోని అనేక నగరాలకు రవాణా అవుతోంది. శంషాబాద్ విమానాశ్రయంలో ఇటీవల పలుమార్లు ఈ రకం గంజాయి పట్టుబడగా కొందరు అరెస్టయ్యారు. వీరి వెనుక ఎవరున్నారనే దానిపై కూపీలాగిన ఈగల్ పోలీసులు మొత్తం 96 మంది వున్నట్లు గుర్తిం చారు. వీరిలో 67 మంది మహారాష్ట్ర, గుజరాత్‌కు చెందిన వారు వున్నట్లు తేలగా వారిని విచారించేందుకగానూ నోటీసులు జారీ చేశారు. వీరంతా థాయ్‌లాండ్ నుంచి భారత్‌కు హైడ్రోపోనిక్ గంజాయి రవాణా చేయడంలో కీలకంగా వ్యవహరించినట్లు ఈగల్ పోలీసుల విచారణలో తేలింది.

# రెండు ఘోర ప్రమాదాలు.. ఏడుగురు దుర్మరణం

## గణేశ నిమజ్జనంలో విషాదం..

## శంషాబాద్ మండలంలో నలుగురి మృతి

## శామీర్‌పేట ఓఆర్ఆర్‌పై రెండు వాహనాలు ఢీకొని ముగ్గురు మృతి



ప్రమాదంలో మృతి చెందిన కుటుంబసభ్యులు వీరే

**శంషాబాద్ మండలం పాలమాకులలో..**

**శంషాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** గణేశ నిమజ్జనం తర్వాత స్వగ్రామానికి తిరిగివస్తున్న ఓ కుటుంబాన్ని రోడ్డుప్రమాదం విషాదంలో ముం చింది. శంషాబాద్ మండలం పాలమాకుల శివారులోని ఎన్‌హెచ్44పై శనివారం తెల్ల వారు జామున జరిగిన ఘోర ప్రమాదంలో నలుగురు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. శంషాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం మేట్టుగడ్డ తండాకు చెందిన కుటుంబసభ్యులు గణేశ నిమజ్జనం అనంతరం ఇన్నోవా వాహనం లో శంషాబాద్‌వైపు వస్తుండగా వారి వాహనం పాలమాకుల శివారులోని ఎన్‌హెచ్44పై కల్వర్టును ఢీకొనగా నలుగురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులను కేతావత్ లింబ్యా (54), భార్య కేతావత్ జమున (45), కత్రావత్ మాన్‌సింగ్ (48), కేతావత్ వస్రాం(45)గా గుర్తిం చారు. వాహనాన్ని నడుపుతున్న సబావత్ అశోక్‌కు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన అశోక్‌ను చికిత్స నిమిత్తం శంషాబాద్‌లోని ట్రైడెంట్ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఫ్యూచర్ సిటీ ట్రాఫిక్ డీసీపీ శివం ఉపాధ్యాయ ఆధ్వర్యంలో ప్రమాద స్థలాన్ని సంయుక్తంగా పరిశీలించారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలోని రహదారి పరిస్థితి బాగున్నట్లు గుర్తిం చారు. ప్రమాద స్థలంలో సిమెంట్ బ్లాకులు లేవని గుర్తించారు. వాహనం అధిక వేగంతో ప్రయా ణి స్తున్న సమయంలో డ్రైవర్ నియంత్రణ కోల్పోయి బ్రిడ్జి నిర్మాణాన్ని ఢీకొన్నట్లు తెలుస్తోందన్నారు.

**శామీర్‌పేట ఓఆర్ఆర్‌పై దుర్ఘటన..**



శామీర్‌పేట ఓఆర్ఆర్‌పై అతివేగంగా వస్తూ టాటా ఏస్ వాహనాన్ని ఢీకొన్న డిసిఎం వ్యాన్

**శామీర్‌పేట, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** శామీర్‌పేట ఔటర్ రింగురోడ్డుపై ఘోర ప్రమాదం జరిగి ముగ్గురు వ్యక్తులు మృతి చెందారు. టాటా ఎస్ వాహనం టైర్ పంచర్ కావటంతో డ్రైవర్, మరో ఇద్దరు టైర్ ఎక్కిస్తుండగా వెనక నుంచి అతి వేగంగా వచ్చిన డిసిఎం వ్యాన్ టాటా ఏస్ వాహనాన్ని ఢీకొనటంతో ఈ ఘోర ప్రమాదం జరిగింది. ఇద్దరు అక్కడిక్కడే మృతిచెందగా, మరొకరిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఓఆర్ఆర్‌పై శుక్రవారం అర్థరాత్రి దాటాక జరిగింది. శామీర్‌పేట పోలీసుల కథనం ప్రకారం.. మెదక్ జిల్లా చేగుంట నుంచి జాతీయ రహదారిన టాటా ఎస్ వాహనంలో స్క్రాప్ లోడ్‌తో నాచారంలోని కంపెనీకి తరలించటానికి బయలు దేరింది. ఆ వాహనంలో డ్రైవర్‌తోపాటు మరో నలుగురు కూలీలు ఉన్నట్లు తెలిపారు. శామీర్‌పేట ఓఆర్ఆర్ ఎగ్జిట్ దాటాక లియోనియా బ్రిడ్జి సమీపంలోకి చేరగానే టాటా ఎస్ వాహనం టైర్ పంఛర్ కావటంతో ఓఆర్ఆర్‌పై రోడ్డుకు పక్కనే నిలిపినట్లు తెలిపారు. ఆ వాహనంలో ఉన్న ఇబ్రహీం హుస్సేన్ (26), షేక్ అమీర్ (20), రింకు (34), మరో ఇద్దరు అశోక్, భీమ్‌షా కూడ ఉన్నారు. అయితే నగరంలోని ముషీరా బాద్, ఫలక్‌నామా, యు.పి ప్రాంతాలకు చెందిన వారు అని తెలిపారు. డ్రైవర్ ఇబ్రహీం హుస్సేన్, కూలీలు షేక్ అమీర్, రింకులు టైర్ ఎక్కిస్తుండగా హామీద్‌పూర్ నుంచి శామీర్‌పేట ఓఆర్ఆర్ మీదుగా అతివేగంగా వస్తున్న డిసిఎం వ్యాన్ టాటా ఎస్ వాహనాన్ని ఢీ కొనటంతో టాటా ఎస్ వాహనం డ్రైవర్ ఇబ్రహీం హుస్సేన్(26), కూలీ రింకు(34) ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరొక కూలి షేక్ అమీర్(20)ని నగరంలోని హాస్పిటల్ తరలిస్తుండగా మార్గ మధ్యం లో మృతి చెందినట్లు పోలీసులు తెలిపా రు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్ మార్చురికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. శామీర్‌పేట సిఐ కె.నర్సింహ్మారెడ్డి పర్యవేక్షణలో పోలీస్ డిఐ మహేశ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు

## అనేకచోట్ల అక్రమాలు

## జరిగినట్లు గుర్తింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివారు ప్రాంతాలలో గల ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజిల్లో వరుసగా రెండవ రోజూ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికా రులు తనిఖీలు చేబట్టారు. ఈ సందర్భంగా అనేక కాలేజిల్లో అక్రమాలు జరిగినట్లు అధికారుల పరిశీలనలో తేలినట్లు తెలిసింది. భోగస్ అడ్మిషన్లతో ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలతో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ కోసం కొన్ని కాలేజిలు విద్యార్థుల సంఖ్యను ఎక్కువచేసి చూపడం, వీరందరి పే రిట ప్రభుత్వం నుంచి ఎక్కువగా నిధులను తీసుకోవడం జరుగుతున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు సమాచారం అందింది. ఇదే విషయమై ఈ విభాగం అధికారులు మరింత సమాచారం సేకరించి, క్షేత్రస్థాయిలో వివరాలు తెలుసుకుని దాడులు చేబట్టారు. కొన్ని నెలలుగా ప్రైవేటు ఇ ంజనీరింగ్ కాలేజీలు ప్రభుత్వం నుంచి తమకు ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులు రావాడం లేదని, వీటి గురించి అడిగితే తప్పుడు కేసులు పెడుతున్నారని ఆరోపిస్తుండడం తెలిసిందే. ఇదే సమయంలో కొందరు రా జకీయ పార్టీల నేతలు ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు మద్ద తుగా ఆందోళన చేయడంతో ఇదికాస్త రాజకీయ రగడకు దారితీసింది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రైవేటు ఇంజనీ రింగ్ కాలేజిలపై దాడులు చేసి అక్కడి అక్రమాలను వెలుగులోకి తెచ్చాయి. విశ్వసనీయ సమాచారం మేరకు పది కాలేజీల్లో అక్రమాలు జరిగిన ట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు ఆధారాలు లభించినట్లు తెలిసింది. మరికొన్ని కాలేజీల్లోనూ తనిఖీలు నిర్వహించిన తరువాత సర్కారుకు ఒక నివేదిక ఇవ్వాలని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్ణయించారని తెలిసింది.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యులు

# ధన్వాడ మోడల్ హాస్టల్‌లో ఫుడ్‌పాయిజన్

## టిఫిన్ చేసి కడుపునొప్పి, కళ్లు తిరిగి పడిపోయిన విద్యార్థినులు

## ఏడుగురు బాలికలు జిల్లా ఆస్పత్రికి తరలింపు

**ధన్వాడ, సెప్టెంబరు 19 ప్రభాతవార్త :** ధన్వాడ మోడల్ హాస్టల్‌లో శనివారం ఫుడ్ పాయిజన్‌తో పలువురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. ఉదయం టిఫిన్ చేసిన అనంతరం విద్యార్థులు తరగతులకు వెళ్లారు. రెండో పీరియడ్ తర్వాత కొందరికి కడుపునొప్పి, కళ్లతిరిగి పడిపోవడం వంటి లక్షణాలు కనిపించడంతో ఉపాధ్యాయులు వెంటనే వారిని ధన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థినులకు పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది చికిత్స అందించారు. పరిస్థితి తీవ్రంగా ఉన్న ఏడుగురు బాలికలను మెరుగైన వైద్యం కోసం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. మిగతా విద్యార్థినులకు ధన్వాడ పీహెచ్‌సీలోనే చికిత్స కొనసాగుతోంది. అత్యవసర చికిత్స అవసరమైన వారిని నారాయణపేట ఆస్పత్రికి తరలించామని, మిగతా వారికి పీహెచ్‌సీలో వైద్యం అందిస్తు న్నామని వైద్యాధికారి అనూష తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినులు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

# తెలంగాణలో డ్రగ్స్ వ్యాపారం

## రాజస్థాన్‌లో ముగ్గురు స్మగ్లర్లను పట్టుకున్న ఈగల్

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఓపిఎంతో పాటు సింథటిక్ డ్రగ్స్‌ను స్మగ్లింగ్ చేస్తూ తప్పించుకు తిరుగుతున్న రాజస్తా న్‌కు చెందిన ముగ్గురు బడా స్మగ్లర్లను ఈగల్ పోలీసులు రాజస్తాన్‌లో పట్టుకున్నారు. రాజస్థాన్‌కు చెందిన జయకిషన్ (28)పై మీర్‌పేట్, పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్లలో హెరాయిన్‌తో పాటు ఓపియం విక్రయాలకు సంబంధించిన కేసులున్నాయి. ఈ రెండు కేసుల్లో ఇతను చాలా కా లంగా వాంటెడ్‌గా వున్నారు. కాగా రాజస్తాన్‌కే చెందిన సురేష్ (30)పై రాయదుర్గంతో పాటు రాజస్తాన్‌లో హెరాయిన్, ఓపియం వంటి డ్రగ్స్ అమ్మకాలకు సంబంధించిన కేసులున్నాయి. రాజస్తాన్‌లోని జాలోర్‌కు చెందిన దినేష్ కుమార్ (32)పై హైదరాబాద్‌లో ఓపిఎం అమ్మకాలకు స ంబంధించిన కేసులున్నాయి. వీరి గురించి గాలించగా రాజస్తాన్‌లో వున్నట్లు అందిన సమాచారం మేరకు ఈగల్ పోలీసులు సైబరాబాద్‌కు చెం దిన మరికొందరు పోలీసులతో కలిసి రాజస్తాన్‌కు వెళ్లి అక్కడే కొన్నిరోజుల పాటు మకాం వేసి ముగ్గురిని పట్టుకున్నారు. ఈ సమయంలో రాజ స్తాన్‌కు చెందిన పోలీసులు సహకరించారు. నిందితుల వద్ద రెండు కార్లు, నాలుగు సెల్ ఫోన్లను జప్తు చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ స్మగ్లింగ్‌పై కఠి నంగా వుంటామని ఈగల్ డైరక్టర్ సం దీప్ శాండిల్యా తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎలాంటి సమాచారం వున్నా 1908 లేదా 8712671111కు వెంటనే ఫోన్ చేయాలని ఆయన ప్రజలను కోరారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM
Short Tender Notice No.51/2026-27/SE (W-East)/EE-East / DB/GVMC/ Dt:17-09-2026

| | | |
|---|---|---|
| 01. No.of Works | : | 1 No |
| 02. Value of works (ECV) | : | Rs.53.91 Lakhs |
| 03. Downloading Starting Date | : | 17-09-2026 @ 11.00 PM |
| 04. Downloading End Date | : | 25-09-2026 @ 02.00 PM |
| 05. Last date for Submission of bid | : | 25-09-2026 @ 03.00 PM |

Further details at http://www.apeprocurement.gov.in
O/o The Executive Engineer (PW-III) Division
Sd/- Commissioner, GVMC

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు
(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)
తేది: 20.09.2026
రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి ప్రజాసేవ పార్టీ అధ్యక్షులు శ్రీ తల్లారం నర్సింలు గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ తల్లారం నర్సింలు గారు అధ్యక్షులు, (2) శ్రీ బింగి రాములు గారు ప్రధాన కార్యదర్శి, (3) శ్రీ బోజన సాయిరాం గారు కోశాధికారి ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము ప్రజాసేవ పార్టీ ఇం.నం. 8-1-297/SN/157, షేక్‌పేట్ సరాయి నక్కలబాయి నగర్, మణికొండ రోడ్, షేక్‌పేట్, హైదరాబాద్-500008, తెలంగాణ రాష్ట్రం. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C. గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు ప్రజాసేవ పార్టీను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.
శ్రీ తల్లారం నర్సింలు, అధ్యక్షులు,
ప్రజాసేవ పార్టీ.

గతంలో సంచలనం రేపిన టాలీవుడ్ డ్రగ్స్ కేసు గురించి తెలిసిందే. పలువురు సినీ తారలకు డ్రగ్స్‌తో సంబంధాలు ఉన్నాయని వార్తలు వచ్చాయి. వీరితో పాటు అనేక మంది సెలబ్రటీలు సైతం ఇందులో ఇరుక్కోవడం విదితమే. డ్రగ్స్ మాఫియాపై సర్కారు కఠిన చర్యలు తీసుకుంటుందని కేంద్రంతో పాటు రాష్ట్రాలు పదేపదే చెబుతున్నా క్షేత్ర స్థాయిలో పరిస్థితులు దీనికి భిన్నంగా వున్నాయి. డ్రగ్స్ మాఫియాలో పదుల సంఖ్యలోనే నేరగాళ్లు వుండే వీలుండగా గంజాయి స్మగ్లింగ్‌లో వందలాది మంది వుండడం చెప్పుకోదగ్గ అంశం. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న వారిపై వీటిని అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు నార్కోటిక్ బ్యూరో నిబంధనల ప్రకారం పట్టుబడిన వారికి బెయిలు రాకుండా చేసి, ఏడాదిలోపు విచారణ పూర్తి చేసి పదేళ్ల వరకు జైలు శిక్షలుపడేలా చేయాల్సిన అవసరం వుంది. గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్నవారు పోలీసులు లేదా అబ్కారీ అధికారులకు పట్టుబడిన సమయంలో చాలా సులభంగా బెయిలు పొందుతూ తప్పించు కుంటున్నారు. ఇలా పారిపోతున్న వారు మళ్లీ కనిపించడం లేదు. ఇదే సమయంలో కాగితాలకే పరిమితమైన మరో అంశం గంజాయి సాగు దారులపై పిడి అమలు. దీనిపైనా తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు వెంటనే స్పందించాల్సిన అవసరం వుంది. గంజాయి సాగు చేస్తున్నవారు కూడా సుల భంగా బెయిలు పొందుతూ మళ్లీ అదే నేరం చేస్తున్నా ఇప్పుడున్న సాదాసీదా చట్టాల వల్ల పోలీసు, అబ్కారీ శాఖ ఏమీ చేయలేకపోతున్నాయి. వీరిపై పిడి అమలు చేసి ఏడాది పాటు జైల్లో వుంచితే మరోసారి నేరం చేసేందుకు భయపడే వీలుంది. డ్రగ్స్ మాఫియా, గంజాయి మాఫియా బీద, మధ్య తరగతి వర్గాల ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న నేపథ్యంలో ఇందులోని నేరగాళ్లపై ఇకనైనా ఉక్కుపాదం మోపాల్సిన అవసరం వుంది.

# డ్రగ్స్ వలయంలో భారత్

**డి.మురళీధర్ అమర్‌నాథ్**

అభివృద్ధిలో అగ్రదేశాలను సవాల్ చేస్తున్న భారత్ డ్రగ్స్‌ను అరికట్టే విషయంలో వెనుబడుతున్నట్లు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) నివేదికలు చెబుతున్నాయి. విదేశాలతో పోలిస్తే కుటుంబ వ్యవస్థ బలంగా వున్న భారత్‌లో మాదకద్రవ్యాల వాడకం గతంలో చాలా తక్కువగా వుండేది. కానీ ప్రపంచీకరణ ప్రభావం వల్ల ఏర్పడ్డ మార్పులు యువతను డ్రగ్స్ ఉచ్చులో పడేస్తున్నాయని ఆ నివేదిక తేటతెల్లం చేసింది. భారత్‌లో ఒకప్పుడు డ్రగ్స్ అంటే మారుమూల ప్రాంతాలలో కొందరు ఎక్కువగా సేవించే గంజాయి వరకే పరిమితం అయ్యేది. కానీ దీంతో పాటు భారత్‌లోనే అనేక చోట్ల తయారవుతున్న టన్నుల కొద్ది సింథటిక్ డ్రగ్స్, విదేశాల నుంచి దిగుమతి అవుతున్న కొకైన్, హెరాయిన్, ఘాటైన గంజాయి యువతను నిర్వీర్యం చేస్తోంది. మొత్తం మీద భారత్‌లో పది కోట్ల మంది డ్రగ్స్ వాడుతున్నారని ఎన్‌సిబి నివేదిక చెబుతోంది. ఇదే సమయంలో ఏటా 30లక్షల మంది కొత్తగా ఈ ఊబీలో చేరుతున్నట్లు అందులో వుంది. ఇదిచాలా ప్రమాదకరమని ఎన్‌సిబి చెబుతోంది. భారత్‌లో డ్రగ్స్‌వాడకం ఎక్కువగా వున్న రాష్ట్రం పంజాబ్ మొదటి స్థానంలో వుండగా ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్, మిజోరం, నాగాలాండ్ ఆ తరువాతి స్థానాల్లో వున్నాయి. ఇందులో పంజాబ్ పాక్‌కు సరిహద్దుల్లో వుండడంతో డ్రగ్స్ స్మగ్లింగ్‌తో పాటు వాడకం కూడా ఎక్కువగా వుంది. పంజాబ్ రాష్ట్రంలో డ్రగ్స్ వాడకం పెరిగిపోయి ప్రమాదకర స్థాయికి చేరడంపై పదేళ్ల క్రితం వచ్చిన ఉడ్తా పంజాబ్ సినిమా దేశవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. ఇక ఈశాన్య రాష్ట్రాలు బంగ్లాదేశ్, మయన్మార్‌కు సరిహద్దులో వుండడం వల్ల అక్కడ మాదకద్రవ్యాల వాడకం ఎక్కువగా వుంది. ఎన్‌సిబి గణాంకాల ప్రకారం 2025లో భారత్‌లో లక్షా33 వేల 965 కిలోల డ్రగ్స్ పట్టుబడ్డాయి. వీటి విలువ 1980 కోట్ల రూపాయలుగా తేలింది. మొత్తం మీద 994 మంది కరుడుగట్టిన స్మగ్లర్లతో పాటు మరో వెయ్యి మంది చోటా స్మగ్లర్లు పట్టుబడ్డారు. ఇందులో 25 మంది విదేశీయులు వున్నారు. ఇదే సమయంలో డ్రగ్స్ స్మగ్లర్లకు సంబంధించి 96.69 కోట్ల రూపాయల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. దక్షిణాది రాష్ట్రాలవరకు వస్తే కేరళ, తమిళనాడులో డ్రగ్స్‌వాడకం ఎక్కువగా వుందని ఎన్‌సిబి నివేదికలు చెబుతున్నాయి. దీని తరువాత తెలంగాణ, ఎపిలోనూ డ్రగ్స్ వాడకం పెరిగిందని ఆ నివేదిక తేటతెల్లం చేసింది. భారత్‌లో ఎక్కువగా ఉత్పత్తి అయ్యే డ్రగ్స్‌లో గంజాయి మొదటి స్థానంలో వుంది. ఏటా ఆరు లక్షల కిలోలకు పైగా గంజాయిని భారత్‌లోని పలు రాష్ట్రాల్లో ఉత్పత్తి చేస్తున్నారు. గంజాయి ఉత్పత్తిలో ఒడిషా అగ్రభాగాన వుంది. ఒడిషాలోని రాయగడ,



మల్కన్‌గిరి, కోరాపూట్, బౌద్ధ్, గంజాం తదితర జిల్లాలలో గంజాయి సాగు ఎక్కువగా వుంది. ఇవన్నీ అటవీ ప్రాంతం ఎక్కువగా వున్న జిల్లాలు కావడం, పోలీసులు వెళ్లలేకపోవడం వంటి అంశాలు స్మగ్లర్లకు వరంగా మారింది. దీని తరువాత హిమాచల్ ప్రదేశ్‌లో ఇటీవల హైబ్రీడ్ గంజాయి సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. దీనిని హైడ్రోపోనిక్ గంజాయి అని కూడా పిలుస్తారు. సాధారణ గంజాయితో పోలిస్తే ఎక్కువ ఘాటు, నాణ్యత కూడా మంచిగా వుండడం దీని ప్రత్యేకత. ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లో కూడా ఇది ఎక్కువగా సాగవుతోంది. అక్కడ సాగుదారులు భారతీయులే కావడం గమనార్హం. ఇక రసాయన డ్రగ్స్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఉత్పత్తి అవుతోంది. మూతపడ్డ పరిశ్రమల్లో ఎవరికి అనుమానం రాకుండా ఈ డ్రగ్స్‌ను కొందరు కెమిస్ట్‌లు తయారు చేస్తున్నారు. గంజాయితో పాటు ఇతర రకాల డ్రగ్స్ రవాణా, స్మగ్లింగ్ కష్టంగా మారడంతో చాలా మంది వ్యసనపరులు సులభంగా అందుబాటులో వుంటున్న సింథటిక్ డ్రగ్స్ వైపు చూస్తున్నారని ఎన్‌సిబి అధికారులు చెబుతున్నారు. గంజాయి సాగు వరకు వస్తే నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో గణాంకాల ప్రకారం దేశంలోని 15రాష్ట్రాల్లో గంజాయి సాగు ఏయేటి కాయేడు పెరుగుతూనే వుంది. ఈశాన్య రాష్ట్రాల్లో గంజాయి సాగు ఎక్కువగా వుండగా ఒడిషాతో పాటు దక్షిణాది రాష్ట్రం తమిళనాడుతో పాటు ఎపిలో దీని సాగు ఎక్కువగా వుంది. ఒడిషాకు ఎపి సరిహద్దు కావడంతో దాని ప్రభావం ఎపిలోని పలు ప్రాంతాల్లో వుందని అధికారులు చెబుతున్నారు. ఇక తెలుగు రాష్ట్రాలు గంజాయి కారిడార్‌గా మారడం గమనార్హం. ముంబాయి అండర్ వరల్డ్ మాఫియాకు చెందిన డాన్‌లతో పాటు అదే ప్రాంతానికి చెందిన డ్రగ్స్ మాఫియా నేరగాళ్లు ఎపితో పాటు ఒడిషాలో గంజాయి సాగును ఎక్కువగా ప్రోత్సహిస్తున్న విషయం చాలా కాలం క్రితమే వెలుగు చూసింది. గంజాయి సాగుకు అనువైన అనేక మారుమూల ప్రాంతాలు, అటవీ ప్రాంతాలు, దట్టమైన అడవులు వున్న ఏజెన్సీ ప్రాంతాలు, పోలీసులు, అబ్కారీ, రెవెన్యూ శాఖల అధికారులు సులభంగా వెళ్లలేని గ్రామాలు ఇక్కడ వందల సంఖ్యలో వుండడం స్మగ్లర్లకు బాగా కలిసి వస్తుంది. ఈ ఒక్క కారణంతోనేస్మగ్లర్లు ఆయా ప్రాంతాలలోని రైతులను మచ్చిక చేసుకుని డబ్బులు ఆశచూపుతూ వేలాది ఎకరాల్లో గంజాయిని సాగు చేయిస్తున్నారని ఎన్‌సిబి తేల్చింది. ఎపి, ఒడిషాలో గంజాయి సాగుకు సంబంధించి అటు కేంద్రం, ఇటు రాష్ట్రాల వద్ద ఇంత పక్కాగా లెక్కలు వున్నా దీని నివారణకు పగడ్బందీ వ్యూహం లేకపోవడం పెద్ద మైనస్ పాయింట్ కాగా సరిగ్గా ఈ అంశమే స్మగ్లర్ల పాలిట వరంగా మారిందని నిపుణులు అంటున్నారు. గంజాయి పంట సాగు చేయాలంటేమొదట స్మగ్లర్లు రావాలి. వారికి స్థానిక గంజాయి స్మగ్లర్లు, ఇతర నేరగాళ్లు కలవాలి. ఆ తరువాత ఎన్ని ఎకరాల్లో సాగు చేయాలి, ఎక్కడ సాగు చేయాలి, ఆయా ప్రాంతాలలోని రైతులను ఒప్పించి వారికి పెట్టుబడులతోపాటు నాణ్యమైన విత్తనాలు, ముందుగానే లాభాలను ఇచ్చేస్తారు. దీని తరువాత ఐదారు నెలలకు గంజాయి పంట ఏపుగా పెరిగి చేతికి వస్తుంది. ఈలోపు స్మగ్లర్లు ఐదారుసార్లు వచ్చి పంట ఏ విధంగా సాగవుతుందో చూస్తారు. ఒకవేళ పంట ఏపుగా పెరగకుంటే ఎరువులు వాడతారు. ఇందుకు కావాల్సిన పెట్టుబడులు కూడా స్మగ్లర్లే సమకూరుస్తారు. ఇదంతా జరిగిన తరువాత గంజాయి పంటనుకోయడం మరో ఎత్తుగా చెప్పాలి. గంజాయి పంట చూడడానికి జనుముపంట లాగా వుంటుంది. గంజాయి పంటను కూడా ఇలాగే ఎండలో ఆర పెట్టాల్సి వుంటుంది. ఇలా ఆరపెట్టిన గంజాయి పంటను స్మగ్లర్లు పొలంలోనే గ్రేడింగ్ చేస్తా రు. దీనిద్వారా దేనికి ఎంతధర అనేదివారు నిర్ణయిస్తారు. గంజాయి స్మగ్లింగ్‌లో రవాణా కీలకంగా వుంటుంది. పొలం నుంచి గంజాయిని మొదట సమీపంలోని బస్ లేదారైల్వే స్టేషన్లకు తరలించి అక్కడినుంచి పలు వస్తువుల మధ్యవుంచి కావాల్సిన ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఈ క్రమంలోనే చాలాసార్లు బస్, రైల్వేస్టేషన్ల వద్ద ప్రత్యేక తనిఖీల సమయంలో అనేకసార్లు గంజాయి పట్టుబడిన ఉదంతాలున్నాయి. ఈ క్రమంలోనే స్మగ్లర్లు రెవెన్యూ, పోలీసు, అబ్కారీ విభాగాలకు దండిగా మామూళ్లు ఇస్తున్నారనే అభియోగాలున్నాయి. ఈ నేపథ్యంలోనే మూడు విభాగాల అధికారులు గంజాయి పంట సాగుచేస్తున్న పొలాల జోలికి వెళ్లడం లేదని, ఒకవేళ వెళ్లినా తూతూ మంత్రంగా దాడులు చేస్తూ నాంకే వాస్తేగా కేసులు నమోదు చేస్తున్నారనే విమర్శలూ వున్నాయి. ఇక దేశవ్యాప్తంగా ఇటీవలపాఠశాలలు, కాలేజీలు మొదలుకొని ఐటి కంపెనీల వరకు గంజాయి మహమ్మారి కమ్మేస్తున్న ఘటనలు పెరిగిపోయాయి. ఐదేళ్ల క్రితం పేరొందిన వరంగల్ ప్రాంతీయ ఇంజినీరింగ్ కాలేజీలో అనేకమంది విద్యార్థులు, పూర్వవిద్యార్థులు గంజాయి సేవిస్తూ లేదా తమ వెంట వుంచుకుంటూ పోలీసులకు దొరికిపోయిన ఉదంతం సంచలనం రేపింది. ఈ కాలేజిలో అనేకమార్లు ఈ తరహా ఉదంతాలు వెలుగు చూశాయి. ఈ కాలేజీయే కాదు తెలుగు రాష్ట్రాల్లోని అనేక కాలేజీలు, ముఖ్యంగా ఇంజినీరింగ్ కాలేజీలలో ఇదే పరిస్థితి నెలకొందని ఈగల్ విభాగం దాడుల్లో తేటతెల్లం అయింది. ఇతర రాష్ట్రాల్లో పట్టుబడుతున్న అనేక మంది స్మగ్లర్లు తాము కొంటున్న గంజాయి తెలుగు రాష్ట్రాల నుంచే రవాణా అవుతోందని, ఇదంతా ఎపి, ఒడిషా నుంచి వస్తోందని చెబుతున్నారు. ఇక రాష్ట్రంలో సామాన్యుల నుంచి సెలబ్రటీల వరకు ఈ ఉచ్చులో చిక్కుకోవడం గమనార్హం. ●

# కొత్త 'బాల్' ఆట!

పశ్చిమ బెంగాల్

**ఎ.వి.వి ప్రసాద్**

పిట్ట పోరు పిల్లి తీర్చినట్టుగా మమతా బెనర్జీ, రితబ్రత బెనర్జీ మధ్య తలెత్తిన రాజకీయ పోరును ఎన్నికల కమిషన్ చాలా చిత్రంగా పరిష్కరించింది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నాది నాదంటూ ఆ రెండు వర్గాలు తగవులాడుకొంటున్న వేళ.. మీ ఇద్దరిదీ కాదు, కొత్త పేరు, గుర్తు పెట్టుకోండంటూ మధ్యేమార్గం సూచించింది. అది 'న్యాయ' సమ్మతమో కాదో అలా ఉంచితే, ప్రస్తుతానికి మారిన పేరు, గుర్తుతో వారిద్దరు సర్దుకోకతప్పని పరిస్థితి ఏర్పడింది. ఓ వంక నందిగ్రామ్, రెజీ నగర్ ఉప ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. ఆ ఎన్నికలకు రెండు గ్రూపులు టిఎంసి పేరుతోనే తలపడాలని భావించడంతో ఇసి రంగప్రవేశం చేసింది. మమత వర్గానికి 'మమతా ఆలిండియా తృణమూల్ కాంగ్రెస్', రితబ్రత వర్గానికి 'డెమొక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరును ఇసి ఖరారుచేసింది. ఈ రెండు పేర్లలోను 'తృణమూల్ కాంగ్రెస్'. అలాగే ఉండడం గమనించవలసిన అంశం. అలాగే మమత పార్టీకి 'ఫుట్ బాల్ ప్లేయర్' గుర్తు, రితబ్రత వర్గానికి 'ఎన్వలప్' గుర్తును కేటాయించడం విశేషం. ఫుట్‌బాల్ ఆటతోను, ప్లేయర్ల తోను మమతకు ఉన్న అనుబంధం వల్ల కాబోలు! ఆమెకు ఫుట్ బాల్ ప్లేయర్ గుర్తు లభించి ఉంటుంది. ఆమెకు ఫుట్‌బాల్ ఆటపై మక్కువ ఎక్కువ కావడంతో ప్రత్యర్థులను ఆమె ఇక ఫుట్‌బాల్ ఆడేస్తారనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. అలాగే రితబ్రత తన ప్రత్యర్థులను 'మడిచి కవర్లో పెట్టేస్తా'రనే వ్యాఖ్యలూ వినవస్తున్నాయి. వాటిమాటెలా ఉన్నా, ఈ ఎన్నికల్లోనైనా గట్టెక్కాలనుకొన్న మమత ఆశలకు ఆదిలోనే హంస పాదుపడినట్లు కనిపిస్తోంది. నందిగ్రామ్ నుంచి మమత స్వయంగా పోటీ చేస్తారని చాలా ప్రచారమే జరిగింది కానీ చివరికి సంచితా ప్రదాన్ అనే అభ్యర్థిని బరిలోకి దింపారు. అయితే ఏం జరిగిందోఏమో! ఆమె హఠాత్తుగా పోటీ నుంచి విరమించి అందరిని ఆశ్చర్యంలో ముంచెత్తారు. ముఖ్యమంత్రి సువేందు అధికారితో గత గురువారం సమావేశమైన ఆమె వెంటనే శుక్రవారమే తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకోవడం మమతకు నిజంగానే పెద్ద 'షాక్' అనవచ్చు. నామినేషన్ దాఖలుకు గడువు పూర్తవడంతో మరొకరిని బరిలోకి దింపే అవకాశం మమతకు లేకపోయింది. దీనితోకాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు మమత ప్రకటించారు. కానీ విచిత్రంగా కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రదాన్ శుక్రవారం నాడే అరెస్టయ్యారు. భూసేకరణకు వ్యతిరేకంగా2007లో నందిగ్రామ్‌లో చేపట్టిన ఆందోళనల కేసులో మిలన్‌ను పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఇది మరోవివాదం తృణమూల్ కాంగ్రెస్ అసలు గుర్తుఅయిన'పూలు గడ్డి'ని పక్కన పెట్టి రెండు వర్గాలకు కొత్త గుర్తులు కేటాయించడం వెనుక చాలా పెద్ద కుట్రే ఉన్నదని మమత ఆరోపిస్తూ 'సుప్రీం' తలుపు తట్టారు. అక్కడ ఏం తేలుతుందనేది తర్వాత కథ. ముందు ఉప ఎన్నికలైతే ఆమెకు అడ్డం తిరిగినట్లే కనిపిస్తున్నాయి.



మమతా బెనర్జీ


అరూప్ రాయ్ అధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న టిఎంసి ప్రత్యర్థి వర్గం బలం కూడా ఎక్కువే. అయితే తిరుగుబాటు వర్గానికి చెందిన పదిమంది ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్ దాఖలైంది. అసెంబ్లీ వారికి నోటీసులుకూడా ఇచ్చింది. పార్టీ కార్యాలయం, నిధులు, సంస్థాగత నియంత్రణపై రెండు వర్గాల మధ్య వివాదాలు కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో ఉపఎన్నికల్లో కూడా ముందే ఎదురు దెబ్బతగలడం మమతకు కొత్త తలనొప్పే అనిపిస్తుంది. నాలుగు నెలలక్రితం అసెంబ్లీ ఎన్నికల్లో కలిగిన ఘోర పరాజయం తలకు పెద్ద బొప్పినే కట్టించగా, ఉప ఎన్నికలు దానిపై సమ్మెట దెబ్బ కొట్టినట్లుగా ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి 46 శాతం ఓట్లు రాగా, టిఎంసికి 40 శాతం వచ్చాయి. అయితే సీట్లు 80 దగ్గరే ఆగిపోయాయి. 2021లో 215 సీట్లతో వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మమతా బెనర్జీ 2026 ఎన్నికల్లో సాధారణ మెజారిటీకి కూడా చాలా దూరంలోనే ఉండిపోయారు. అదే సమయంలో బిజెపి 46 శాతం ఓట్లు, 208 సీట్లతో అధికారం కైవసం చేసుకుంది. అంటే మమత పార్టీ 2021 కంటే 2026 లో 133సీట్లు కోల్పోయింది. ఒక్క సీటు కూడా లేని కాంగ్రెస్‌కు ఇటీవలి ఎన్నికల్లో కంటి తుడుపుగా ఓ రెండు సీట్లు మాత్రం దక్కాయి అటువంటి కాంగ్రెస్‌తో చేతులు కలిపి గట్టెక్కాలనుకోవడాన్ని చూస్తే మమత వ్యూహ రచనపై అనేక సందేహాలు కలుగుతాయి. భవానీపూర్‌లో మమతను ఓడించిన ముఖ్యమంత్రి సువేందు అధికారి నందిగ్రామ్‌లో కూడా గెలిచారు. ఆయన ఖాళీ చేసిన సీటు కావడంతో ఉపఎన్నికలోకూడా ఆ సీటు బిజెపికే లభిస్తుందనడంలో సందేహం లేదు. టిఎంసి విభజన, కొత్త పార్టీ పేరు, గుర్తు వంటి పరిణామాల నేపథ్యంలో ఉప ఎన్నికల్లో ఓటర్లు తిరిగి బిజెపి వైపే మొగ్గు చూపవచ్చు. రెండు పార్టీల మధ్య ఓటు శాతం తేడా కేవలం ఐదు పాయింట్లే అయినా సీట్ల తేడా 127 పైగా ఉంది. దీనిని బట్టి చూస్తే ఉప ఎన్నికలు జరిగే రెండు నియోజకవర్గాలలో కూడా బిజెపికే ఎక్కువ విజయావకాశాలు ఉన్నాయనిపిస్తుంది. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో బిజెపికి 50.4 శాతం ఓట్లురాగా, టిఎంసికి 46శాతం వచ్చాయి. కాంగ్రెస్‌కు కేవలం 0.31శాతం ఓట్లే వచ్చాయి. టిఎంసిగా ఇప్పుడు ఆ పార్టీ ఉనికి లేదు గనుక కొత్త పార్టీ ఎంతవరకు ఓట్లు ఆకర్షించగలదన్నదికూడా సందేహమే. నందిగ్రామ్‌తో పాటు రెజీనగర్‌లో కూడా మమత అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకొనడంతో రెండు చోట్లా ఆమెకుఅభ్యర్థులు లేని పరిస్థితి ఏర్పడింది. ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులు బిజెపికి గట్టి పోటీ ఇచ్చే స్థితిలో లేరు. మమత పార్టీ ప్రత్యక్షంగా బరిలో లేకపోవడంతో ప్రస్తుతానికి వెనుకబడినట్లే అనుకోవాలి. మమత పార్టీ ఓట్లు ఎంత మేరకు కాంగ్రెస్‌కు బదలీ కాగలవో వచ్చే అక్టోబరు తొమ్మిదవ తేదీన వెలువడే ఫలితాలే చెబుతాయి. మొత్తానికి చేతిలోకి ఫుట్ బాల్ వచ్చినా మమత సరైన ఆట ఆడలేకపోతున్నారనే అభిప్రాయమే వినిపిస్తోంది. ●

# పుతిన్ ప్రతిష్టకు పరీక్ష!

రష్యా

**గన్ని మోహన్**

ఉక్రెయిన్‌తో కొనసాగుతున్న యుద్ధం, ఆర్థిక ఒత్తిళ్లు, రాజకీయ ప్రతిపక్షాలపై పెరుగుతున్న ఆంక్షల మధ్య రష్యాలో మూడు రోజుల పార్లమెంటరీ ఎన్నికలు ప్రారంభమయ్యాయి. 450 మంది సభ్యులతో కూడిన రష్యా దిగువ సభ స్టేట్ డూమాకు ప్రతినిధులను ఎన్నుకోవడంతో పాటు ప్రాంతీయ, స్థానిక ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. సుమారు 11.1 కోట్ల మంది అర్హత కలిగిన ఓటర్లను దృష్టిలో ఉంచుకుని ఓటింగును మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచడమే దీని ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. ఈసారి తొలిసారిగా 2022లో ఉక్రెయిన్‌పై పూర్తిస్థాయి దాడి అనంతరం రష్యా విలీనం చేసుకున్నట్లు ప్రకటించిన నాలుగు ఉక్రెయిన్ ప్రాంతాల నివాసితులను కూడా ఎన్నికల ప్రక్రియలో చేర్చారు. అయితే ఈ ఎన్నికలను ఉక్రెయిన్ చట్టవిరుద్ధమైనవిగా పేర్కొంటున్నా ఆక్రమిత ప్రాంతాల్లోకూడా రష్యా ఎన్నికలు నిర్వహిస్తోంది. నిజానికి ఈ ఎన్నికలు నామమాత్రమేనని చెప్పాలి. ఎందుకంటే పుతిన్ నేతృత్వంలోని యునైటెడ్ రష్యా పార్టీకే మళ్లీ పగ్గాలు దక్కుతాయనేది అందరికీ తెలిసిందే. క్రెమ్లిన్‌కు అనుకూలమైన ప్రధాన పార్టీ యునైటెడ్ రష్యా ప్రస్తుతం స్టేట్ డూమాలోమూడింట రెండొంతులకుపైగా స్థానాలను కలిగి ఉంది. ఈ ఎన్నికల్లోనూ ఆపార్టీ తన ఆధిపత్యాన్ని కొనసాగించే అవకాశం లేకపోలేదు. ఉక్రెయిన్‌పైయుద్ధం, పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, మరో పక్క అమెరికాతో నిరంతర వివాదం ఆంక్షలు, సుంకాల విధింపు వంటి వాటి నేపథ్యంలో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. కమ్యూనిస్ట్ పార్టీ, లిబరల్ డెమోక్రటిక్ పార్టీ, ఎ జస్ట్ రష్యా వంటి అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ విధానాలకుమద్దతు ఇచ్చే ఇతర పార్టీలు కూడా పార్లమెంటులో తమ ప్రాతినిధ్యాన్ని కొనసాగించే అవకాశం ఉంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా పూర్తి స్థాయి దాడిని ప్రారంభించిన తర్వాత జరుగుతున్న తొలి యుద్ధకాల పార్లమెంటరీ ఎన్నికలు ఇవే. వేసవిలో ఉక్రెయిన్‌కు చెందిన డ్రోన్ దాడులు రష్యాలోని చమురు శుద్ధి కర్మాగారాలు, రవాణాలాజిస్టిక్స్ కేంద్రాలు, ఇతర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకున్నాయి. చమురు శుద్ధి కేంద్రాలపై జరిగినదాడులు ఇంధన కొరతకు, ఆర్థిక ఒత్తిళ్లకు కారణమయ్యాయి. దీనికి ప్రతిస్పందనగా రష్యా, ఉక్రెయిన్‌నగరాలపై క్షిపణి, డ్రోన్ దాడులను మరింత తీవ్రతరం చేసింది. నల్ల సముద్రంలోని నౌకాశ్రయాలపై కూడా దాడులు పెరిగాయి. ఎన్నికల అనంతరం మరోసారి పెద్దఎత్తున సైనిక సమీకరణ చేపట్టవచ్చన్న చర్చ కూడా కొనసాగుతోంది. అయితే అలాంటి సమీకరణపై వస్తున్న వార్తలను పుతిన్ అర్థంలేని మాటలు'గాకొట్టిపారేసినా తప్పకుండా భీకర దాడులు ఎన్నికల తర్వాత ఉంటాయన్నది నిర్వివాదాంశం. 2022లో రష్యా3లక్షల మందిరిజర్వ్ సైనికులను పాక్షికంగా సమీకరించింది. ఆ సమయంలో లక్షలాది మంది



పుతిన్

రష్యన్లు దేశం విడిచి వెళ్లారు. ఎన్నికలకు ముందు రష్యాలోరాజకీయ ప్రతిపక్షాలపై ఆంక్షలుమరింత పెరిగాయి. పార్లమెంటరీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం మొదట 11పార్టీలను ఆమోదించింది. వాటిలో యుద్ధాన్ని బహిరంగంగా విమర్శించిన ఏకైక పార్టీగా యాబ్లోకో నిలిచింది. అయితే జాతీయవాద పార్టీ మదర్లాండ్ చేసిన అప్పీల్ అనంతరం రష్యా సుప్రీంకోర్టు యాబ్లోకోను ఎన్నికల బరిలో నుంచి తొలగించింది. రష్యా ప్రాదేశిక సమగ్రతను దెబ్బతీసే విధానాలను ఆ పార్టీ ప్రోత్సహిస్తోందని మదర్లాండ్ ఆరోపించింది. యాబ్లోకోకు చెందిన పలువురు నేతలుకూడా యుద్ధంపై విమర్శలు చేసిన కేసుల్లో చట్టపరమైన చర్యలను ఎదుర్కొన్నారు. మాక్సిమ్ క్రుగ్లోవ్‌కు సైన్యం గురించి అధికారులు తప్పుడు సమాచారంగా పేర్కొన్న విషయాలను ప్రచారం చేసిన కేసులో ఏడేళ్ల జైలు శిక్ష విధించారు. మరో యాబ్లోకో నేత లెవ్ ష్లోస్బర్గ్‌కు 11 సంవత్సరాలకు పైగా శిక్ష విధించారు. అలాగే వ్యక్తిగత నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలనుకున్న పలువురు యాబ్లోకో అభ్యర్థులను కూడా అధికారులు అడ్డుకున్నారు. యుద్ధం కొనసాగుతున్న కొద్దీ రష్యా ఆర్థికవ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది. పెరుగుతున్న బడ్జెట్ లోటును నిర్వహించేందుకు ప్రభుత్వం పన్నులను పెంచడంతోపాటు దేశీయ రుణాలపై ఆధారపడుతోంది. రష్యా, ఇంధనమౌలిక సదుపాయాలపై ఉక్రెయిన్ దాడులు ఇంధన కొరతకు దారితీశాయి. ఆన్లైన్ రిటైల్ సంస్థలు వైల్డ్ బెర్రీస్, ఓజోన్ నిర్వహిస్తున్న గిడ్డంగులపై జరిగిన దాడుల్లో లక్షలాది మంది విక్రేతలకు నష్టం వాటిల్లింది. స్వతంత్ర లెవాడా సెంటర్ గణాంకాలప్రకారం పుతిన్ ఆమోద రేటింగ్ 2026 ఆగస్టులో 76శాతానికి పడిపోయింది. 2025సెప్టెంబరులో ఇది 87శాతంగా నమోదైంది. అయినప్పటికీ, యుద్ధం, ఆర్థికసమస్యలపై ప్రజల్లో ఆందోళనలు ఉన్నప్పటికీ క్రెమ్లిన్ రాజకీయ ఆధిపత్యానికి తక్షణ ముప్పులేదని అధికార పార్టీ నేతలు ధీమాతో ఉన్నారు. రష్యా స్టేట్ డూమాలో మొత్తం 450 స్థానాలు ఉన్నాయి. ఇందులో సగం స్థానాలను పార్టీ జాబితాల ద్వారా, మిగిలిన సగాన్నిఏకసభ్య నియోజకవర్గాల ద్వారా ఎన్నుకుంటారు. ప్రస్తుతం యునైటెడ్ రష్యాకు స్పష్టమైన మెజారిటీ ఉంది. ఓట్లశాతం తగ్గినా ఆపార్టీ ఆధిపత్యం కొనసాగించేలా క్రెమ్లిన్ చర్యలు తీసుకుంటుందన్న అంచనాలు భారీగా ఉన్నాయి. ఎన్నికల్లో పోలింగ్ శాతం, ఉక్రెయిన్ యుద్ధంపై ప్రజల వైఖరికి సంబంధించిన విస్తృత రాజకీయ సందేశం కూడా ఈఎన్నికల్లో కీలకంగా మారింది. రష్యా ప్రభుత్వం ఈ ఎన్నికలను దేశనాయకత్వానికి, సైన్యానికి ప్రజల మద్దతును చాటే అవకాశంగా చూపుతోంది. మరోవైపు ప్రతిపక్ష నేతలు, విమర్శకులు యుద్ధ వ్యతిరేక అభ్యర్థులు, పార్టీలపై విధించిన ఆంక్షలను ప్రశ్నిస్తున్నారు. మూడు రోజుల పాటు కొనసాగే ఓటింగ్‌లోపుతిన్ పట్ల ప్రజల్లో ధీమా ఏమాత్రం సడలదన్న ధీమాతో ఆ పార్టీనేతలుంటే ప్రజల తీర్పు ఎలా ఉంటుందన్నది ఈ స్టేట్‌డుమా ఎన్నికలు చెప్పబోతున్నాయి. ●

# పేద, మధ్యతరగతికి పెరుగుతున్న 'నెల బిల్లు'



**డాక్టర్ రామకృష్ణ బండారు**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి మన దేశ స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి) 7.8 శాతంగా నమోదు అయింది. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది అని గణాంకాలు చెపుతున్నాయి. కానీ, దేశంలో పేద, మధ్య తరగతి ప్రజల నెలవారీ బడ్జెట్ గత కొన్ని నెలలుగా ఆకాశానికి చేరుతుంది. ప్రతీ నెల మొదటి తేదీన జీతం కోసం ఎదురుచూసే పేద, మధ్య తరగతికి చెందిన సగటు వ్యక్తి జీతం బ్యాంకులో పడగానే ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజు, కరెంట్ బిల్లు, వంటింటి సరుకులు, ప్రయాణ ఖర్చులు, రుణ వాయిదాలు (ఇన్స్టాల్మెంట్స్) వంటి ఖర్చులకు బడ్జెట్ వేసుకొని మిగిలినదానిని పొదుపు రూపంలో భవిష్యత్ అవసరాలకోసం దాచుకుంటాడు. కానీ గత రెండు నెలలుగా దేశంలో పేద, మధ్యతరగతి ప్రజానీకం ఆర్థిక పరిస్థితి మారిపోయింది. పొదుపు సంగతి పక్కన పెడితే, అత్యవసర పరిస్థితి వస్తే ఆర్థికంగా ఎలా ఎదుర్కోవాలో తెలియని ఆందోళన దేశంలోని సగటు పేద మధ్యతరగతి కుటుంబాలను వెంటాడుతోంది. దానికి కారణం దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడమే. ఈ పరిస్థితికి ప్రత్యక్షంగా ఎవరూ కారణం కాకపోయినప్పటికీ, పరోక్షంగా పకృతి వైపరీత్యాలు, అంతర్జాతీయ సంక్షోభాలు కారణం అని చెప్పక తప్పదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకుంటున్నప్పటికీ నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలను తాకుతున్నాయి. ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజానీకం నెలవారీ బడ్జెట్ పెరిగిపోతుంది. అది వారి పొదుపును ప్రభావితం చేస్తుంది. ఒకవిధంగా దేశంలో 'ద్రవ్యోల్బణం' నెమ్మదిగా పెరుగుతుంది అని చెప్పవచ్చు. అసలు ఏయే వస్తువుల ధరలు మధ్యతరగతి ప్రజల నెలవారీ బడ్జెట్ పెరుగుదలకు కారణమవుతున్నాయి? ధరల పెరుగుదలకు కారణాలు ఏమిటి? ఎంతకాలం ఈపరిస్థితి కొనసాగుతుంది? ప్రభుత్వాల చర్యలు ఏమిటి ? అనేవి సామాన్య ప్రజానీకానికి అంతుపట్టని అంశాలు, ప్రస్తుత పరిస్థితులలో పేద, మధ్యతరగతి కుటుంబాల నెలవారీ బడ్జెట్‌ను ఎక్కవ ప్రభావితం చేసేది వారి వంటింటి బడ్జెట్. వంటింటిలోకి కావలసిన నిత్యావసరాల వస్తువుల ధరలు ఇప్పుడు ఆకాశాన్ని అంటుతున్నాయి. గ్యాస్, నూనెలు, ఉప్పు, పప్పుదినుసులు, ఉల్లిపాయలు, కూరగాయల ధరలు ఇలా అన్నిరకాల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయి. ముఖ్యంగా, వంట గ్యాస్ ధరల పెరుగుదల సామాన్య ప్రజానికినిపై పెను భారమే మోపుతోంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులు, ఇంధన సరఫరా మార్గాల్లో ఏర్పడుతున్న అంతరాయాలు, అంతర్జాతీయ ముడిచమురు, ఎల్.పి.జి మార్కెట్లలో చోటుచేసుకుంటున్న హెచ్చుతగ్గులు భారత్‌లో ఇంధన ధరలపై ప్రభావం చూపుతున్నాయి. సెప్టెంబర్ 2025 లో 853 రూపాయలుగా ఉన్న 14.2 కిలోల గృహ ఎల్.పి.జి సిలిండర్ ధర సెప్టెంబర్ 2026 నాటికి ప్రాంతాన్ని బట్టి సుమారు 1000 రూపాయలకు చేరింది. అంటే ఒక్క సిలిండర్పై సుమారు 150రూపాయల వరకు అదనపు భారం పెరిగింది. అలాగే, బియ్యం, నూనె ధరలు కూడా విపరీతంగా పెరిగాయి. బియ్యం విషయానికి వస్తే రెండు నెలల క్రితం వరకు బహిరంగ మార్కెట్లో కిలో 50 నుండి 55 రూపాయల వరకు లభించిన సన్నరకం బియ్యం ధర, ప్రస్తుతం ఏకంగా 10 నుండి 20 వరకు పెరిగింది. ఇప్పుడు కిలో సన్నబియ్యం ధర 60 నుండి 70 రూపాయలకు చేరింది. 25 కేజీల బియ్యం బస్తాపై సుమారు 400 వందల వరకు ధరలు పెరిగాయి. బియ్యంధరలు ఈ స్థాయిలో పెరగడానికి వివిధ కారణాలున్నాయి. గత సీజన్లో ఆశించిన స్థాయిలో సన్న బియ్యం దిగుబడి రాకపోవడం, రైస్ మిల్ వ్యాపారస్తుల వద్ద నిల్వలు క్రమంగా తగ్గిపోవడంతో మార్కెట్లలో సన్నబియ్యానికి కొరత ఏర్పడింది. ముఖ్యంగా, 'ఎలినినో' ప్రభావంతో ఈ సంవత్సరం కేవలం కర్ణాటకలోనే కాకుండా దేశవ్యాప్తగం వర్షాలు తగి



నంతగా పడలేదు. ఫలితంగా వరి దిగుబడి ఈ సంవత్సరం తగ్గుతుంది. అందుకే, వ్యాపారస్తులు బియ్యం అక్రమంగా నిల్వఉంచి, కృత్రిమ కొరతసృష్టించి భవిష్యత్‌లోబియ్యాన్ని ఎక్కువ ధరకు అమ్ముకునే పక్రియ జరుగుతుంది. అలాగే, ప్రభుత్వం వరి మద్దతు ధరను పెంచడం కూడా బహిరంగ మార్కెట్లో ధరల పెరుగుదలకు ఒక కారణమైంది. సాధారణంగా 4 నుంచి 5 మంది ఉన్న ఒక సగటు కుటుంబానికి నెలకు కనీసం 25నుండి 40 కిలోల బియ్యం అవసరమవుతాయి. బియ్యం ధరలు కిలోపై 15 నుండి 20 రూపాయలకు పెరగడంతో ప్రతి కుటుంబంపై నెలకు 500 నుండి 800 రూపాయల వరకు అదనపు భారం పడుతోంది. ఇక వంట నూనెల ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. గత ఏడాది లీటరు 110 నుండి 140 రూపాయల మధ్య ఉన్న వంట నూనెల ధరలు ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో సుమారు 180 నుండి 200 రూపాయల మధ్య ఉన్నాయి. మన దేశం వంట నూనెల అవసరాలలో దాదాపు 60 శాతం పైగా ఇతర దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. అందువల్ల ప్రపంచ మార్కెట్లో వచ్చే చిన్న మార్పు కూడా మన 'వంటింటి బడ్జెట్' పై తీవ్రప్రభావం చూపుతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద పామాయిల్ ఎగుమతిదారు అయిన ఇండోనేషియా తన 'బయో ఇంధన విధానాన్ని' (ఇంధనంలో 50 శాతం పామాయిల్ కలపడం) వేగవంతం చేసింది. దీనివల్ల వంట నూనెగా వాడే 'పామాయిల్'ను వాహనాల ఇంధనం తయారీకి మళ్లిస్తున్నారు. ఫలితంగా ప్రపంచ మార్కెట్లో పామాయిల్ లభ్యత తగ్గి ధరలు పెరిగాయి. ఇక సెప్టెంబర్ 2025లో ఒక్క కిలో కందిపప్పు ధర 106రూపాయలు కానీ ప్రస్తుతం అది 150 రూపాయలకు రిటైల్ మార్కెట్‌లో లభిస్తుంది. అదేవిధంగా, వేరుశనగ ఒక్క కిలో ధర 2025 సెప్టెంబర్‌లో 140నుండి 150 రూపాయల వరకు ఉండగా, ప్రస్తుతం 180 రూపాయల వరకు పెరిగింది. ఎండు మిర్చి కిలో ధర 2025 సెంప్టెంబర్‌లో 160 రూపాయలు ఉండగా ప్రస్తుతం 270 నుండి 300 వరకు పెరిగింది. ఇక ప్రతీ వ్యక్తికీ నిత్యావసరమైన పంచదార, బెల్లం ధరలు సుమారు 70 శాతం వరకు పెరిగాయి. పంచదారను ప్రతీ కుటుంబం ఉపయోగిస్తుంది. రానున్న రోజుల్లో పండగలు రానున్నాయి. ఇటువంటి సమయంలో పంచదార, బెల్లం వంటి ధరలు పెరుగుదల పేద మధ్యతరగతి వారికీ భారమే అని చెప్పాలి. గడచిన ఏడాదితో పోల్చితే ప్రస్తుతం అన్నిరకాల 'వంటింటి దినుసుల ధరలు సుమారు 20 శాతం పెరిగాయి. కేవలం గ్యాస్, వంటింటి దినుసుల ధరలే కాకుండా కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ముఖ్యంగా, ఉల్లిపాయ ధర వినియోగదారునికి కన్నీరు తెప్పిస్తుంది. గతనెల రోజుల క్రితం ఒక కిలో ఉల్లిపాయ రూ.20నుండి రూ.25 మధ్య ఉండగా, ప్రస్తుతం అది 65నుండి 70 రూపాయల మధ్య లభిస్తుంది. అంటే సుమారు 100శాతం ధరలు పెరిగాయి. ఇక కూరగాయల ధరలు కూడా పెరిగాయి. అన్ని రకాల కురాగాలు కిలో 50 రూపాయల పైననే రిటైల్ మార్కెట్‌లో అమ్ముతున్నారు. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. ఫలితంగా దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉన్నది. తాజా అధికారిక గణాంకాలు కూడా అదే తెలియచేస్తున్నాయి. 2025 జులైలో రిటైల్ ద్రవ్యల్బణం 1.55 శాతం గా ఉండగా అది 2026 జులై నెలకి 4.45శాతానికి పెరిగింది. భారతదేశంలో వ్యవసాయం ఇప్పటికీ 50శాతం పైగా వర్షాలపైనే ఆధారపడి ఉంది. భూగర్భ జలాలు, జలాశయాల క్షీణత వలన ఈ సంవత్సరం పంటల దిగుమతి తక్కువే. ఇలా వివిధ కారణాల వలన ఆహారధాన్యాల ధరలు దేశంలో పెరుగుతున్నాయి. ఆ ప్రభావం దేశంలోని పేద, మధ్య తరగతి నెలవారీ బడ్జెట్‌పై పడుతుంది. పేద కుటుంబాల్లో ఇది ఇంకా ఎక్కువగా ఉంటుంది. రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నది. అందుకు అనుగుణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా, దేశీయంగా కొరత గా ఉన్న బియ్యం, గోధుమలు, చక్కెర, ఉల్లిపాయ వంటి వాటి ఎగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే, విదేశాల నుండి దిగుమతి చేసుకునే పప్పుధాన్యాలు, వంట నూనెలపై దిగుమతి సుంకాలు తగ్గించాలి. ప్రభుత్వం, రేషన్ షాప్ ల ద్వారా పంచదార, ఆయిల్ వంటి ధరలు పెరిగే ఇతర నిత్యావసర వస్తువులను పేద, మధ్య తరగతి వారికి తక్కువ ధరకే అందించాలి. ●

## పర్యావరణ పరిరక్షణలో భారత్ ప్రపంచానికే దిక్సూచి

### ప్రధాని నరేంద్రమోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** పర్యావరణాన్ని కాపాడుకుంటూనే ఆర్థికంగా ఎలా ఎదగాలో భారత్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. ది ఫ్యూచర్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ క్లైమేట్ డైనమిక్స్" అంతర్జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. మన దేశంలో పునరుత్పాదక ఇంధనం, పరిశుభ్రమైన రవాణా వ్యవస్థలు, నీటి సంరక్షణ ఎంత వేగంగా విస్తరిస్తున్నాయో వివరిస్తూ, పర్యావరణ పరిరక్షణతో పాటే ఆర్థిక పురోగతి కూడా సాధ్యమేనని స్పష్టం చేశారు. ప్రకృతితో మమేకమై జీవించడం భారత్‌కు శతాబ్దాల నుంచి వస్తున్న ఆచారం అని మోడీ గుర్తుచేశారు. తరతరాలుగా పర్యావరణ పరిరక్షణలో ప్రపంచానికి దిశానిర్దేశం చేసిన భారత్, ఆ సాంప్రదాయ అనుభవాలు, సిద్ధాంతాల పునాదిగానే నేటి ఆధునిక వాతావరణ సమస్యలకు పరిష్కారాలు చూపుతోందన్నారు. ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ పరిరక్షణకు కలిసికట్టుగా ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ సగటుతో పోలిస్తే భారత్‌లో తలసరి కార్బన్ ఉద్గారాల పరిమాణం చాలా తక్కువగా ఉందన్నారు. మన ప్రాచీన పర్యావరణ ఆలోచనలనే నేటి ఆధునిక పరిష్కారాలుగా మారుస్తూ ప్రకృతిని కాపాడుకుంటున్నామని తెలిపారు. భారత్ వాతావరణ వ్యూహంలో పునరుత్పాదక ఇంధనానిదే ప్రధాన పాత్ర అని మోడీ స్పష్టం చేశారు. ముఖ్యంగా సౌర విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిని ప్రత్యేకంగా ప్రస్తావించారు. కేవలం 12 ఏళ్ల క్రితం 2 గిగావాట్లుగా ఉన్న మన సోలార్ సామర్థ్యం, ఈరోజు ఏకంగా 160 గిగావాట్లకు పైగా పెరిగిందని వెల్లడించారు. ఒక్క సోలార్ ఎనర్జీ వల్లే దాదాపు 20 కోట్ల టన్నుల కార్బన్ ఉద్గారాలు వాతావరణంలో కలవకుండా నిరోధించగలిగామని చెప్పారు. పవన విద్యుత్ సామర్థ్యం కూడా గత 12 ఏళ్లలో మూడు రెట్లు పెరిగిందని, దీనికి తోడు జల విద్యుత్ రంగాన్ని కూడా విస్తరించామని చెప్పారు. వీటితో పాటు అణు విద్యుత్‌ను పెంచడానికి, క్లీన్ ఎనర్జీ రంగంలోకి ప్రైవేట్ భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించడానికి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

## పాక్ కదలికలు కనిపెట్టే ఇఓఎస్05 శాటిలైట్!



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 19:** భారత్ అంతరిక్ష రంగంలో మరో కీలక అడుగు వేసింది. భూస్థిర కక్ష్యలోకి పంపిన ఈఓఎస్05 ఉపగ్రహం దేశానికి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుందని ద డిప్లొమాట్ నివేదిక పేర్కొంది. ముఖ్యంగా సంక్షోభ సమయంలో పాకిస్థాన్ నౌకలు, విమానాలు, వ్యూహాత్మక వనరులు, సైనిక బలగాల కదలికలను ఎప్పటికప్పుడు గమనించే అవకాశం భారత్‌కు లభించనుందని తెలిపింది. ఈనెల 4న జీఎస్ఎల్‌వీఎఫ్17 రాకెట్ ఈఓఎస్ 05ను భూస్థిర కక్ష్యలోకి చేర్చింది. భూమికి దాదాపు 34,900 నుంచి 35,900 కిలోమీటర్ల ఎత్తులో ఉండే ఈ కక్ష్యతో భారత ఉపఖండంపై నిరంతర నిఘా కొనసాగించవచ్చు. ఈ ఉపగ్రహం ద్వారా దేశానికి వ్యూహాత్మక సమాచారాన్ని అందించే తొలి ప్రత్యేక ఇమేజింగ్ ఉపగ్రహంగా ఈఓఎస్ 05 నిలుస్తుందని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. భారత్ ఇప్పటికే పలు నిఘా ఉపగ్రహాలను దిగువ భూకక్ష్యలో ఉపయోగిస్తోంది. ఇవి అత్యంత స్పష్టమైన చిత్రాలను అందిస్తాయి. అయితే అవి భూమి చుట్టూ వేగంగా తిరుగుతుండటంతో ఒక ప్రాంతాన్ని నిరంతరం గమనించడం సాధ్యం కాదు. ఈఓఎస్05 విషయంలో ఈ పరిమితి తగ్గనుంది. సైనిక కదలికలను నిరంతరం గమనించడం వల్ల లక్ష్యాన్ని గుర్తించిన తర్వాత దానిపై చర్య తీసుకునే సమయం తగ్గుతుందని నివేదిక తెలిపింది. కచ్చితమైన దాడులకు క్షిపణుల సామర్థ్యంతో పాటు లక్ష్యం ఎక్కడుందన్న తాజా సమాచారం కూడా కీలకమేనని పేర్కొంది. ఇదే సమయంలో భారత్ తన అంతరిక్ష నిఘా వ్యవస్థను మరింత విస్తరించే ప్రణాళికలో ఉంది. 2024లో కేంద్ర భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ 52 రక్షణ ఉపగ్రహాలను ప్రయోగించే స్పేస్ బేస్డ్ సర్వైలెన్స్3 కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. వీటిలో 21 ఉపగ్రహాలను ఇస్రో, 31 ఉపగ్రహాలను ప్రైవేటు రంగం అభివృద్ధి చేయనున్నాయి.

## మేం ఒకరిపై ఒకరం గూఢచర్యం చేసుకుంటాం

### చైనాపై డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు

**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో సతీసమేతంగా అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీజింగ్‌ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశారు. చైనా-అమెరికా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. అదే సమయంలో ఇరుదేశాలూ పరస్పరం గూఢచర్యం చేసుకుంటాయని పేర్కొన్నారు. గతంలో తమ అధికారి ఒకరు మాట్లాడుతూ.. అగ్రరాజ్యంపై చైనా గూఢచర్యం చేస్తోందని చెప్పినట్లు గుర్తు చేసుకున్నారు. అయితే తాము కూడా బీజింగ్ విషయంలో అదే పని చేస్తుండడంతో దాన్ని అంతగా పట్టించుకోలేదని తెలిపారు 'జిన్‌పింగ్ వచ్చే వారం అమెరికాకు వస్తారు. ఇతర దేశాలతో సంబంధాలు అంత బాగా లేకపోయినా.. మాకు చైనాతో మంచి అనుబంధం ఉంది. ఆయనతో సమావేశానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నా. ఆ చర్చల్లో పలు కీలక ఒప్పందాలు చేసుకోబోతున్నాం. ప్రతి ఒప్పందం వెనక ఓ స్పష్టమైన ఉద్దేశం ఉంటుంది' అని ట్రంప్ పేర్కొన్నారు. జిన్‌పింగ్ అమెరికా పర్యటన.. ఈ నెలాఖరులో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. సతీమణి పెంగ్ లియువాన్‌తో కలిసి అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ట్రంప్ ఎయిర్‌పోర్టుకు వెళ్లి మరీ ఆయనను స్వాగతించనున్నట్లు తెలుస్తోంది. వాషింగ్టన్ డిసికి సమీపంలోని సైనిక స్థావరంలో ఉన్న ఎయిర్ పోర్టుకు వెళ్లి జిన్‌పింగ్ దంపతులను అధ్యక్షుడు స్వాగతించే అవకాశం ఉందని వైట్‌హౌస్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల నేతలతో ప్రముఖ టెక్ దిగ్గజాలు ఎలాన్‌మస్క్, సుందర్ పిచాయ, టిమ్ కుక్, మైఖేల్ డెల్, జెఫ్ బెజోస్, బెన్సన్ హు వాంగ్, శామ్ ఆల్ట్‌మన్, జేన్ ఫ్రేజర్ సమావేశ మయ్యే అవకాశం ఉంది. ఈ భేటీలో కృత్రిమ మేధపైనా చర్చలు జరిగే అవకాశం ఉంది.

## ముంబయి ఒలింపియా కాఫీహౌస్ లైసెన్స్ సస్పెన్షన్

**ముంబయి, సెప్టెంబరు 19:** హాలీవుడ్ స్టార్లు క్రిస్టోఫర్ నోలన్, మాట్ డామన్, టామ్ హాలండ్ సందర్శించిన ముంబైలోని ప్రముఖ ఒలింపియా కాఫీ హౌస్‌కు షాక్ తగిలింది. తీవ్రమైన అపరిశుభ్రత, ఆహార భద్రత లోపాలు బయటపడటంతో మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) ఈ కేఫ్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసింది. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు లైసెన్స్‌పై సస్పెన్షన్ కొనసాగనుంది. కస్టమర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఎఫ్‌డీఏ అధికారులు కేఫ్‌లో తనిఖీలు చేపట్టారు.



## తుళు భాషకు అదనపు అధికార భాష హోదా


### దక్షిణ కన్నడ జిల్లాపేరు ఇకపై మంగుళూరు జిల్లా

**మంగళూరు, సెప్టెంబరు 19:** కర్ణాటకలోని ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాల్లో తుళు భాషను రాష్ట్ర రెండో అదనపు పరిపాలనా భాషగా గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంగళూరులో జరిగిన కేబినెట్ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఈ విషయాన్ని ప్రకటించారు. ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాల్లో తుళు భాషను అమలు చేయాలని, రాష్ట్ర రెండో అదనపు పరిపాలనా భాషగా ప్రకటించాలని నిర్ణయించామన్నారు.

## ట్రంప్‌కు నానాటికి తగ్గుతున్న ప్రజాదరణ

### ఆర్థిక సమస్యలపై అమెరికన్ల ఆందోళన

### అధ్యక్షుని తీరుపట్ల 60 శాతం మందిలో అసంతృప్తి




**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రజాదరణ రేటింగ్ తాజాగా మరింత దిగజారింది. యూగోవ్ తాజా ట్రాకర్ ప్రకారం, ట్రంప్ పనితీరును 35 శాతం మంది అమెరికన్లు మాత్రమే ఆమోదిస్తుండగా, 60 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ఆయన నెట్ అప్రూవల్ రేటింగ్ మైనస్ 25గా నమోదైంది. అమెరికన్ల ప్రధాన ఆందోళనల్లో ఆర్థిక అంశాలు, ముఖ్యంగా ద్రవ్యోల్బణం మరియు పెరుగుతున్న ధరలు ముందంజలో ఉన్నాయి. దేశం ఎదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సమస్య ఏదని ప్రశ్నించగా, 33 శాతం మంది ద్రవ్యోల్బణం, ధరలను పేర్కొన్నారు. ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ 13 శాతంతో రెండో స్థానంలో ఉండగా, ఆరోగ్య సంరక్షణను 11 శాతం మంది ప్రధాన సమస్యగా గుర్తించారు. యూగోవ్ గణాంకాల్లో పురుషులు, మహిళల మధ్య కూడా గణనీయమైన వ్యత్యాసం కనిపించింది. పురుషుల్లో ట్రంప్ నెట్ అప్రూవల్ సుమారు మైనస్ 18గా ఉండగా, మహిళల్లో ఇది మైనస్ 31గా నమోదైంది. వయస్సు ఆధారంగా చూస్తే, 65 ఏళ్లు మరియు అంతకంటే ఎక్కువ వయస్సున్న వారిలో నెట్ అప్రూవల్ సుమారు మైనస్ 15గా ఉండగా, 30 నుంచి 44 ఏళ్ల వయస్సు వారిలో మైనస్ 39కు చేరింది. జాతి ఆధారిత గణాంకాల్లో ఈ వ్యత్యాసం మరింత స్పష్టంగా కనిపించింది. శ్వేతజాతీయ ఓటర్లలో ట్రంప్ నెట్ అప్రూవల్ సుమారు మైనస్ 15గా ఉండగా, హిస్పానిక్ ఓటర్లలో మైనస్ 32,ఇతరులుగా వర్గీకరించిన వారిలో మైనస్ 43, నల్లజాతీయ ఓటర్లలో మైనస్ 61గా నమోదైంది. విద్యార్హతలను బట్టి కూడా ట్రంప్ పట్ల అభిప్రాయాల్లో తేడా కనిపించింది. హైస్కూల్ విద్య లేదా అంతకంటే తక్కువ విద్య ఉన్నవారిలో నెట్ అప్రూవల్ సుమారు మైనస్ 15గా ఉండగా, కొంత కాలేజీ విద్య ఉన్నవారిలో మైనస్ 25గా ఉంది. కాలేజీ గ్రాడ్యుయేట్లలో ఇది మైనస్ 31, పోస్ట్‌గ్రాడ్యుయేట్లలో మైనస్ 32గా నమోదైంది. ఇటీవలి నెలల్లో ట్రంప్ ఆమోద రేటింగ్ సగటున 30ల చివరి శాతాల్లో కొనసాగుతున్నట్లు పలు పోలింగ్ గణాంకాలు సూచిస్తున్నాయి. అయితే కొన్ని ప్రత్యేక సర్వేల్లో ఆయన ఆమోదం 30 నుంచి 40 శాతం మధ్య నమోదైంది. దీంతో వ్యక్తిగత సర్వేలు, పోలింగ్ సగటుల మధ్య కొంత వ్యత్యాసం కనిపిస్తోంది. ట్రంప్ అధ్యక్ష పదవీకాలాన్ని అంచనా వేయడంలో ఇరాన్‌పై అమెరికా సైనిక చర్య కూడా ఇటీవల నిర్వహించిన సర్వేల్లో కీలక అంశంగా మారింది. జూలైలో క్విన్నిపియాక్ యూనివర్సిటీ నిర్వహించిన జాతీయ సర్వేలో, ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యకు 34 శాతం మంది నమోదిత ఓటర్లు మద్దతు తెలిపారు. 60 శాతం మంది వ్యతిరేకించారు. ఈ అంశంపై క్విన్నిపియాక్ ప్రశ్నించడం ప్రారంభించిన తర్వాత నమోదైన అత్యధిక వ్యతిరేకత ఇదేనని సర్వే పేర్కొంది. ఏప్రిల్‌లో నిర్వహించిన క్విన్నిపియాక్ సర్వేలో, ఇరాన్ పరిస్థితిని ట్రంప్ ఎదుర్కొంటున్న తీరును 36 శాతం మంది ఆమోదించగా, 58 శాతం మంది వ్యతిరేకించారు. అదే సమయంలో ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యకు 40 శాతం మంది మద్దతు ఇవ్వగా, 53 శాతం మంది వ్యతిరేకించారు. తాజా యూగోవ్ ట్రాకర్ ప్రకారం, విదేశాంగ విధానంతో పాటు దేశీయ సమస్యలు కూడా అమెరికన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ద్రవ్యోల్బణం, ధరలు, ఉద్యోగాలు, ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలు ప్రజల ఆందోళనల్లో ముందున్నాయి. ట్రంప్ అధ్యక్ష పనితీరుపై 35 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేయగా, 60 శాతం మంది అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తాజా యూగోవ్ గణాంకాలు చెబుతున్నాయి.

## హెచ్1బి వీసాలపై మరో యేడాది అనిశ్చితి

### విదేశీ ఉద్యోగుల కోసం 1 లక్ష డాలర్ల ఫీజు కొనసాగింపు

అమెరికాలో పనిచేస్తున్న భారతీయ ఐటీ నిపుణులు, అక్కడి టెక్నాలజీ కంపెనీలకు మరో ఏడాది అనిశ్చితి ఎదురుకానుంది. విదేశీ ఉద్యోగులను అమెరికాకు తీసుకురావడానికి యజమానులు చెల్లించాల్సిన 1,00,000 అమెరికన్ డాలర్ల హెచ్1బి వీసా ఫీజును మరో ఏడాది పాటు కొనసాగిస్తూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా వైట్‌హౌస్ ప్రకారం ఈ ఫీజు కొనసాగింపు ద్వారా అమెరికన్ ఉద్యోగులను రక్షించడం, అధిక నైపుణ్యం కలిగిన, అత్యవసరమైన విదేశీ నిపుణులకు మాత్రమే హెచ్1బి వీసాలు అందేలా చూడడం లక్ష్యంగా పెట్టుకున్నారు. హెచ్1బి కార్యక్రమం ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో భారతీయులు అత్యధిక సంఖ్యలో ఉన్నారు. శుక్రవారం జారీ చేసిన అధ్యక్ష ప్రకటనలో ట్రంప్ మాట్లాడుతూ 2025లో విధించిన 1,00,000 డాలర్ల ఫీజు కారణంగా పెద్ద ఐటీ ఔట్‌సోర్సింగ్ సంస్థల నుంచి వచ్చిన హెచ్1బి రిజిస్ట్రేషన్లు 92 శాతం తగ్గాయని పేర్కొన్నారు. 2025లో జారీ చేసిన ప్రకటనను మరో ఏడాది పొడిగించడం ద్వారా అమెరికా ఆర్థిక, జాతీయ భద్రతా ప్రయోజనాలను కాపాడవచ్చు. అమెరికన్ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లకు కార్మిక మార్కెట్‌లో అవకాశాలను మెరుగుపరచడంతో పాటు, అత్యంత నైపుణ్యం కలిగిన మరియు అవసరమైన విదేశీ ఉద్యోగులను మాత్రమే నియమించేలా చేయవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ ప్రభుత్వం తొలిసారిగా 2025 సెప్టెంబర్‌లో ఈ భారీ ఫీజును ప్రకటించింది. ఆ నిర్ణయం గడువు ఈ నెలతో ముగియాల్సి ఉండగా, తాజాగా మరో ఏడాది పాటు పొడిగించారు. అయితే అమెరికాలో ఇప్పటికే విద్యార్థి వీసాలపై ఉన్న విదేశీ పౌరులకు మంజూరయ్యే హెచ్1బి వీసాలకు, ప్రస్తుత వీసాల పునరుద్ధరణకు ఈ ఫీజు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం అమెరికాలో నైపుణ్యం కలిగిన భారతీయ ఉద్యోగులను నియమించుకునే భారతీయ, అమెరికన్ ఐటీ సంస్థలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## రెజీనగర్ టిఎంసి అభ్యర్థి పోటీనుంచి విత్‌డ్రా

### అంతలోనే యుటర్న్.. పోటీకి సై



**కోల్‌కత్తా, సెప్టెంబరు 19:** పశ్చిమ బెంగాల్ ఉప ఎన్నికల రాజకీయాలు నాటకీయ పరిణామాలతో ఒక్కసారిగా వేడెక్కాయి. శనివారం ఉదయం మమత బెనర్జీకి షాకిస్తూ పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన రెజీనగర్ అభ్యర్థి రబీఉల్ ఆలమ్ చౌదరి, కొన్ని గంటల వ్యవధిలోనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. మమత బెనర్జీ స్వయంగా చొరవ చూపి పట్టుబట్టడంతో ఆయన తిరిగి పోటీలో నిలిచేందుకు అంగీకరించారు. శనివారం ఉదయం, రాష్ట్ర యంత్రాంగం తమ పార్టీ కార్యకర్తలను వేధిస్తోందని, తమకు అధికారిక పార్టీ గుర్తును కేటాయించలేదని ఆరోపిస్తూ రబీఉల్ ఆలమ్ చౌదరి ఉప ఎన్నిక బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామం మమత వర్గంలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. అయితే, వెంటనే రంగంలోకి దిగిన మమత బెనర్జీ ఇతర సీనియర్ నాయకులతో కలిసి ఆయనతో చర్చలు జరిపారు. పార్టీ అధిష్ఠానం ఒత్తిడితో తన మనసు మార్చుకున్న రబీఉల్, తాను పోటీలో కొనసాగుతున్నట్లు మధ్యాహ్నం స్పష్టం చేశారు. అక్టోబర్ 6న రెజీనగర్‌తో పాటు నందిగ్రామ్‌లోనూ ఉప ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే నందిగ్రామ్‌లో మమత వర్గం అభ్యర్థిగా ప్రకటించిన సంచితా ప్రధాన్ డే, ముఖ్యమంత్రి సువేందు అధికారిని కలిసిన అనంతరం తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో అక్కడ కాంగ్రెస్ అభ్యర్థికి మమత మద్దతు ప్రకటించగా, ఆ కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌ను 2007 నాటి ఓ పాత హత్య కేసులో పోలీసులు అరెస్ట్ చేయడం గమనార్హం. తృణమూల్ కాంగ్రెస్‌లో తలెత్తిన చీలిక కారణంగా ఎన్నికల సంఘం పార్టీ పేరును, గుర్తును తాత్కాలికంగా స్తంభింపజేసింది. మమత వర్గానికి "మమత ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్" పేరుతో "ఫుట్‌బాల్ ప్లేయర్" గుర్తును, ప్రత్యర్థి వర్గానికి "డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్" పేరుతో "ఎన్వలప్ కవరు" గుర్తును కేటాయించింది.

## పంజాబ్‌లో కేంద్ర మాజీ మంత్రి అరెస్టు!

**అమృత్‌సర్, సెప్టెంబరు 19:** పంజాబ్ ఎన్నికల ముందు రాజకీయ ఉద్రిక్తతలు పతాకస్థాయికి చేరాయి. బీజేపీ నాయకుడు, మాజీ కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి రవ్‌నీత్ బిట్టును శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో పంజాబ్‌లోని లుధియానాలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఎం భగవంత్ మాన్ కాన్వాయ్‌పై టొమాటో, గుడ్లు విసరడానికి ప్రయత్నించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ముందు గేటు వద్ద ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఆయన చేతిలో గుడ్లు, టొమాటోలు ఉన్నాయని, సీఎం మాన్ కాన్వాయ్‌పై విసిరేందుకు ప్రయత్నించారని పోలీసులు చెబుతున్నారు. లూథియానాలో ఆప్ భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్, సీఎం భగవంత్ మాన్, పార్టీ నేత మనీష్ సిసోడియా మొదలైన వారు వస్తున్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లేందుకు పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వెలుపల ఉన్న మార్గం గుండా ముఖ్యమంత్రి కాన్వాయ్ వెళ్లా ఉంది. ఇదే సమయంలో బిట్టూ టొమాటోలు, గుడ్లతో అక్కడి చేరుకున్నారు. ఈ లోపే పోలీసులు అడ్డుకున్నారు. ఇదిలా ఉంటే, దీనికి ఒక రోజు ముందు బటాలా సమీపంలో బిట్టూ కాన్వాయ్‌పై గుడ్లు, టొమాటోలు విసిరారు. ఆప్ కార్యకర్తలే ఈ దాడికి పాల్పడినట్లు బిట్టూ ఆరోపించారు. వరస ఘటనలో పంజాబ్‌లో ఎన్నికల ముందు ఆప్, బీజేపీ మధ్ పొలిటికల్ హీట్ పెరుగుతోంది. బీజేపీ నషా ముక్త్ పంజాబ్ యాత్ర ప్రారంభించింది.

## ఢిల్లీలో హత్యాచారం కేసుపై రాహుల్, ప్రియాంకల ఆగ్రహం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** దేశ రాజధాని ఢిల్లీలో బాలికపై సామూహిక అత్యాచారం, హత్య ఘటనపై ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ తీవ్రంగా స్పందించారు. మహిళల భద్రత విషయంలో ఢిల్లీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం వ్యవహరిస్తున్న తీరుపై వారు ప్రశ్నలు సంధించారు. ఎక్స్ వేదికగా స్పందించిన ప్రియాంక గాంధీ బాలికపై జరిగిన దారుణం క్రూరత్వానికి అన్ని హద్దులు దాటిందని పేర్కొన్నారు. బాలికపై అత్యాచారం అనంతరం ఆమెను హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఇటీవల మరో మైనర్ బాలికపై అత్యాచారం ఆరోపణలతో కూడిన ఘటనను ప్రస్తావిస్తూ మహిళలు, బాలికలపై హింస కొనసాగుతున్నప్పటికీ నిందితులపై తగిన చర్యలు తీసుకుంటున్నారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని అన్నారు. మహిళలకు భద్రత, స్వేచ్ఛ, సమానత్వం కల్పించడంలో సమాజంతో పాటు ప్రభుత్వం కూడా విఫలమవుతోందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. మహిళలపై హింసకు సంబంధించిన కేసుల్లో ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, నిందితులపై చర్యలు తీసుకునేలా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారా అని ప్రశ్నించారు. రాహుల్ గాంధీ కూడా ఎక్స్ వేదికగా ఈ ఘటనపై స్పందించారు. 17 ఏళ్ల బాలికపై సామూహిక అత్యాచారం చేసి హత్య చేసిన అనంతరం మృతదేహాన్ని బహిరంగ ప్రదేశంలో పడేశారని పేర్కొన్నారు. దేశ రాజధానిలో ఇంత దారుణమైన నేరం జరిగినప్పటికీ అది రోజుల తరబడి ఎలా గుర్తించబడకుండా ఉండిపోయిందని ప్రశ్నించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను ఉద్దేశించి రాహుల్ గాంధీ ఢిల్లీ పోలీసు వ్యవస్థ కేంద్ర హోంశాఖ పరిధిలో ఉందని పేర్కొన్నారు. నగరంలో మహిళల భద్రతకు చివరికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. నేరస్థులు ఎలాంటి భయం లేకుండా తిరుగుతున్నారని ఆరోపించిన ఆయన ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఘటనలో జరిగిన నిర్లక్ష్యానికి బాధ్యతను నిర్ణయించాలని కోరారు. మహిళల భద్రత లేకుండా భారత్ ముందుకు సాగలేదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

## కిమ్ అణుపరీక్షలతో 1399 భూకంపాలు!

### శాస్త్రవేత్తల అధ్యయనంలో తేలిన నిజాలు

**సియోల్, సెప్టెంబరు 19:** ఉత్తర కొరియా చేపట్టిన భూగర్భ అణు పరీక్షలు తీవ్రమైన, దీర్ఘకాలిక పర్యావసనాలకు దారితీసినట్లు తాజా అధ్యయనం ఒకటి వెల్లడించింది. 2006 నుంచి 2017 మధ్య పంగ్యేరి అణు పరీక్ష కేంద్రంలో నిర్వహించిన ఆరు అణు పరీక్షల కారణంగా, గతంలో నిద్రాణంగా ఉన్న భూమి పొరల్లోని ఫాల్ట్‌లు తిరిగి ఉత్తేజితమై, ఏకంగా 1,399 భూకంపాలను ప్రేరేపించి ఉండవచ్చని ఈ పరిశోధన తేల్చింది. ఈ సంచలన వివరాలతో కూడిన అధ్యయనం ప్రతిష్ఠాత్మక సైన్స్ జర్నల్‌లో ప్రచురితమైంది. దక్షిణ కొరియాలోని పూసాన్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ క్వాంగ్‌హీ కిమ్, చైనాలోని చెంగ్‌డు యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీకి చెందిన జియాంగ్‌లి ఫాన్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధనను చేపట్టింది. ఇందుకోసం చైనా, దక్షిణ కొరియా సీస్మిక్ స్టేషన్ల నుంచి 2008-25 మధ్య 17 ఏళ్లపాటు సేకరించిన డేటాను విశ్లేషించారు. మ్యాచ్డ్‌ఫిల్టర్ డిటెక్షన్ అనే ఆధునిక పద్ధతి ద్వారా సాధారణ మానిటరింగ్‌లో గుర్తించలేని అతి చిన్న భూకంపాలను కూడా వీరు కనుగొన్నారు. మొత్తం 1,399 భూకంపాలు నమోదు కాగా, వాటిలో 955 ఎక్కడ సంభవించాయో కచ్చితమైన ప్రదేశాలను నిర్ధారించారు. అణు పరీక్షలు జరిగిన మంటాప్ పర్వత ప్రాంతం గతంలో భూకంప కార్యకలాపాలు లేని ప్రదేశంగా ఉండేది. 2006-17 మధ్య ఇక్కడ కేవలం 60 భూకంపాలు మాత్రమే నమోదయ్యాయి. కానీ 2017 సెప్టెంబర్‌లో జరిగిన ఆరో, అత్యంత శక్తివంతమైన అణు పరీక్ష తర్వాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ఆ పరీక్ష జరిగిన 20 రోజుల తర్వాత భూకంపాల సంఖ్య అనూహ్యంగా పెరిగింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 1,330కి పైగా భూకంపాలు సంభవించాయి. ఇవన్నీ దాదాపు 24 కిలోమీటర్ల పొడవైన రెండు ఫాల్ట్ జోన్‌ల వెంబడి కేంద్రీకృతమయ్యాయని పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా అణు పరీక్షల తర్వాత భూకంప కార్యకలాపాలు క్రమంగా తగ్గుముఖం పడతాయి. కానీ ఇక్కడ అందుకు విరుద్ధంగా 2017 తర్వాత భూకంపాల సంఖ్య, తీవ్రత రెండూ పెరిగాయి. చాలా వరకు భూకంపాల తీవ్రత 2 కంటే తక్కువగా ఉన్నప్పటికీ, 2023-24 మధ్య కొన్ని 3.0 కంటే ఎక్కువ తీవ్రతతో, గరిష్ఠంగా 3.4 మాగ్నిట్యూడ్‌తో నమోదయ్యాయి. వరుస పేలుళ్ల వల్ల భూమి పైపొర దెబ్బతిని, ఒత్తిడిలో మార్పులు జరిగి, నిద్రాణమైన ఫాల్ట్‌లు క్రియాశీలమయ్యాయని శాస్త్రవేత్తలు విశ్లేషించారు. ఈ 24 కిలోమీటర్ల ఫాల్ట్ జోన్ పూర్తిగా చురుకైతే, భవిష్యత్తులో 6.4 తీవ్రతతో భారీ భూకంపం సంభవించే ప్రమాదం ఉందని ప్రొఫెసర్ కిమ్ అంచనా వేశారు. ఈ పరిణామం సహజ భూకంపాలు, రహస్య అణు పరీక్షల మధ్య తేడాలను గుర్తించడాన్ని మరింత సంక్లిష్టం చేస్తుందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


## సంక్షిప్త వార్తలు

### సైబర్ చీటింగ్‌కు గురైన బిజెపి ఎమ్మెల్యే




**లక్నో,సెప్టెంబరు 19:** ఉత్తరప్రదేశ్‌లో బీజేపీకి చెందిన ఓ మహిళా ఎమ్మెల్యే సైబర్ మోసానికి గురయ్యారు. కౌశాంబి జిల్లా చైల్ నియోజకవర్గ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పూజా పాల్ బ్యాంకు ఖాతా నుంచి గుర్తుతెలియని వ్యక్తులు రూ.1.55 లక్షలు అపహరించారు. ఈ ఘటనపై ఆమె ప్రయాగ్‌రాజ్‌లోని ధూమన్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తన ఐఫోన్ 17 ఎయిర్‌ను హ్యాకర్లు హ్యాక్ చేసి, బ్యాంకు వివరాలతో పాటు వ్యక్తిగత డేటాను తస్కరించి ఈ మోసానికి పాల్పడి ఉంటారని పూజా పాల్ అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన లావాదేవీలపై పూర్తిస్థాయి విచారణ జరిపి, తన మొబైల్ ఫోన్‌కు టెక్నికల్ ఆడిట్ నిర్వహించాలని ఆమె కోరారు.

### బెంగాల్‌లో ఇంగ్లీష్ విలేజ్



**కోల్‌కత్తా, సెప్టెంబరు 19:** పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాలో ఉన్న కలియాచక్ గ్రామం ఇంగ్లీష్ విలేజ్‌గా దేశవ్యాప్తంగా అరుదైన గుర్తింపు పొందింది. ఇక్కడి పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ఇంగ్లీష్ భాషను ఒక భాగంగా మార్చుకున్నారు. ఇంగ్లీష్ నేర్చుకోవడం, నేర్పించడం ఇక్కడ తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. కలియాచక్‌లో ఇంగ్లీష్ కేవలం ఓ పాఠ్యాంశం కాదు, అది వారి జీవన విధానం, ప్రధాన ఉపాధి మార్గం. గ్రామంలో ఎక్కడ చూసినా ట్యూషన్ సెంటర్లు, ప్రైవేట్ క్లాసులు కనిపిస్తాయి.

### ఢిల్లీ హైకోర్టుకు ఏడుగురు న్యాయాధికారుల నియామకం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుల మేరకు ఢిల్లీ హైకోర్టుకు ఏడుగురు న్యాయాధికారులను న్యాయమూర్తులు, అదనపు న్యాయమూర్తులుగా కేంద్ర ప్రభుత్వం శనివారం నియమించింది.

నివేదిత అనిల్ శర్మ, నిషా సహాయ్ సక్సేనాలను ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించారు. సంజయ్ శర్మ, భరత్ పరాశర్, అదితి చౌదరి, దినేశ్ భట్, అరుణ్ భారద్వాజ్‌లను అదనపు న్యాయమూర్తులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

### ఢాకాలో వరుస పేలుళ్లు.. 200కు పైగా చెక్‌పోస్టుల ఏర్పాటు



**ఢాకా, సెప్టెంబరు 19:** బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో వరుసగా క్రూడ్ బాంబు పేలుళ్లు చోటుచేసుకోవడంతో భద్రతను కట్టుదిట్టం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పేలుళ్లు జరిగిన అనంతరం కఫ్రుల్ ప్రాంతంలో ఓ బస్సుకు నిప్పుపెట్టిన ఘటన కలకలం రేపింది. దీంతో ఢాకా మెట్రోపాలిటన్ పోలీస్ నగరవ్యాప్తంగా 200కు పైగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసింది. పలు ప్రాంతాల్లో పోలీసు గస్తీ, వాహనాల తనిఖీలు కొనసాగుతున్నాయి.

### పంజాబ్‌లో ఎఎస్ఐ కాల్చివేత



**అమృత్‌సర్, సెప్టెంబరు 19:** పంజాబ్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. విధుల్లో ఉన్న పోలీసు అధికారిపై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరపడంతో అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ మృతి చెందారు. అమృత్‌సర్‌లోని భగ్తావాలా ధాన్యం మార్కెట్‌లో ఈ ఘటన జరిగింది. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఎఎస్ఐ హర్జీత్ సింగ్ భగ్తావాలా గ్రెయిన్ మార్కెట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లో పలుమార్లు కాల్పులు జరిపారు.

# క్యూర్ పరిధిలో 21 వేల డబుల్‌బెడ్ ఇళ్లు పూర్తి



శనివారం సచివాలయం నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

### నెలాఖరులోగా లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలి

### 9 వేల మందికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

### కలెక్టర్లతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** గత ప్రభుత్వం మొండిగోడలతో అసంపూర్తిగా వదిలేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు పూర్తి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆనాటి ప్రభుత్వం ప్రారం భించి వదిలేసిన ఇళ్లను మేమెం దుకు పూర్తిచేయాలన్న భేష జాలకు పోకుండా ఒక్క క్యూర్ పరిధిలోని 26 ప్రాంతాల్లో 21వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పూర్తి చేశామని ప్రకటించారు. శనివారం రాష్ట్ర సచివాలయంలోని తన కార్యా లయం నుంచి రంగారెడ్డి, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, వాటర్ వర్క్స్, విద్యుత్ అధికారులతో హౌసింగ్ సెక్రటరీ విపి గౌతమ్‌తో కలిసి మంత్రిగారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మంత్రి మాట్లా డుతూ పూర్తి చేసిన డబుల్‌బెడ్ ఇళ్లకు ఈనెల 30వ తేదీలోగా యుద్ధ ప్రాతిపదికన పారదర్శకంగా డ్రా పద్ధతిలో లబ్దిదారుల ఎంపిక పూర్తి చేసి ఆన్‌లైన్ పోర్టల్‌లో లబ్దిదారుల వివరాలను నమోదు చేయాలని ఆదేశించారు. 2బిహెచ్‌కే ఇళ్లు ఉన్న ప్రాంతానికి 5 నుంచి 7 కిలో మీటర్ల పరిధిలో ఉన్నవారినే ఎంపిక చేయాలని సూచించారు. డబుల్‌బెడ్ ఇళ్ల కాలనీలలో తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సదుపాయాలపై ప్రత్యేకదృష్టి సారించాలని వాటర్ వర్క్స్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్ తది తర శాఖలతో సమన్వయం చేసుకొని వచ్చేనెలాఖరులోగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. అలాగే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఉన్న అనర్హులను తొలగించాలని, ఆ ఇళ్లలో నివసించని వారికి ఫైనల్ నోటీస్ ఇచ్చి రద్దు చేయాలని, అంతేగాక నోటీసులకు స్పందించని వారి ఇళ్లను రద్దుచేసి వారి స్థానంలో అర్హులైన వారిని ఎంపిక చేయాలని కలెక్టర్లకు సూచించారు. క్యూర్ పరిధిలో ఇంటిస్థలాలు ఉండి అర్హులైన 9వేల మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రిగారు ప్రకటించారు. ఇన్‌ఛార్జి మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని ఇందిరమ్మ ఇళ్లకు లబ్దిదారుల ఎంపిక, మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులకు సూచించారు.



శనివారం సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు సమక్షంలో టిజిఎస్ఎఎతో కాలేజియేట్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్ ఒప్పందం కుదుర్చుకున్న దృశ్యం

## యువతకు విమానయాన రంగంలో నాణ్యమైన సాంకేతిక, ప్రాక్టికల్ శిక్షణ

### ఏవియేషన్ శిక్షణకు టిజిఎస్ఎఎతో సాంకేతిక విద్యాశాఖ కీలక ఒప్పందం

**హైదరాబాద్,సెప్టెంబరు19,ప్రభాతవార్త:** రాష్ట్రంలోని యువతకు విమానయాన రంగంలో నాణ్యమైన సాంకేతిక, ప్రాక్టికల్ శిక్షణ అందించేందుకు ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. హైదరాబాద్ పాత ఎయిర్‌పోర్ట్‌లోని తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ(టిజిఎస్ఎఎ)తో రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదుర్చుకుంది. శనివారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు డా.కె.కేశవరావు సమక్షంలో కీలక ఒప్పందం జరిగింది. కాలేజియేట్ ఎడ్యుకేషన్, టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఎంఈ శిక్షణకు పరిశ్రమ ఆధారిత అనుభవం: ఈ ఒప్పందం ద్వారా హైదరాబాద్ రామంతాపూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ (జెఎన్‌జిపి)లో నిర్వ హించే మూడేళ్ల ఆర్టీఫి ఏయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజనీరింగ్(ఏఎంఈ) ట్రెనింగ్ డిప్లొమా ప్రొగ్రాములకు మరింత ప్రాక్టికల్, పరిశ్రమ ఆధారిత శిక్షణ అందుబాటులోకి రానుంది. విద్యార్థులకు సైద్ధాంతిక విద్యతో పాటు ల్యాబొరేటరీ ప్రాక్టికల్స్, విమానాల పరిచయం, ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్స్‌పై శిక్షణ, చివరి ఏడాదిలో పరిశ్రమ ఆధారిత ప్రాక్టికల్ వర్క్ ఎక్స్ పీరియన్స్ కల్పించనున్నారు.

### 2,100 గంటల ప్రాక్టికల్ శిక్షణ

మొదటి రెండు సంవత్సరాల్లో జెఎన్‌జిపి/ టజిఎస్ఏఏ)ఆధ్వర్యంలో థియరీ, ల్యాబొరేటరీ ప్రాక్టికల్స్, ఎయిర్‌క్రాఫ్ట్ ఫ్యామిలియరైజేషన్, సిస్టమ్స్ ట్రెనింగ్ అందిస్తారు. చివరి ఏడాదిలో టిజి ఎస్ఏఏలో ఒక సంవత్సరం పాటు 2,100 గంటల ప్రాక్టికల్ వర్క్ ఎక్స్‌పీరియన్స్/ ఇండస్ట్రియల్ ట్రెనింగ్ అందించడం ఈ ఎంఓయులోని ప్రధాన ప్రత్యేకత, విమానయాన పరిశ్రమతో ప్రత్యక్ష అనుసంధానం: టిజిఎస్ఏఏ అనుభవజ్ఞులైన శిక్షకులను అందించడంతో పాటు, ప్రాక్టికల్ ల్యాబొరేటరీ సౌకర్యాలు, ప్రత్యేక విమానాల యాక్సెస్, విమాన నిర్వహణపై ప్రాక్టికల్ ఎక్స్‌పోజర్, మెయింటెనెన్స్ ఏరియాలో పని అనుభవాన్ని అందించనుంది. దీంతో విద్యార్థులకు ఎయిర్‌లైన్స్, ఫ్లయింగ్ ట్రెనింగ్ ఆర్గనైజేషన్స్, ఎయిర్‌క్రాఫ్ట్ ఆపరేటర్లు, ఎంఆర్‌వోలు, ఏరోనాటికల్ తయారీ, ఏరోస్పేస్ రంగాలపై ప్రత్యక్ష అవగాహన, పరిశ్రమ అనుభవం పొందే అవకాశం ఏర్పడుతుంది. ఏవియేషన్ సేఫ్టీకి ప్రాధాన్యత: విమానయాన రంగంలో భద్రతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, విద్యార్థులకు తప్పనిసరి సేఫ్టీ అండ్ సెక్యూరిటీ బ్రీఫింగ్స్ నిర్వహించడంతో పాటు ఏఏఐ, బిసిఏఎస్ సంబంధిత నిబంధనలను పాటించేలా శిక్షణ అందించనున్నారు. నైపుణ్యంతో కూడిన యువతకు బలమైన పునాది: ఈ భాగస్వామ్యం ద్వారా ప్రభుత్వ సాంకేతిక విద్యా వ్యవస్థను విమానయాన పరిశ్రమ అవసరాలతో అనుసంధానం చేయడం సాధ్యమవుతుంది. విద్యార్థులు తరగతి గది పరిజ్ఞానంతో పాటు వాస్తవ విమాన నిర్వహణ వాతావరణంలో ప్రాక్టికల్ అనుభవాన్ని పొందే అవకాశం ఉంటుంది. నిర్దేశిత శిక్షణ గంటలను పూర్తి చేసి, 90 శాతం హాజరు, అవసరమైన పనితీరు ప్రమాణాలను పూర్తి చేసిన విద్యార్థులకు ప్రాక్టికల్ ట్రెనింగ్ సర్టిఫికేట్ జారీ చేయనున్నారు.

### ఐదేళ్లపాటు అమల్లో ఎంఓయు

ఈ అవగాహన ఒప్పందం సంతకం చేసిన తేదీ నుంచి ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. పరస్పర అంగీకారంతో ఒప్పందాన్ని పునరుద్ధరించుకునే అవకాశం ఉంది. తెలంగాణ యువతకు విమానయాన రంగంలో నైపుణ్యాలను పెంపొం దించడంతో పాటు, ప్రాక్టికల్ శిక్షణ, పరిశ్రమ అనుభవాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఈ భాగస్వామ్యం రాష్ట్రంలో సాంకేతిక విద్య-పరిశ్రమ అనుసంధానానికి ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలవనుంది.

## పంటల డిజిటల్ సర్వేలో వెనుకబడిన రాష్ట్రం

### కవర్ చేసిన గ్రామాలు కేవలం 78 శాతమే

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** తెలంగాణ 2025-26 సంవత్సరానికి డిజిటల్ పంట సర్వే కింద 100 జిల్లాల వారీగా కవరేజీని సాధించినప్పటికీ, కేవలం 78 శాతం గ్రామాలను మాత్రమే కవర్ అయ్యాయి. దక్షిణాది వ్యవసాయ సదస్సులో సమర్పించిన డేటా వీటి విష యాలను వెల్లడించింది. తమిళనాడు రాష్ట్రంలోని 99 శాతం గ్రామాల్లో సర్వే పూర్తి చేయగా, ఆ తర్వాత స్థానంలో కర్నాటక 97 శాతంతో నిలిచింది. ఆంధ్రప్రదేశ్ 86 శాతం గ్రామాలను, అండమాన్ నికోబార్ దీవులు 4 శాతం గ్రామాలను కవర్ చేశాయి. కేరళ 36 శాతంతోను, పుదుచ్చేరి, లక్ష్యదీప్‌లలో కవరేజ్ సున్నాగా నమోదైంది. జిల్లా స్థాయిలో చూస్తే తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, కేరళతో సమానంగా తెలంగాణలో జిల్లా స్థాయి కవరేజ్ 100 శాతంగా ఉంది. కాగా తెలంగాణలోని 10,887 గ్రామాలలో 9,786 మ్యాప్‌లను జియోరిఫరెన్స్ చేసింది. దీంతో జియోరిఫరెన్సింగ్ 90 శాతానికి చేరుకుంది.

## మల్లూరు క్షేత్ర ప్రాశస్త్యానికి అనుగుణంగా అభివృద్ధికి చర్యలు

### లక్ష్మీనరసింహస్వామి ఆలయ సందర్శకుల కోసం వసతుల కల్పనపై మంత్రి సీతక్క సమీక్ష

**హైదరాబాద్,సెప్టెంబరు19,ప్రభాతవార్త:** ములుగు జిల్లాలోని ప్రసిద్ధ మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క దేవాలయ అభివృద్ధి పనులపై సంబంధిత అధికారులతో రాష్ట్ర సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో పాటు ప్రముఖ ఆర్కి టెక్టులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రస్తుత పరిస్థితి, భక్తుల రాకపోకలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై సమావేశంలో విస్తృ తంగా చర్చించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, మల్లూరు క్షేత్ర ప్రాశస్త్యం, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి సీతక్క సూచించారు. అభివృద్ధి పనులలో భాగంగా కళ్యాణ మండపం, డార్మిటరీ, అన్నదాన సత్రం వంటి అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయడంపై సమావేశంలో చర్చించి, వాటి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. దేవాలయ ప్రధాన నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది లేదా డిస్టర్బెన్స్ కలగకుండా, క్షేత్ర పవిత్రతను కాపాడుతూ అభివృద్ధి పనులు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. దేవాలయ నిర్మాణ స్వరూపం, పరిసర ప్రాంతాల ప్రత్యేకత, భక్తుల అవసరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని ఆర్కిటెక్టులు, అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన డిజైన్‌ను ఖరారు చేసేందుకు త్వరలో మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించాలని సమావేశంలో నిర్ణయించారు. క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం దేవాలయ అభివృద్ధికి అనువైన డిజైన్‌ను ఖరారు చేయనున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించి భూమి స్థితిగతులు, నిర్మాణ సామర్థ్యం తదితర అంశాలను నిర్ధారించేందుకు రాక్ టెస్ట్‌ను త్వరితగతిన చేపట్టాలని నిర్ణయించారు. రాక్ టెస్ట్ నివేదిక ఆధారంగా తదుపరి నిర్మాణ పనులకు సంబంధించిన సాంకేతిక అంశాలను ఖరారు చేయనున్నారు.

## భారీవర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### డ్రైనేజీలను వెంటనే క్లియర్ చేయాలి

### ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

### అత్యవసర పరిస్థితులకు వేగంగా స్పందించాలి: సిఎస్ సంజయ్‌జాజు

**హైదరాబాద్,సెప్టెంబరు19,ప్రభాతవార్త:** రాష్ట్రంలో భారీ వర్షాల హెచ్చరిక నేపథ్యంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులతో పరిస్థితిని సమీక్షించారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, పోలీస్ కమిషనరేట్ల ఉన్నతాధికారులతో వర్షాల నేపథ్యంలో చేపట్టిన ముందస్తు చర్యలు, సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు.



వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో ఉండాలని సీఎస్ ఆదేశించారు. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు, డ్రైనేజీ వ్యవస్థలను నిరంతరం పర్యవేక్షించాలని, నీరు నిలిచే ప్రాంతాల్లో డ్రైనేజీలను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. వర్షాల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే వేగంగా స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ సమాచారం ప్రకారం,భారీ వర్షాల నేపథ్యంలో రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్- మల్కాజిగిరి, నాగర్‌కర్నూల్, నల్గొండ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు/ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. గంటకు 40 కిలోమీటర్ల వరకు ఉపరితల గాలులు వీచే అవకాశం ఉన్నందున సంబంధిత అధికారులు, ఫీల్డ్ సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ ఆదేశించారు.

## ప్రభుత్వం ఫీజులు ఎత్తివేసే కుట్రలు మానుకోవాలి

### ఎంపి ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (నాంపల్లి), సెప్టెంబరు 19, ప్రభాతవార్త :** రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజుల ఎత్తివేత కుట్రలు మానుకోవాలని, ఈ పథకాలను యథాతథంగా పాత పద్ధతిలోనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 14లక్షలమంది కాలేజీ విద్యార్థుల ఫీజు బకాయిలు 8వేల కోట్లు వెంటనే విడుదల చేయాలని రాజ్యసభ సభ్యుడు జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయాధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర విద్యార్థి సంఘం కన్వీనర్ నిఖిల్ పటేల్ నాయకత్వంలో ఆర్.కృష్ణయ్య వేలాదిమంది విద్యార్థులతో కలిసి బషీర్‌బాగ్ నిజాం కాలేజీ నుండి భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఫీజు పథకాలకు బడ్జెట్ కేటాయించకుండా ముఖ్యమంత్రి పేదకులాల జీవితాలతో చెలగాట మాడుతున్నారని ధ్వజమెత్తారు. బిసి, ఎస్సీ, ఎస్టీలు చదువు కుంటుంటే ఓర్వలేక పోవడం గర్హనీయమన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ రద్దుచేసే కుట్రేకాక 23వేల ప్రభుత్వ పాఠశాలల రద్దు, గురుకులాలను రద్దుచేసే కుట్రలకు తెరతీస్తున్నారని ఆవేదన వ్యక్తపరిచారు. ముఖ్య మంత్రిగా రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక బిసిలకు ఒక చిన్నస్కీమ్ కూడా పెట్టకపోగా ఉన్నవాటిని సరిగా నడపడం లేదన్నారు. బిసి సంక్షేమశాఖను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని, బిసి వ్యతిరేక చర్యలకు పాల్పడు తున్నారని, బిసి కార్పొరేషన్ ఋణాలు ఇవ్వక పోగా అసలు బిసి శాఖలో బిసిలే లేకపోవడం దుర్మార్గమన్నారు. మూడు సంవత్సరాలు ఉద్యమాలు చేస్తూ విద్యార్థులు తరగతుల బహిష్కరణ, కాలేజీల బంద్ తదితర ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు మొండివైఖరి అవలంబించడం, విద్యార్థుల ఉద్యమాలను తక్కువ అంచనా వేయడం ఏమాత్రం సరికాదని హెచ్చరిస్తూ తెలంగాణ ఉద్యమాల్లో విద్యార్థులు చూపిన సత్తా మరవద్దని ఆర్.కృష్ణయ్య హితవు పలికారు.



ఫీజుల బకాయిల చెల్లింపు కోసం భారీప్రదర్శన చేస్తున్న విద్యార్థులతో ఆర్.కృష్ణయ్య, నిఖిల్ తదితరులు

## దానం నాగేందర్‌పై కోర్టు తీర్పు బిఆర్ఎస్, కెసిఆర్‌కు చెంపపెట్టు

### పార్టీ ఫిరాయింపు దుష్టసంస్కృతి తెచ్చిందే కెసిఆర్

### ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో గెలిచి తీరుతాం

### పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 19,ప్రభాతవార్త:** దానం నాగేందర్ కోర్టు తీర్పు బిఆర్ఎస్, కెసిఆర్‌కు చెంపపెట్టులాంటిదని తెలుగుదేశంలో గెలిచిన తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను, కాంగ్రెస్ గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని తనపార్టీలోకి తీసుకొని ఏకంగా మంత్రిమండలిలోకి స్థానం కల్పించి మంత్రి పదవులు ఇచ్చారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఢిల్లీలో విలేఖరులతో ఇష్టాగోష్టిలో శనివారం ఆయన మాట్లాడుతూ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు వెలువరించిన తీర్పును మహేశ్ కుమార్ గౌడ్ స్వాగతించారు. పార్టీ ఫిరాయింపు దుష్ట సంస్కృతి తీసుకొచ్చిందే కెసిఆర్ దుయ్యబట్టారు. కాంగ్రెస్ పార్టీ తరఫున గెలిచిన ఎమ్మెల్యేలను గతంలో ఏ విధంగా కొనుగోలు చేసి తమ పార్టీలో విలీనం చేసుకున్నారో ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని మండిపడ్డారు. అటువంటి అక్రమాలకు పాల్పడిన బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. వాస్తవానికి ఈ తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి కాదని, ప్రతిపక్ష బిఆర్ఎస్ పార్టీకి లభించిన తీవ్ర చెంపపెట్టని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ రాజ్యాంగబద్ధంగా, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని ఆయన తెలిపారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి ఉప ఎన్నికలు వచ్చినా ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని సమరోత్సాహం వ్యక్తంచేశారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో మళ్లీ దానం నాగేందర్ పోటీ చేస్తారా లేదా అన్నది కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కాంగ్రెస్ సిడబ్ల్యుసి, సిఇసి,సిఫార్సు మేరకు నిర్ణయిస్తుందని వివరించారు. ఉప ఎన్నికలలో ప్రజా తీర్పు మళ్లీ తమకే అనుకూలంగా ఉంటుందని ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ ఆశాభావం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎలాంటి పార్టీ ఫిరాయింపులు జరగలేదని స్పష్టం చేశారు. కేవలం కాంగ్రెస్ పార్టీ అందిస్తున్న ప్రజాపాలనకు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మాత్రమే ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నారని అన్నారు. బిజెపికి ప్రభుత్వాలను కూల్చే పార్టీలను చీల్చే చరిత్ర ఉందని దేశంలో ప్రజాస్వామ్యంను పూర్తిగా నాశనం చేస్తోందని ఆవేదన చెందారు. తెలంగాణలో జరిగిన ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ తిరుగలేని విజయం నమోదు చేస్తోందనీ కంటోన్మెంట్,జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో గెలిచామని రేపు జరగబోయే ఖైరతాబాద్‌లో కూడా పట్టపదిలపరుచుకొంటామని ధీమా వ్యక్తంచేశారు.

## హైదరాబాద్‌లో సెమీకాన్‌కు తెలంగాణ ప్రతిపాదన

### ప్రపంచ సెమీకండక్టర్ పరిశ్రమతో తెలుగు రాష్ట్రాల అనుసంధానం

**హైదరాబాద్,సెప్టెంబరు19,ప్రబాతవార్త:** భారత దేశంలో సెమీకండక్టర్ పరిశ్రమ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ రంగంలో అపారమైన అవకాశాలు ఉన్నాయని టి-చిప్ చైర్మన్, వరల్డ్ తెలుగు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కౌన్సిల్ చైర్మన్ సందీప్ మక్తలా అన్నారు. సెమికాన్ ఇండియా-2026లో 52 దేశాలకు చెందిన 600కు పైగా సంస్థలు, సుమారు 50వేల సందర్శకులు పాల్గొంటుండటం భారత దేశంలో సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధి చెందుతున్న తీరుకు నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం సెమీకాన్ 2.0 కింద రూ.1,27,500 కోట్లను కేటాయించడంతో పాటు,ఇప్పటికే 12 సెమీకండక్టర్ ప్రాజెక్టులకు రూ.1.64లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు ఆమోదించడం ఈ రంగంలో ఉన్న అవకాశాల స్థాయిని తెలియజేస్తోందన్నారు. సెమికాన్ ఇండియా సందర్భంగా సెమీ ఇండియా అధ్యక్షుడు అశోక్ చందక్‌ను సందీప్ మక్తలా సత్కరించి, భారతదేశంలో సెమీకండక్టర్ పరిశ్రమ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా అశోక్ చందక్‌తో పాటు సెమీకాన్ నాయకత్వాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను సందర్శించాలని సందీప్ మక్తలా ఆహ్వానించారు.

## భూబండారం బయటపడటంతో నీటి రాజకీయాల డ్రామాలు

### కెసిఆర్, హరీశ్‌రావు అవినీతి దాహంతో వచ్చిన కరవు ఇది : ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** కల్వకుంట్ల కుటుంబం భూ బండారం బయటపడటంతో కెటిఆర్, హరీశ్ రావు డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారనీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆరోపించారు. మా సిఎం రేవంత్ రెడ్డి బయటపెట్టిన భూములపై సమాధానం చెప్పలేక నీళ్ల అంశాన్ని తీసుకువచ్చి రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారనీ దుయ్యబడుతున్నారు. ఎల్ నినో ప్రభావం ప్రపంచం అంతా ఉందనీ, ఈసారి ఎల్ నినో వల్ల కరువు వస్తుందని ముందుగానే ప్రభుత్వం స్పష్టం చేసిందనీ ఆయన గుర్తుచేశారు. వర్షాలు సరిగ్గా లేకపోవడంతో ప్రాజెక్టులు సరిగ్గా నిండలేదనీ ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రైతులకు ప్రభుత్వం సూచించిందనీ వివరించారు. ప్రస్తుతం ఉన్న పంటల కోసం సరిపడినంత విద్యుత్‌ను ఇవ్వడానికి ప్రభుత్వం శాయశక్తులా ప్రయత్నం చేస్తోందనీ తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి లేకపోయినా అవసరమైన విద్యుత్‌ను కొనుగోలు చేసి రైతులకు అందిస్తోందనీ చెప్పారు. కష్టకాలంలో రైతులకు ధైర్యం చెప్పాల్సింది పోయి, తమ రాజకీయాల కోసం ఆత్మస్థైర్యం దెబ్బతినేలా కెటిఆర్, హరీశ్‌రావు మాట్లాడుతున్నారనీ ఆవేదన చెందారు. రైతులను ఆందోళనకు గురిచేసి రాక్షసానందాన్ని పొందుతున్నారనీ దుయ్యబట్టారు. కాంగ్రెస్ కరువు తీసుకువచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహితపై బ్యారేజి కడితే నీటి కొరత ఏర్పడకపోయేదని నాసిరకంగా కట్టి కాళేశ్వరాన్ని కూలేశ్వరం చేసిన కెసిఆర్ కరువు తెచ్చాడని ఆయన అభిప్రాపడ్డారు. లక్ష కోట్లతో కాళేశ్వరం నిర్మించకుండా తుమ్మిడిహట్టి నిర్మిస్తే ఈ రోజు కరువు వచ్చేది కాదనీ అన్నారుజ. ముమ్మాటికీ కెసిఆర్, హరీశ్ రావు అక్రమాలు అవినీతి దాహంవల్ల వచ్చిన కరువు ఇది అని అన్నారు. రైతులు కల్వకుంట్ల కుటుంబం తెచ్చిన కరువుపై ఆలోచించాలి. రైతులను రెచ్చగొట్టి రాజకీయంగా బతకాలన్న ప్రయత్నాలు ఆపాలి. కష్టకాలంలో రైతులకు ప్రతి ఒక్కరూ అండగా నిలిచి, వారిలో మనోధైర్యం నింపాలనీ కోరారు.

## ఖరీఫ్ ధాన్యం నిల్వ, హమాలీ, రవాణా వ్యూహం

### ధాన్యం దిగుబడి అంచనా 65 లక్షల మెట్రిక్ టన్నులు

### జిపిఎస్ ట్రాకింగ్ వాహనాలను వినియోగించాలి

### పౌర సరఫరాల కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్ ధాన్యం అక్టోబర్ మొదటి వారం విక్రయానికి వచ్చే అవకాశం ఉండటంతో రైతులు ఇబ్బంది పడకుండా ప్రభుత్వం కొత్తగా స్టోరేజ్, హమాలీ, ట్రాన్స్‌పోర్ట్ అనే విధానాన్ని కఠినంగా అమలు చేస్తోందనీ సివిల్ సప్లయ్ కమీషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర ప్రకటించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వేగంగా తరలించడం వల్ల అక్రమాలకు తావు వుందని, రైతులు రవాణా ఇబ్బందులు పడకుండా చూడటానికి ఈ విధానం బాగా ఉపయోగపడుతుందనీ ఆయన తెలిపారు. సివిల్ సప్లైస్ కమిషనర్, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం.స్టీఫెన్ రవీంద్ర శనివారం ప్రధాన కార్యాలయంలో జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించారు. 2026-2027 ఖరీఫ్ సీజన్ కోసం తెలంగాణ పౌర సరఫరాల శాఖ సిద్ధమైందనీ ఈసారి సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతోందని అంచనా వేస్తున్నామని తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల వారీగా అందుబాటులో ఉన్న గోదాముల నిల్వ సామర్థ్యం సమీక్ష చేశారు. తెలంగాణ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, ఎండి కొర్ర లక్ష్మీ, శ్యాం ప్రసాద్‌లాల్, సమావేశంలో పాల్గొని గోదాముల నిర్వహణ, రవాణా ఏర్పాట్ల గురించి చర్చించారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు,సివిల్‌సప్లయ్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్లు క్షేత్రస్థాయిలో ఉన్న తాజా పరిస్థి తులను, ఇబ్బందులను వివరించి, వాటిని వెంటనే పరిష్కరించే మార్గాలను కూడా తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం నిల్వ చేయడానికి అదనంగా కొత్త గోదాములను గుర్తించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా దృష్టి పెట్టారు. స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ స్టోరేజి హమాలి ట్రాన్స్‌పోర్టు విధానం విజయవంతం కావాలంటే సాధారణ గోదాములతో పాటు, మూతపడిన రైస్ మిల్లులు, ఇండస్ట్రియల్ షెడ్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలు, పెద్దపెద్ద ఫంక్షన్ హాళ్లను కూడా ధాన్యం నిల్వ చేయడానికి ఉపయోగించుకోవాలని సూచించారు. దిగుబడి అయ్యే 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో చివరి గింజకూడా చెడిపోకుండా భద్రపరచడానికి అధికారులు ముందుగానే ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. టిజిఎస్‌డబ్ల్యుసి గిడ్డం గులు మరమ్మతులు ఏమైనా వుంటే వాటిని వెంటనే చేసుకోవాలని త్వరలో దిగుబడి కాబో తున్న భారీ ధాన్యాన్ని నిల్వ చేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు. తాత్కాలిక పద్దతిలో కవర్,ప్లింత్ నిల్వ విధానంలో ధాన్యాన్ని భద్రపరిచే ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం దించడానికి, సర్ద డానికి హమాలీ కార్మికుల కొరత లేకుండా చూసు కోవాలని అవసరమైతే ఎక్కువ మందిని వినియోగించాలని చెప్పారు. ఇందు కోసం ఇతర శాఖలతో కలిసి సమన్వయం తో పని చేస్తున్నారు. అక్రమాలను అడ్డుకునే విష యంలో కమిషనర్ కఠినంగా వ్యవహరిస్తామని రవాణా రంగంలో టెక్నాలజీని వాడుకోవాలని ఆదేశించారు. ధాన్యం తరలించే ప్రతి వాహనానికి తప్పని సరిగా జిపిఎస్ ట్రాకింగ్ సిస్టమ్ ఉండాల్సిందే అని తెలిపారు.. ఈ నిర్ణయం వల్ల ధాన్యం తరలిం పులో పూర్తి పారదర్శకత వస్తుంది, దారి మళ్లించే అవకాశం ఇక ఉండదనీ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా, క్షేత్రస్థాయిలో జవాబుదారీతనం పెంచడానికి కొత్తగా ఒక ఫిజికల్ వెరిఫికేషన్ మొబైల్ యాప్‌ను తీసుకువచ్చామని చెప్పారు. డివిజన్, జిల్లా స్థాయి అధికారులు ఈ యాప్ ద్వారా మిల్లుల్లో అకస్మాత్తుగా తనిఖీలు చేస్తారనీ అన్నారు. కొనుగోలు కేంద్రాల ఇన్‌ఛార్జ్‌లు ఎవరైనా నకిలీ రశీదులు సృష్టిస్తే, వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. అకాల వర్షాల నుంచి రైతుల కష్టాన్ని కాపాడేందుకు, అక్టోబర్‌లో కొనుగోళ్లు ప్రారంభ మయ్యే నాటికే ప్రతి కొనుగోలు కేంద్రాన్ని అన్ని వసతులతో సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతుల కష్టం వృథా కాకుండా చూసేందుకు, ఈ కేంద్రాల్లో తేమను కొలిచే యంత్రాలు, క్లీనర్లు, డ్రయ్యర్లను అందుబాటులో ఉంచు తున్నారు. దీనివల్ల అన్ని స్టోరేజ్ పాయింట్ల వద్ద ధాన్యం నాణ్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు..



సివిల్ సప్లయ్ జిల్లా అధికారులతో సమావేశమైన కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, గిడ్డంగుల ఎండి కోర లక్ష్మి, పౌర సరఫరాల కార్పొరేషన్ ఎండి శ్యాంప్రసాద్‌లాల్



ఢిల్లీలో తెలంగాణనుభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన మహాగణపతి పూజలో పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్

# దేశంలో తెలంగాణ నంబర్1గా నిలుపు వినాయకా

## ఢిల్లీలో తెలంగాణభవన్‌లో గణపతి పూజ చేసిన మహేశ్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, సెప్టెంబరు 19,ప్రభాతవార్త:** దేశంలోనే తెలంగాణను నంబర్1 నిలుపు వినాయకా అంటూ పూజలు చేశానని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ తెలిపారు. ఢిల్లీలో తెలంగాణను భవన్‌లో ఏర్పాటు చేసిన మహాగణపతి పూజ కార్యక్రమంలో శనివారం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ పాల్గొని భక్తి, శ్రద్ధలతో ఘనంగా మహాగణపతి ఆరాధన చేశారు. తెలంగాణ అగ్రగామిగా నిలవాలని, పాడి పంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో ప్రజాపాలన దిశగా ముందుకు వెళ్తున్నామని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్ గా ఉండాలని భగవంతుని ప్రార్థించాను. తెలంగాణలో వేములవాడ,కొండగట్టు వంటి అనేక ఆలయాలను పెద్ద ఎత్తున అభివృద్ధి పరస్తున్నామని ప్రజల మనోభావాలకు అనుగుణంగా సాంస్కృతిక ఆధ్యాత్మిక కార్యాక్రమాలను ఎంతో భక్తి శ్రద్దలతో ఏలాంటి లోటు లేకుండా చేస్తున్నామని తెలిపారు.






# 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు

## 20వ రోజ్‌గార్ మేళాలో ప్రధాని మోడీ సందేశం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** దేశవ్యాప్తంగా శనివారం నిర్వహించిన 20 'రోజ్‌గార్ మేళా'లో 51వేల మందికిపైగా యువతకు కేంద్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వర్చువల్‌గా ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోడీ, 2047 నాటికి భారత్‌ను 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారత్)గా మార్చే ప్రయాణంలో యువతదే అత్యంత కీలక పాత్ర అని స్పష్టం చేశారు. దేశంలో పండుగల సీజన్ ప్రారంభమైన వేళ, వేలాది కుటుంబాల్లో ఈ ఉద్యోగాలు కొత్త ఆనందాన్ని నింపాయని ప్రధాని అన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌ను నిర్మించాలనే లక్ష్యంతో దేశం ముందుకు సాగుతున్న తరుణంలో యువత ప్రభుత్వంలో చేరుతున్నారని, వీరు తీసుకునే ప్రతి నిర్ణయం 'వికసిత్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' ఆశయాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. భారతీయ యువత నైపుణ్యాలపై ప్రపంచానికి ఎంతో నమ్మకం ఉందని ప్రధాని పేర్కొన్నారు. గత కొన్నేళ్లుగా దాదాపు 40 దేశాలతో కుదుర్చుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు యువతకు నూతన ఉద్యోగ, వ్యాపార అవకాశాలను తెచ్చాయని చెప్పారు. రూ. 60,000 కోట్ల వ్యయంతో 'పిఎం సేతు' పథకం ద్వారా 1,000 ప్రభుత్వ ఐటిఐలను పరిశ్రమల భాగస్వామ్యంతో ఆధునీకరిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ నెట్‌వర్క్ భారత్‌లో ఉందన్న ప్రధాని, గుర్తింపు పొందిన స్టార్టప్‌లలో సగానికి పైగా టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయని, చిన్న నగరాల యువత ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్నారని ప్రశంసించారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పనకు రూ. 1 లక్ష కోట్లతో ఈ పథకాన్ని ప్రారంభించామని, దీని ద్వారా తొలిసారి ఉద్యోగంలో చేరే దాదాపు 2 కోట్ల మంది యువతకు రూ. 15,000 వరకు ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుందని తెలిపారు.దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో ఈ 20వ రోజ్‌గార్ మేళాను నిర్వహించారు. రైల్వే, హోం శాఖ, రక్షణ, రెవెన్యూ, ఆరోగ్య, ఆర్థిక సేవల శాఖల్లో ఎంపికైన అభ్యర్థులకు ఈ నియామకపత్రాలను అందించారు. ఇప్పటివరకు నిర్వహించిన రోజ్‌గార్ మేళాల ద్వారా మొత్తం దాదాపు 12.75 లక్షల మంది యువతకు కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగ అవకాశాలు లభించాయి.

# గరుడునిపై తిరుమలేశుడు

## అశేష భక్తజనం వీక్షిస్తుండగా గరుడునిపై ఊరేగిన గోవిందుడు

## భక్తులకు భారీ భద్రతా ఏర్పాట్లు

**తిరుమల,సెప్టెంబరు19, ప్రభాతవార్తప్రతినిధి:** పెరటాసి మాసం తొలిశనివారం సాయంత్రం తిరుమలలో ఏడుకొండలస్వామి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో గరుడవాహనసేవ అత్యంత వైభవంగా జరిగింది. శ్రీవారి ఉత్సవమూర్తి మలయప్పస్వామి తనకిష్టమైన గరుడుని వాహనంగా చేసుకుని దివ్యమైన మంగళరూపంలో చల్లటి వాతావర ణంలో శనివారం రాత్రి భక్తులను కటాక్షించాడు. ఐదవరోజు రాత్రి జగన్నాటకసూత్రధారి మలయప్పస్వామి గరుడునిపై విహరించారు. సాయంత్రం 6.30గంటలకు వాహనమండపంవద్ద గరుడవాహనాన్ని అధిరోహింపజేసిన మలయప్పకు అర్చకులు వేదఘోష్టితో కర్పూరహారతు లిచ్చారు. చల్లటివాతావరణంలో వింజామరలు చల్లగా విసురుతుండగా భక్తుల గోవిందనామ్మరణల మధ్య భక్తకోటిని కరుణించడానికి ఆలయమాఢ వీధుల్లో ఊరేగారు. గరుడవాహనంద్వారా స్వామి దాసానుదాస ప్రపత్తికి దాసుడని స్వామి తెలియజేశారు. జ్ఞానవైరాగ్య ప్రాప్తికోరే మానవులు జ్ఞానవైరాగ్య రూపాలైన రెక్కలతో విహరించే భగవదధిష్టుతుడైన గరుడుని దర్శిస్తే సర్వపాపాలు తొలగుతాయని భక్తకోటికి తెలియజేశాడు. అర్ధరాత్రి 12.30గంటల వరకు మాఢవీధుల్లో వేచివున్న భక్తులందరికీ గరుడవాహన సేవ దర్శనం చేయించడంలో టిటిడి బోర్డు, అధికారులు సఫలీకృతుల య్యారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర,బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, శాంతారాం, భానుప్రకాశ్‌రెడ్డి, టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి,తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, టిటిడి సివిఎస్ఒ మురళీకృష్ణ,ఎస్వీబిసి ఛైర్మన్ శ్రీధర్ వర్మ,ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి,టిటిడి మాజీ ఛైర్మన్ కనుమూరి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.





శనివారం సాయంత్రం తిరుమలలో కన్నుల పండుగగా సాగిన తిరుమలేశుని గరుడసేవ దృశ్యం

# విద్యార్థులకు మరింత ఆకర్షణీయ రంగుల్లో యూనిఫాం

## వచ్చే యేడాదికి ఇప్పటి నుంచే ప్రణాళిక: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** విద్యార్థులకు అందించే యూనిఫాం మరింత ఆకర్షణీయమైన రంగుల్లో ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. డిజైన్లలో వైవిధ్యానికి ప్రయత్నించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

విద్యార్థులకు అందించే యూనిఫాం, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శనివారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్ పిల్లలకు ఒక జత యూనిఫాం పంపిణీ పూర్తయిందని, రెండో జత యూనిఫాంను నెలాఖరులోగా అందజేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు తెలియజేశారు. కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులందరికీ నోటు పుస్తకాలు పంపిణీ పూర్తయిందన్నారు.

ప్రభుత్వ వసతిగృహాలు, రెసిడెన్షియల్స్ స్కూల్స్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలోని విద్యార్థులందరికీ ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, స్పూన్లు, కప్పులు, కార్పెట్లు, బెడ్ షీట్లు, టవళ్ల పంపిణీ పూర్తయిందని సీఎంకు అధికారులు వివరించారు. వచ్చే ఏడాది పాఠశాలలు తెరిచిన రోజే యూనిఫాం, ఇతర సామగ్రి విద్యార్థులకు అందేలా ఇప్పటి నుంచే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ప్రస్తుతం ఉన్న విద్యార్థులకు అదనంగా 10 శాతం విద్యార్థులు పాఠశాలల్లో చేరే అవకాశం ఉన్నందున, అందుకు తగినట్లు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ ఏడాది అందించిన యూనిఫాం, ఇతర సామగ్రి నాణ్యతపై తల్లిదండ్రుల నుంచి సంతృప్తి వ్యక్తమైందని సీఎం అన్నారు.

సమీక్షలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు సబ్యసాచి ఘోష్, బాల మాయాదేవి, అహ్మద్ నదీమ్, దివ్య దేవరాజన్, నవీన్ నికోలస్, శ్రుతి ఓజా, సైదులు, సంతోష్ ,సీతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి తెచ్చినది కాదు, కాంగ్రెస్ చేతకానితనంతో వచ్చిన కరవు

## అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు ఆడిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి: హరీశ్‌రావు

**హైదరాబాద్,సెప్టెంబరు19,ప్రబాతవార్త:** శాసనసభలో రాష్ట్రంలో నెలకొన్న సాగునీటి, విద్యుత్ కష్టాలపై కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పినవన్నీ పచ్చి అబద్ధాలేనని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రకృతి వైపరీత్యం ఎల్‌నినో వల్లే కరువు వచ్చిందని ప్రభుత్వం చేతులెత్తేయడాన్ని ఆయన తప్పుబట్టారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఆధారాలతో సహా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. 'రాష్ట్ర సాధనలో కేసీఆర్‌తో కలిసి పోరాడిన ఉద్యమకారుడిగా, 24 ఏళ్లుగా అసెంబ్లీలో ఉన్న సీనియర్ సభ్యుడిగా, రైతు బిడ్డగా నాకిది రాజకీయం కాదు.. బాధ్యత. ప్రజల ఇబ్బందుల మీద బాధ్యతతో మాట్లాడుతున్నా, అసెంబ్లీలో జరిగిన చర్చ చూస్తే ఒక్కటే అర్థమైంది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ పార్టీ తెచ్చిన కరువు.. రేవంత్ రెడ్డి తెచ్చిన కరువు' అని వ్యాఖ్యానించారు. నీళ్లు, కరెంటు రెండు విషయాల్లోనూ తమ తప్పిదాలను ప్రకృతి ఎల్‌నినో పైన నెట్టి చేతులెత్తేయడం బాధ్యతారాహిత్యం అని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి ఈ ఏడాది తెలంగాణ 84 టీఎంసీలు వాడుకుందని మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి అసెంబ్లీలో పచ్చి అబద్ధాలు ఆడారు.

# దానం నాగేందర్ అనర్హత తీర్పు రాజ్యాంగ విజయం

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** దానం నాగేందర్ అనర్హత తీర్పు రాజ్యాంగ విజయం అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఫిరాయింపుల రాజకీయాలకు పాల్పడుతున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల బండారం బట్ట బయలు అయిందన్నారు. బరితెగించి చట్టాన్ని ఉల్లంఘించడం, పార్లమెంటు ఆమోదించిన చట్టాలను గౌరవించకపోవడం, తమ రాజకీయ అవసరాల కోసం వాటిని పూర్తిగా దుర్వినియోగం చేయడం ఇప్పటికైనా మానాలని హితవు పలికారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో న్యాయ స్థానం వెలువరించిన తీర్పు పట్ల యావత్ తెలంగాణ సమాజం, ప్రజలు అంతటా హర్షం వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా, ప్రజాభిప్రాయాన్ని పక్కనపెట్టి నాయకులను పార్టీలు మార్పించడం గత అనేక సంవత్సరాలుగా పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ తరఫున వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ఇదేవిధంగా ఫిరాయింపులను ప్రోత్సహించారని, ఆ తర్వాత బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక కెసిఆర్ కూడా అదే పద్ధతిలో చట్టాలను ఉల్లంఘించి కొనసాగారని గుర్తుచేశారు. నాడు కాంగ్రెస్ నుంచి గెలిచిన సబితా ఇంద్రారెడ్డిని కనీసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించకుండానే బిఆర్ఎస్‌లో చేర్చుకుని మంత్రి పదవి ఇచ్చారని, ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కూడా అదే అడుగుజాడల్లో నడుస్తోం దని విమర్శించారు. బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నికై, చట్టానికి విరుద్ధంగా పార్టీ మారిన దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌ను స్పీకర్ కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ భారతీయ జనతా పార్టీ తరఫున రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించామని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని, పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని ఉల్లంఘించడమేనని న్యాయస్థానం గుర్తించిందని తెలిపారు. స్పీకర్ నిర్ణయాన్ని పక్కనపెట్టిన హైకోర్టు దానం నాగేందర్ ఏ రోజైతే లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ వేశారో, ఆ రోజు నుంచే శాసనసభ్యుడిగా కొనసాగడానికి వీలు లేదని స్పష్టం చేస్తూ ఆయన సభ్యత్వాన్ని రద్దు చేయడం అత్యంత సమంజసమైన, న్యాయమైన తీర్పు అని కొనియాడారు. ఢిల్లీ వేదికగా రాజ్యాంగ పుస్తకం పట్టుకుని సంవిధాన్ బచావో అని తిరిగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీరు పచ్చి బూటకమని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అసెంబ్లీ రికార్డుల ప్రకారం దానం నాగేందర్ ఇంకా బిఆర్ఎస్ ఎమ్మెల్యేగానే ఉన్నారని తెలిసినప్పటికీ, కాంగ్రెస్ హైకమాండ్ ఆయనకు ఏ ప్రాతిపదికన ఎంపి టికెట్ ఇచ్చిందో రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హైకోర్టు తీర్పు పట్ల రాహుల్ గాంధీ స్పందన ఏమిటో తెలియ జేయాలన్నారు.

# బిటెక్ విద్యార్థిని ఆత్మహత్య

## భర్త కానిస్టేబుల్ రిమాండ్

## వివాహమైన 20 రోజులకే మరణం



విద్యార్థిని పల్లవి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** భర్త వేధింపులు తాళలేక విద్యార్థిని కళాశాల భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం కాటేపల్లి గ్రామానికి చెందిన పల్లవి (20) ఘణాపూర్‌లోని కళాశాలలో బీటెక్ (సీఎస్ఈ) 3వ సంవత్సరం చదువుతున్నది. ఆగస్టు 30న పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. భర్త బోడుప్పల్‌లో ఉంటూ చైతన్యపురి పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిసున్నారు. కాగా పెళ్లయిన కొద్దిరోజులకే భర్త ఆమెను అదనపు కట్నం తేవాలని శారీరకంగా, మానసికంగా తీవ్రవేధింపులకు గురిచేశాడు. దీంతో పల్లవి తన పుట్టింటికి కాలేపల్లికి వెళ్లడంతో గత కొన్నిరోజులుగా కళాశాలకు రాలేదని, ఈనెల 17న వచ్చిందని తెలిపారు. భర్త వేధింపుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురైన పల్లవి ఈ నెల 18న ఉదయం కళాశాలకు వచ్చి తీవ్ర మానసికఒత్తిడిలో ఉంది. సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత విద్యార్థులందరూ వెళ్లిపోగా, 4:30 గంటల సమయంలో డి బ్లాక్ 3వ అంతస్తు నుండి ఆమె కిందకు దూకింది. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోస్టుమార్టమ్ అనంతరం కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించి పల్లవి భర్త శ్రీకాంత్‌రెడ్డిని అరెస్ట్‌చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# ఎరువుల వినియోగంలో అసమతుల్యత



శనివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## నకిలీ ఎరువుల నియంత్రణకు చర్యలు

## ప్రకృతి వ్యవసాయంతో మార్కెట్లకు అనుసంధానం

## వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యేటా పెరుగుతున్న రసాయన ఎరువుల వాడకం, పంట మార్పిడి లేకపోవడం, ఎరువుల వినియోగంలో తీవ్ర అసమతుల్యతపై దృష్టి సారించాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ వ్యవసాయ శాఖలోని వివిధ విభా గాల్లో గుర్తించిన లోటు పాట్లను తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ ఉండాలని, లక్ష్యాలకు వాస్తవ పురోగతికి మధ్య అంతరం ఉన్న ప్రతి అంశంలోనూ కాలబద్ధ ప్రణాళికతో వ్యవహరించాలన్నారు.

యూరియా వినియోగం హెక్టారుకు 217 కిలోలుగా ఉండి జాతీయ సగటు 160 కిలోల కంటే గణనీయంగా ఎక్కువగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఎరువులు, పురుగుమందుల నాణ్యత నియంత్రణ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నకిలీ, నాసిరకం ఉత్పత్తుల నమూనాల సేకరణ నుంచి కోర్టు కేసు వరకు మొత్తం ప్రక్రియను డిజిటల్ పద్ధతిలో ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు.

పప్పుధాన్యాల సాగు విస్తీర్ణంలో రాష్ట్రం లక్ష్యానికి మించి 127 శాతం మేర సాధించిందన్నారు. అయితే ధృవీకరించిన విత్తన ఉత్పత్తిలో కేవలం 47 శాతం, పంపిణీలో 34 శాతం మాత్రమే సాధించడం సరికాదని, దీనిపై తగు చర్యలు తీసుకోవలసిందిగా పేర్కొన్నారు. రాబోయే రబీ సాగుకు అవసరమైన విత్తనాలను ముందుగానే సిద్ధం చేయాల్సిందిగా తెలిపారు. కేంద్ర నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని వెల్లడించారు. ప్రకృతి వ్యవసాయాన్ని మార్కెట్లకు అనుసంధానం చేయాల చెప్పారు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వ్యవసాయ పథకాలపై రైతులలో అవగాహన ఇంకా పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి కె సురేంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ నెయ్యి కేసు

# సుకృతి ఫుడ్స్ ప్రమోటర్ కైలాస్‌చంద్ అరెస్టు

## దర్యాప్తు ముమ్మరం చేసిన ఇడి

**తిరుపతి, సెప్టెంబరు 19 ప్రభాతవార్త ప్రతినిధి:** 2020-24మధ్య తిరుమలకు లడ్డూల తయారీకి సరఫరా జరిగిన ఆవునెయ్యి కల్తీజరిగిందని, ఈ వ్యవహారంలో కీలకంగా దర్యాప్తు చేపట్టిన సిబిఐ సిట్ అధికా రులు మరింత లోతైన విచారణకు ఇడికి అప్పగించిన విషయం విదితమే. ఇప్పటికే ఈకేసులో ప్రధాన సూత్రధారులు,పాత్రదారులను తేల్చి అరెస్ట్ చేసిన సిబిఐ ఆ తరువాత మరింత కీలకంగా దర్యాప్తులో ఇడికి అప్పగించింది. ఇప్పుడు ఇడి రెండునెలల క్రిందట నలుగురు ప్రధాన సూత్రదారుల ఆస్తులపై సోదాలు చేసి భారీగా రికార్డులు, నగదు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఇదే కేసులో తాజాగా మళ్లీ సుకృతిఫుడ్స్ ప్రమోటర్ కైలాష్‌చంద్ మంగ్లాను ఇడి అరెస్ట్ చేయడం సంచలనంగా మారింది. 230 కోట్ల రూపాయలు మేర కల్తీ నెయ్యి సరఫరా చేసినట్టు గుర్తించింది. ప్రధానంగా పామాయిల్, రసాయనాలతో నెయ్యి తయారు చేసి మోసం చేసినట్టు ఆరోపణలపై మంగ్లా అరెస్ట్‌తో కీలక పరిణామం దిశగా వెళ్లింది. ఇదే కేసులో ప్రధాన నిందితుడు విపిన్ జైన్ అరెస్ట్ అయిన సందర్భం ఉంది. టిటిడికి నెయ్యి కల్తీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి)దర్యాప్తును వేగవంతం చేసింది.

# 'ఉడాన్' ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు



శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు సమక్షంలో అవగాహన ఒప్పందం జరిగిన దృశ్యం

## టాస్క్ (టిఎస్‌కె) - డెల్ టెక్నాలజీస్ ఒప్పందం

## 5,500 మంది విద్యార్థులకు శిక్షణ, 25 శిక్షణా కేంద్రాలు

## మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో అవగాహన ఒప్పందం

**హైదరాబాద్,సెప్టెంబరు19,ప్రభాతవార్త:** తెలంగాణ యువతను నూతన సాంకేతిక రంగాల్లో తీర్చిదిద్ది, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్, ప్రముఖ దిగ్గజ సంస్థ ఖిడెల్ టెక్నాలజీస్‌ఖి చేతులు కలిపాయి. ఇందులో భాగంగా రాష్ట్రంలో 'ఉడాన్' కార్యక్రమాన్ని అమలు చేయడానికి ఇరు వర్గాలు ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకున్నాయి. శనివారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు నాయకత్వంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఈ అవగాహన ఒప్పందం ఖరారైంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ రంగానికి చెందిన ఉన్నతాధికారులు, టాస్క్ ప్రతినిధులు, డెల్ టెక్నాలజీస్ బాధ్యులు మరియు భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా 5,500 మంది విద్యార్థులకు శిక్షణ ఉడాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసే 25 శిక్షణా కేంద్రాల ద్వారా 5,500 మంది విద్యార్థులకు 3 నెలల పాటు ప్రత్యేకానుభవంతో కూడిన శిక్షణ ఇవ్వనున్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), క్లౌడ్ కంప్యూటింగ్, ఎలక్ట్రానిక్స్ మాన్యుఫ్యాక్చరింగ్, నూతన సాంకేతికతలు, డిజిటల్ నైపుణ్యాలతో పాటు పారిశ్రామిక అవగాహన, ఉద్యోగార్హత ప్రతిభ పెంచేలా ఈ శిక్షణ సాగనుంది. గ్రామీణ ప్రాంతాలకు చెందిన యువతకు సైతం నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి, వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా సమగ్రమైన ఒక సత్ఫలితాన్ని సాధించడమే ఉడాన్ ముఖ్య ఉద్దేశం: విద్య, నైపుణ్య శిక్షణ, పారిశ్రామిక అవగాహన ఉపాధి / అప్రెంటిస్‌షిప్ / పారిశ్రామికవేత్తగా రాణించడండిగ్రీలు పూర్తయ్యే వరకు వేచి చూడకుండా, చదువుకుంటున్న సమయంలోనే పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు నైపుణ్యాలు పెంపొందించడం ద్వారా యువతకు ఉద్యోగాలు, అప్రెంటిస్‌షిప్‌లు లేదా స్వయం ఉపాధి దిశగా మార్గం సుగమం చేయడం ఈ ఉడాన్ ప్రధాన లక్ష్యం. ఐఐటీ ఢిల్లీ కరికులమ్, డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారం ఐఐటీ ఢిల్లీ రూపొందించిన పాఠ్యాంశాల (కరికులం) ఆధారంగా, డెల్ టెక్నాలజీస్ సాంకేతిక సహకారంతో ఈ శిక్షణ సాగుతుంది.

జాతీయ స్థాయిలో డెల్ టెక్నాలజీస్, ఎఫ్ఐటిటి-ఐఐటీ ఢిల్లీ, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్, జనరేషన్ ఇండియా ఫౌండేషన్‌లు కలిసి ఉడాన్ ద్వారా యువతకు భవిష్యత్ సాంకేతిక నైపుణ్యాలను అందిస్తున్నాయి. మారుతున్న పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువత సరికొత్త టెక్నాలజీలపై పట్టు సాధించేందుకు అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తోంది.

కేవలం శిక్షణ సంఖ్యకే పరిమితం కాకుండా, యువతకు స్పష్టమైన ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సమర్థవంతమైన స్కిల్లింగ్ వ్యవస్థను నిర్మించాలనే టాస్క్ లక్ష్యానికి ఈ భాగస్వామ్యం మరింత బలాన్ని చేకూరుస్తోంది.

ఈ సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, స్టేట్ కౌన్సిల్ సెక్రటరీ రామ్, టాస్క్ సీఈఓ నితిన్ కుమార్ రెడ్డి, సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, లెర్నింగ్ లింక్స్ ఫౌండేషన్ సీఓఓ నిఖిల్, డెల్ టెక్నాలజీస్ గవర్నమెంట్ సీనియర్ అకౌంట్ మేనేజర్ కె. కృష్ణ కిషోర్, డెల్ టెక్నాలజీస్ ఏపీజేసీ రీజినల్ సీఐఓ హైదరాబాద్ సైట్ డైరెక్టర్ రమేష్ జంపుల తదితరులు పాల్గొన్నారు.

"నైపుణ్యాల నుంచి అవకాశాల వైపు, రేపటి సాంకేతిక ప్రపంచానికి, ఉపాధి సవాళ్లకు తెలంగాణ యువతను సంపూర్ణంగా సిద్ధం చేయడమే టాస్క్‌డెల్ ఉడాన్ ముఖ్య ఉద్దేశం అని పేర్కొన్నారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
VISAKHAPATNAM

Short Tender Notice No.51/2026-27/SE (W-East)/EE-East / DB/GVMC/ Dt:17-09-2026

| | | |
|---|---|---|
| 01. No.of Works | : | 1 No |
| 02. Value of works (ECV) | : | Rs.53.91 Lakhs |
| 03. Downloading Starting Date | : | 17-09-2026 @ 11.00 PM |
| 04. Downloading End Date | : | 25-09-2026 @ 02.00 PM |
| 05. Last date for Submission of bid | : | 25-09-2026 @ 03.00 PM |

Further details at http://www.apeprocurement.gov.in
O/o The Executive Engineer (PW-III) Division

Sd/- Commissioner, GVMC

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద ఒక క్రొత్త రాజకీయ పార్టీగా రిజిస్ట్రేషన్ కావడానికి జారీచేయబడిన నోటీసు

(తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 20.09.2026

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2018 యొక్క నిబంధనలకు లోబడి ప్రజాసేవ పార్టీ అధ్యక్షులు శ్రీ తల్లారం నర్సింలు గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానీకానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. ఈ పార్టీలో (1) శ్రీ తల్లారం నర్సింలు గారు అధ్యక్షులు, (2) శ్రీ బింగి రాములు గారు ప్రధాన కార్యదర్శి, (3) శ్రీ బోజన సాయిరాం గారు కోశాధికారి ప్రధాన కార్యవర్గ సభ్యులు; మరియు పార్టీ యొక్క ప్రధాన కార్యాలయము ప్రజాసేవ పార్టీ ఇం.నం. 8-1-297/SN/157, షేక్‌పేట్ సరాయి నక్కుబాయి నగర్, మణికొండ రోడ్, షేక్‌పేట్, హైదరాబాద్-500008, తెలంగాణ రాష్ట్రం. సదరు పార్టీ రిజిస్ట్రేషనుపై ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘము, మొదటి అంతస్తు, DTCP భవనము, A.C. గార్డ్స్, హైదరాబాద్-500 004 గారికి ఈ ప్రకటన ప్రచురితమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు రానియెడల, తెలంగాణ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు ప్రజాసేవ పార్టీను ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

శ్రీ తల్లారం నర్సింలు, అధ్యక్షులు,
ప్రజాసేవ పార్టీ.

# పశువులు, సెల్‌ఫోన్‌లు దొంగిలించే నేరగాళ్ల ముఠా అరెస్టు

## స్థానిక సంతల్లో పశువుల విక్రయాలు, బంగ్లాదేశ్ సహా పలు దేశాలకు సెల్‌ఫోన్‌ల అమ్మకాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 19, ప్రభాతవార్త:** తెలంగాణలో పలుచోట్ల పశువులను, దక్షిణాది రాష్ట్రాలతో పాటు మధ్యప్రదేశ్‌లో సెల్‌ఫోన్‌ల దుకా ణాలను లూటీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను సిటీ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఖమ్మం పోలీసులు సంయుక్తంగా దాడిచేసి అరెస్టు చేశా రు. ఈ సందర్భంగా వీరి వద్ద నుంచి 15 సెల్ ఫోన్లతో పాటు దొంగ సొత్తును అమ్మడం ద్వారా సంపాదించిన 22 లక్షల రూపాయల నగదు ను జప్తు చేశారు. ఈ ముఠాలో నిందితుడుగా బంగ్లాదేశ్‌కు చెందిన వాడు ఒకడున్నాడు. దీనికి సంబంధించిన వివరాలను సిటీ కొత్వాల్ సజ్జన ర్ శనివారం మీడియాకు వెల్లడించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో వరుసగా పశువుల దొంగతనాలు జరగడం, సెల్‌ఫోన్ల దుకాణాల్లో చో రీలు జరగడంతో దీనిపై నిఘా వుంచిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిఘా వుంచగా శుక్రవారం తొమ్మిది మంది సభ్యుల ముఠా పట్టుబడింది. ఇం దులో కొందరు పశువులను దొంగిలించే నేరగాళ్లు కాగా మరికొందరు సెల్‌ఫోన్లు వున్న దుకాణాలను లూటీ చేసేవారు. రెండు గ్రూపులు ఒకరికి మరొకరు సహకరించుకుంటారు. పశువులు దొంగిలించే వారిలో గోల్కొండలోని మోతిదర్వాజకు చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ తబ్రేజ్ (40), గోల్కొండకు చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ రఫీక్ (54), పాతబస్తీలోని మొగల్‌పురాకు చెందిన గుర్రపు స్వారీ చేసే మహమ్మద్ జుబేర్ (30) , కిషన్‌బాగ్‌కు చెందిన కసాయి మహమ్మద్ నవీద్ (24), మేడ్చల్‌కు చెందిన సాయి రెడ్డి (35) (ఇతను పశువులను దొంగిలించే ముందు వాటికి మత్తు ఇంజక్షన్లు ఇస్తుంటాడు) వున్నారు.

ఈ ఐదుగురు రాష్ట్రంలోని పలుచోట్ల రంజాన్, బక్రీద్ పండగల సమయంలో శివార్లలో పశువులను క ట్టేసి వుంచే పాకల్లో దొంగచాటుగా దూరేవారు. అనంతరం చిన్నపాటి పశువులకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చి అవి కదలలేని స్థితిలో వున్న సమయ ంలో బొలెరో వాహనంలో వాటిని ఎక్కించుకుని ఉడాయించే వారు. దీని తరువాత వీటిని మరో సంతలో తక్కువ ధరకు అమ్మి సొమ్ము చేసు కునేవారు. వీరు 13 చోట్ల పశువులను చోరీ చేసినట్లు తేలింది. వీరిపై గతంలోనూ పశువుల దొంగతనాలకు సంబంధించిన కేసులున్నాయి.

# హిందీ వివాదంపై మళ్లీ 'తమిళ' రగడ

## రెండు భాషల విధానంలో మార్పులేదన్న రాష్ట్ర ప్రభుత్వం

## విజయ్ ప్రభుత్వ నిర్ణయానికి మద్దతిచ్చిన డిఎంకె



**చెన్నై,సెప్టెంబరు 19:** కేంద్రంతో తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం వివాదం మరింత ముదిరింది తమిళనాడులో హిందీ భాష, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు అంశం మరోసారి చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రం అనుసరిస్తున్న రెండు భాషల విధానాన్ని మార్చే ప్రసక్తే లేదని తమిళనాడు ప్రభుత్వం స్పష్టం చేసింది. నవోదయ పాఠశాలల కోసం భూమిని కేటాయించేందుకు కూడా రాష్ట్రం నిరాకరిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రంరాష్ట్రం మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఈనెల 17న నవోదయ పాఠశాలల కేసు విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తమిళనాడు ప్రభుత్వ వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తింది. హిందీని పూర్తిగా రాష్ట్రం నుంచి మినహాయించలేమని పేర్కొన్న ధర్మాసనం హిందీ బోధనపై రాష్ట్రం పునరాలోచన చేయాలని సూచించింది. ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలన్న గత ఆదేశాన్ని కూడా కోర్టు వెనక్కి తీసుకోలేదు. రాష్ట్రానికి మరో మూడు నెలల గడువు ఇచ్చింది. ఈ వ్యాఖ్యలపై తమిళనాడు స్కూల్ ఎడ్యుకేషన్ మంత్రి, టీవీకే నేత రాజ్‌మోహన్ అరుముగం స్పందిస్తూ.. రాష్ట్రం రెండు భాషల విధానానికే కట్టుబడి ఉంటుందని తెలిపారు. హిందీతో పాటు ఏ భాషకు కూడా తమిళనాడు వ్యతిరేకం కాదని, అయితే తమిళ భాషకు రాష్ట్రంలో ప్రాధాన్యం ఉండాలని ఆయన అన్నారు. సుప్రీంకోర్టు వ్యాఖ్యలు విచారణ సందర్భంగా చేసిన అభిప్రాయాలు మాత్రమేనని, తుది తీర్పుగా పరిగణించకూడదని స్పష్టం చేశారు. నవోదయ విద్యాలయాలు కేంద్ర విద్యాశాఖ పరిధిలోని నవోదయ విద్యాలయ సమితి నిర్వహించే కేంద్ర నిధులతో కూడిన రెసిడెన్షియల్ పాఠశాలలు. ఈ పాఠశాలల్లో మూడు భాషల విధానం అమలవుతుండటంతో తమిళనాడు రెండు భాషల విధానానికి ఇది భిన్నంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. కేంద్రం మాత్రం దేశవ్యాప్తంగా విద్యార్థులకు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే నవోదయ పాఠశాలల ఉద్దేశమని చెబుతోంది. ఈ వివాదంలో భాషా విధానంతో పాటు భూమి కేటాయింపు కూడా ప్రధాన అంశంగా మారింది. ప్రతి జిల్లాలో నవోదయ పాఠశాలల ఏర్పాటుకు తగిన భూమిని రాష్ట్రం గుర్తించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. పాఠశాలల నిర్మాణానికి అయ్యే ఖర్చును కేంద్రం భరిస్తుందని, రాష్ట్రం భూమిని సమకూర్చాలని కేంద్రం తన వైఖరిని వెల్లడించింది. కేంద్రం, రాష్ట్రం పరస్పర చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. ఇదిలా ఉండగా, తమిళనాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేత, డీఎంకే నేత ఉదయనిధి స్టాలిన్ కూడా రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి మద్దతు తెలిపారు. తమిళనాడుకు నవోదయ పాఠశాలలు అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే మోడల్, రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. అవసరమైతే ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించి నవోదయ పాఠశాలలకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలని ఆయన సూచించారు. హిందీ విషయంలోనూ ఉదయనిధి స్టాలిన్ కీలక వివరణ ఇచ్చారు. తమిళనాడు హిందీకి లేదా ఇతర ఏ భాషకైనా వ్యతిరేకం కాదని, అయితే ఒక భాషను బలవంతంగా అమలు చేయడాన్నే వ్యతిరేకిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దీంతో సాధారణంగా రాజకీయంగా పరస్పరం విమర్శించుకునే అధికార టీవీకే, ప్రతిపక్ష డీఎంకే రెండు భాషల విధానం,

నవోదయ పాఠశాలల అంశంలో ఒకే వైఖరిని వ్యక్తం చేయడం చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం సుప్రీంకోర్టు ఇచ్చిన మూడు నెలల గడువులో తమిళనాడు ప్రభుత్వం తదుపరి ఏ చర్యలు తీసుకుంటుందనేది కీలకంగా మారింది. మరోవైపు కేంద్రం,

రాష్ట్రం మధ్య చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలని కోర్టు సూచించిన నేపథ్యంలో ఈ వివాదం తదుపరి విచారణల్లో ఎలాంటి మలుపు తిరుగుతుందనేది ఆసక్తికరంగా మారింది.

# మహిళను కొట్టిచంపి పసికందును మృతదేహంపై వదిలివెళ్లిన దుండగులు

**బెంగళూరు, సెప్టెంబరు 19:** కొందరు వ్యక్తులు ఒక మహిళను కొట్టి చంపి ఏడుస్తున్న కుమార్తె అయిన ఏడాదిన్నర వయస్సున్న చిన్నారిని ఆమె మృతదేహంపై ఉంచి పారిపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆ మహిళ భర్త, ఆమె ప్రియుడ్ని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. కర్ణాటకలోని రాయచూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. సింధనూర్ సబ్ డివిజన్‌లోని ఆర్‌హెచ్ క్యాంప్ ప్రాంతంలో నివసించే 25 ఏళ్ల స్నేహపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. రాయితో ఆమె తలపై కొట్టి చంపారు. ఏడుస్తున్న ఏడాదిన్నర వయస్సున స్నేహ కుమార్తెను ఆమె మృతదేహంపై ఉంచి అక్కడి నుంచి పారిపోయారు. గ్రామం శివార్లలోని పొలంలో స్నేహ మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కుమార్తె అయిన చిన్నారి చనిపోయిన తన తల్లిని గట్టిగా పట్టుకుని నిస్సహాయంగా ఏడుస్తూ కనిపించింది. ఇది చూసి పోలీసులు, స్థానికులు చలించిపోయారు. ఆ మహిళ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరోవైపు నాలుగేళ్ల కిందట అమిత్‌తో స్నేహకు వివాహం జరిగినట్లు పోలీసులు తెలుసుకున్నారు. గత నాలుగు నెలలుగా శుభమ్ అనే వ్యక్తితో ఆమెకు వివాహేతర సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో తెలిసింది. ఈ నేపథ్యంలో స్నేహ భర్త, ఆమె ప్రియుడ్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెను హత్య చేసిన వ్యక్తులు, అందుకు కారణాలు తెలుసుకునేందుకు వారిద్దరిని ప్రశ్నిస్తున్నారు. ఈ హత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

# ప్రశ్నలు అడుగుతున్నందుకే.. విద్యార్థులనుచూసి భయపడుతున్న వ్యవస్థ

## ఛాత్రోంకి గూంజ్ కార్యక్రమంలో రాహుల్‌గాంధీ



**ఇండోర్, సెప్టెంబరు 19:** విద్యార్థులు ప్రశ్నలు అడుగుతున్నందుకే ప్రస్తుత వ్యవస్థ వారిని చూసి భయపడుతోందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. శనివారం ఇండోర్‌లో కాంగ్రెస్ నిర్వహించిన ఛాత్రోం కీ గూంజ్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు విద్యాసంస్థల పనితీరు నుంచి దేశంలో ఆర్థిక శక్తి, రాజకీయ ప్రభావం కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావడం వరకు అనేక అంశాలపై ప్రశ్నలు వేస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. విద్యార్థులు ప్రశ్నలు అడుగుతున్నందుకే వ్యవస్థ వారిని చూసి భయపడుతోంది. ఎందుకు? ఎందుకంటే విద్యార్థులు ప్రశ్నలు అడుగుతారఅని ఆయన అన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుమారుడు క్రికెట్ సంఘానికి ఛైర్మన్‌గా ఎలా అయ్యారనే ప్రశ్నతో పాటు, దేశ వ్యాపార రంగంలో ఇద్దరు వ్యక్తులు పెద్ద స్థాయిలో ఎలా ఆధిపత్యం సాధించారనే అంశాలను కూడా విద్యార్థులు ప్రశ్నిస్తున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అలాగే న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం వంటి సంస్థలు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నాయా అనే అంశంపైనా ప్రశ్నలు వస్తున్నాయని అన్నారు. అధికారాన్ని ప్రశ్నించే విద్యార్థులు వ్యవస్థకు నచ్చరని, బదులుగా తాను అంధభక్తులని పేర్కొన్న వారిని వ్యవస్థ కోరుకుంటోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. విద్యార్థి ఆసక్తితో ప్రశ్నలు అడుగుతాడని, భయపడకుండా తన సందేహాలను వ్యక్తం చేస్తాడని ఆయన అన్నారు. దీనికి భిన్నంగా అంధభక్తుడుభ్రమాత్మక ప్రపంచంలో జీవిస్తూ పిరికితనంతో ఉంటాడని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. విద్యార్థులను రక్షించాల్సిన వ్యవస్థే వారిపై దాడి చేస్తోందన్నారు. విద్యార్థులను ఆదుకోవడం, రక్షించడం, విశ్వవిద్యాలయాలు, కళాశాలలను కాపాడటం కోసం ఏర్పాటైన వ్యవస్థే తమకు వ్యతిరేకంగా పనిచేస్తోందనే భావన విద్యార్థుల్లో ఉందని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులకు సహాయం చేసి, వారిని రక్షించాల్సిన, విశ్వవిద్యాలయాలు, కళాశాలలను కాపాడాల్సిన వ్యవస్థే తమపై దాడి చేస్తోందని వారు భావిస్తున్నారు'అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓ విద్యార్థి కూడా రాహుల్ గాంధీ అభిప్రాయంతో ఏకీభవిస్తూ విశ్వవిద్యాలయాల పనితీరుపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులతో విశ్వవిద్యాలయాలు సమన్వయం చేసుకోలేకపోతున్నాయని, అవినీతి జరుగుతోందని, పారదర్శకత లోపించిందని విద్యార్థి ఆరోపించారు. ఖచ్చితంగా. విశ్వవిద్యాలయాలు విద్యార్థులతో సమన్వయం చేసుకోలేకపోతున్నాయి. ప్రతిచోటా మోసం జరుగుతోంది. పూర్తిగా పారదర్శకత లోపించిందని ఆ విద్యార్థి అన్నారు.

# కాలువలోకి దూసుకెళ్లిన కారు.. ఎనిమిది మంది మృతి



**భోపాల్, సెప్టెంబరు 19:** మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన ఒక కారు కాలువలోకి దూసుకెళ్లడంతో ఎనిమిది మంది మరణించారు. మృతుల్లో ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ఈ ఘటన మధ్యప్రదేశ్, అగర్ మాల్వా జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత జరిగింది. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాల్ని పోలీసులు వెల్లడించారు. ఒడిశాకు చెందిన కొందరు భక్తులు మధ్యప్రదేశ్‌లో ఉన్న నల్ఖేదా పట్టణంలోని బగులాముఖి ఆలయానికి వెళ్లేందుకు ఒక కార్ బుక్ చేసుకున్నారు. శుక్రవారం అర్ధరాత్రి కారులో వెళ్తుండగా అగర్ మాల్వా జిల్లా పరిధిలో కల్వర్టు పక్కన ఒక కాలువ ప్రవహిస్తోంది. అయితే, రాత్రి పూట అందులో వేగంగా ఉండటం వర్షం వల్ల కాలువ పొంగి ప్రవహించడం వంటి కారణాల వల్ల అక్కడ ఉన్న కాలువను డ్రైవర్ గుర్తించకపోయి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో వేగంగా వచ్చిన కారు ఆ కాలువలోకి పడిపోయింది. రాత్రిపూట కావడంతో ఎవరూ చూడలేకపోయారు. అప్పటికే కాలువ నిండుగా ప్రవహిస్తోంది. కారు కాలువలో పడిపోయిన తర్వాత అందులోని ప్రయాణికులు బయటికి రాలేకపోయారు. కారు డోర్లు లాక్ చేసి ఉండటంతో అందులోనే ప్రాణాలు కోల్పోయారు. మొత్తం ఎనిమిది మంది మరణించారు. వీరిలో ఇద్దరు మహిళలున్నారు.

ముగ్గురు పిల్లలు కూడా ఉన్నారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కారును, అందులోని మృతదేహాల్ని వెలికి తీశారు. అనంతరం మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు ఈ ఘటనపై మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల పరిహారం ప్రకటించారు.

# ఢిల్లీ వర్సిటీలో ఎబివిపి జయకేతనం!

## మూడు కీలక పదవుల్లో ఎబివిపి విజయం



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 19:** ఢిల్లీ యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ 2026 ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. నాలుగు ప్రధాన పదవుల్లో మూడింటిని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కైవసం చేసుకుంది. అధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవుల్లో ఏబీవీపీ అభ్యర్థులు విజయం సాధించారు. అధ్యక్షుడిగా యశ్ దబాస్ 24,576 ఓట్లతో ఎన్నికయ్యారు. కార్యదర్శిగా రియా ఛావడీ 21,650 ఓట్లు సాధించారు. సంయుక్త కార్యదర్శిగా లక్ష్య రాజ్ సింగ్ 16,641 ఓట్లతో విజయం సాధించారు. మరోవైపు, గతంలో ఎన్ఎస్‌యుఐతో అనుబంధం ఉన్న స్వతంత్ర అభ్యర్థి దీపాంశు షోకీన్ 30,615 ఓట్లతో ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ మద్దతుతో ఉన్న నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్న ఏబీవీపీకి అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపించింది. ఢిల్లీలోని కంజావాలాకు చెందిన యశ్ దబాస్ శ్రీ గురు తేగ్ బహదూర్ ఖాల్సా కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆయన అంతర్జాతీయ స్థాయి టెన్నిస్ క్రీడాకారుడిగా ఉన్నట్లు పేర్కొన్నారు. స్పెయిన్, ఆస్ట్రేలియా, సెర్బియాలో జరిగిన పోటీల్లో పాల్గొన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఢిల్లీ యూనివర్సిటీలోని బౌద్ధ అధ్యయనాల విభాగంలో చదువుతున్నారు. రియా ఛావడీ ఢిల్లీలోని బదర్‌పూర్‌కు చెందిన మోడ్బంద్ గ్రామానికి చెందినవారు. వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలోని శ్రీ అరబిందో కాలేజీలో విద్యనభ్యసించారు. ప్రస్తుతం అదే కాలేజీలో బీఏ ప్రోగ్రామ్ నాలుగో సంవత్సరం చదువుతున్నారు. తాను ఇంటర్‌కాలేజీ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడాకారిణినని ఆమె పేర్కొన్నారు. రాజస్థాన్‌లోని చురు జిల్లాకు చెందిన లక్ష్య రాజ్ సింగ్ ఢిల్లీ యూనివర్సిటీలోని శ్రీ గురు తేగ్ బహదూర్ ఖాల్సా కాలేజీలో పొలిటికల్ సైన్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ప్రస్తుతం ఢిల్లీ యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ లా పరిధిలోని క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయ విద్య అభ్యసిస్తున్నారు. తాను అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడినని సింగ్ పేర్కొన్నారు. ఆసియా క్రీడలు, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించినట్లు తెలిపారు.

# దుండిగల్‌లో 426 కిలోల గంజాయి పట్టివేత

## ఆరుగురు గంజాయి పెడ్లర్ల అరెస్ట్ - ఇద్దరు పరార్



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

**దుండిగల్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త**

అక్రమంగా తరలిస్తున్న భారీ గంజాయి సరఫరా ముఠాను దుండిగల్ పోలీసులు, ఎస్ఓటీ కుత్బుల్లాపూర్ జోన్ బృందం సంయుక్తంగా పట్టుకున్నారు. ఈ ఘటనలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 426 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.2.28 కోట్లుగా పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రంలోని గజపతి జిల్లా నుంచి సురంగిని పరిచ్ఛా అలియాస్ సునీత గంజాయిని సమకూర్చినట్లు తెలిపారు. అనంతరం మహారాష్ట్రలోని సోలాపూర్‌కు చెందిన పలువురు వ్యక్తులతో కలిసి గంజాయిని తరలించేందుకు కుట్ర పన్నినట్లు పేర్కొన్నారు. గంజాయిని ఈచర్ డీసీఎం వాహనం ద్వారా తరలిస్తుండగా, దానికి ముందుగా సిల్వర్ రంగు స్విఫ్ట్ కారును ఎస్కార్ట్ వాహనంగా ఉపయోగించినట్లు పోలీసులు తెలిపారు. 18న రాత్రి 8 గంటల సమయంలో ఓఆర్ఆర్ ఎగ్జిట్5, దుండిగల్ సర్వీస్ రోడ్డులో ఎస్ఓటీ కుత్బుల్లాపూర్ జోన్ బృందం వాహనాలను తనిఖీ చేయగా అక్రమంగా తరలిస్తున్న 426 కిలోల గంజాయి బయటపడింది. దీంతో గంజాయితో పాటు సిల్వర్ రంగు స్విఫ్ట్ కారు, ఈచర్ డీసీఎం, మొబైల్ ఫోన్లు, కొంత నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ఒడిశా రాష్ట్రానికి చెందిన సురంగిని పరిచ్ఛా అలియాస్ సునీతతో పాటు మహారాష్ట్రకు చెందిన బాలు గణపత్ కడం, ఉపలబ్ధ మంగలేష్ భోస్లే, సమాధాన్ గోకుల్ థోరట్, రాజు చవాన్, అరుణ్ బాబురావు చేందకేలను పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరు నిందితులు అవినాష్ బాబు రాథోడ్, అభిజిత్ థాటే పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వారి కోసం గాలింపు కొనసాగుతోంది. పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అరెస్టయిన నిందితురాలు సునీత భర్త రాహుల్ పరిచ్ఛా గతంలో 2025లో ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్టై ప్రస్తుతం ఖమ్మం జైలులో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు ఎస్ఓటీ డీసీపీ పి. శోభన్ కుమార్, మేడ్చల్ డివిజన్ ఏసీపీ చ. శంకర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. గంజాయి ముఠాను పట్టుకోవడంలో సమన్వయంతో పనిచేసిన అదనపు డీసీపీ ఎ. విశ్వ ప్రసాద్, దుండిగల్ ఇన్‌స్పెక్టర్ ఎం. బాల్‌రెడ్డి, ఎస్ఓటీ కుత్బుల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ కె. నర్సింహా, దుండిగల్ పోలీస్ సిబ్బంది, ఎస్ఓటీ సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.


# అగ్రరాజ్యాల్లో ఎన్నికల సందడి

## అమెరికాలో మధ్యంతర ఎన్నికలు షురూ.. రష్యాలో పార్లమెంటుకు

**వాషింగ్టన్‌మ్రాస్కో, సెప్టెంబరు 19:** అమెరికా కాంగ్రెస్ (పార్లమెంటు)కు మధ్యంతర ఎన్నికల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. దేశాధ్యక్షుని పదవీకాలం సగం పూర్తయినప్పుడు ఈ ఎన్నికలు నిర్వహిస్తారు. అందుకే వీటిని మధ్యంతర ఎన్నికలని పిలుస్తారు. అమెరికా కాంగ్రెస్‌లోని 435 ప్రజాప్రతినిధుల సీట్లకు, ఎగువ సభ అయిన సెనేట్‌లోని మూడో వంతు స్థానాలకు ఈ ఎన్నిక జరుగుతుంది. శుక్రవారం వ్యక్తిగత (ఇన్‌పర్సన్) ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. నవంబరు 3న తుది ఎన్నికల జరుగుతుంది. సాధారణంగా మధ్యంతర ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు ఆధిక్యత సాధించడం ఆనవాయితీ. అయితే ఈసారి ఎన్నికల్లో అధికార పార్టీ అయిన రిపబ్లికన్ పార్టీకి మెజారిటీ సాధించడం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కొత్త ఎత్తు వేశారు. మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఆధిక్యత దక్కితే అమెరికాలో ఓటు వేయడానికి హక్కున్న ప్రతి ఒక్కరికీ 5వేల డాలర్లు డివిడెండ్‌గా అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అమెరికాలో విపరీతంగా పెరిగిపోయిన ధరలు, ఇరాన్‌తో యుద్ధం తదితర పరిణామాల నేపథ్యంలో ఈ ఎన్నికలు జరగనున్నాయి.

పుతిన్ పార్టీకే మళ్లీ మెజారిటీ? ఒకవైపు ఉక్రెయిన్‌తో యుద్ధంలో తలమునకలై ఉన్న రష్యా మరోవైపు తన దేశ పార్లమెంటు అయిన 'డుమా'కు ఎన్నికలు కూడా నిర్వహిస్తోంది. ఈ ఎన్నికల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. మొత్తం 450 సీట్లకు ఓటింగ్ జరుగుతోంది. ఇందులో ప్రతి ఓటరూ రెండు బ్యాలెట్లపై తన ఓటు నమోదు చేయాల్సి ఉంటుంది. ఒక ఓటు తాను కోరుకునే రాజకీయ పార్టీకి, మరొకటి పోటీకి నిలుచున్న అభ్యర్థికి వేయాలి. ఈ ఎన్నికల్లో అర్హులైన 11.1 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అత్యధిక సంఖ్యలో ఓటర్లు పోలింగులో పాల్గొనేందుకు వీలుగా ఎన్నికల ప్రక్రియను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. అసలు విపక్షమే లేకుండా జరుగుతున్న ఈ ఎన్నికల్లో దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు చెందిన 'యునైటెడ్ రష్యా' పార్టీ తిరుగులేని ఆధిక్యత సాధించనుంది. పుతిన్ ఆశీర్వాదం ఉన్న ఇతర పక్షాలు కూడా కొన్ని స్థానాలు నిలబెట్టుకోబోతున్నాయి.

# వ్యవసాయ రంగంలో యువతకు సంకల్ప్ 11.0 స్ఫూర్తి



ఐసిఎఆర్-నార్మ్‌లో జ్యోతి ప్రజ్వలన చేసి బిజినెస్ ఫెస్ట్ సంకల్ప్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పలువురు శాస్త్రవేత్తలు

**అత్తాపూర్ సెప్టెంబరు 19,ప్రభాతవార్త** : వ్యవసాయ, అనుబంధ రంగాల్లో యువతను వ్యవస్థాపకత వైపు ప్రోత్సహించేందుకు ఐసీఏఆర్ - జాతీయ వ్యవసాయ పరిశోధనా నిర్వహణ అకాడమీ (ఐసీఏఆర్ -నార్మ్) రాజేంద్రనగర్‌లో నిర్వహించిన 11వ జాతీయ బిజినెస్ ఫెస్ట్ సంకల్ప్ 11.0 విజయవంతంగా శనివారం ముగిసింది. శుక్ర,శనివారాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా విశేష స్పందన లభించింది. పది బిజినెస్ ఛాలెంజ్‌లలో పాల్గొనేందుకు 1,515 సంస్థలకు చెందిన విద్యార్థుల నుంచి 17,230 రిజిస్ట్రేషన్లు రావడం విశేషం. వివిధ పోటీల్లో తుది దశకు చేరుకున్న 52 మంది ఫైనలిస్టులు క్యాంపస్‌కు చేరుకుని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఐఐఎంలు, ఎన్ఐటీలు, మేనేజ్ తదితర ప్రముఖ విద్యాసంస్థల విద్యార్థులు పలు విభాగాల్లో బహుమతులు సాధించారు. కార్యక్రమానికి నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డ్ (ఎన్ఎఫ్‌డీబీ), హైదరాబాద్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. ఎస్. కన్నప్పన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల్లో విస్తరిస్తున్న అవకాశాలను ఆయన వివరించారు. సుస్థిర పద్ధతులతో ఈ రంగాల్లో ఉన్న వ్యవస్థాపక అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అద్వాంటా ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ హెచ్‌ఆర్ బిజినెస్ పార్ట్‌నర్ అప్పారావు వెల్ది మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఎంఎస్ఆర్ ఆక్వా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శ్రీ ఎం. వెంకట రమణ మాట్లాడుతూ...ఆక్వాకల్చర్ రంగంలో సాంకేతిక పురోగతి, వ్యవస్థాపక అవకాశాలను వివరించారు. రామా బయోమెరైన్ అండ్ హ్యాచరీస్ ఛైర్మన్ కల్యాణ్ చక్రవర్తి ఆక్వాకల్చర్‌లో ఆవిష్కరణలు, సుస్థిర పద్ధతుల ప్రాధాన్యాన్ని వివరించారు.ఐసీఏఆర్-నార్మ్ డైరెక్టర్ డా. ఆర్.ఎం. సుందరం మాట్లాడుతూ వ్యవసాయ రంగ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నిపుణులను తీర్చిదిద్దేందుకు ఆవిష్కరణలు, నాయకత్వ లక్షణాలు, పరిశ్రమవిద్యాసంస్థల సహకారం కీలకమన్నారు. జాయింట్ డైరెక్టర్ డా. గోపాల్ లాల్ మాట్లాడుతూ అనుభవాత్మక అభ్యాసం, ఆచరణాత్మక పరిజ్ఞానం, వ్యవస్థాపకతతో భవిష్యత్ వ్యవసాయ వ్యాపార నిపుణులను తీర్చిదిద్దవచ్చన్నారు.ఎన్ఎఫ్‌డీబీ, ఎంఎస్ఆర్ ఆక్వా, సూర్య హ్యాచరీస్, అద్వాంటా ఎంటర్‌ప్రైజెస్, రాశి సీడ్స్, రామా బయోమెరైన్ అండ్ హ్యాచరీస్, నార్మ్-ఎఐడియా, ఎస్ఏఏఎస్ హైదరాబాద్ చాప్టర్ తదితర సంస్థలు కార్యక్రమానికి స్పాన్సర్లుగా సహకరించాయి. యువత తమ నిర్వహణ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు, కొత్త ఆలోచనలను పంచుకునేందుకు, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వ్యాపార అవకాశాలు.

# కృత్రిమ మేధపై అన్నీ అపోహాలే..

## ఎన్విడియా సిఇఒ జెన్సెన్ హువాంగ్

**వాషింగ్టన్, సెప్టెంబరు 19:** కృత్రిమ మేధ (ఏఐ)పై రోజురోజుకూ ఆందోళనలు పెరుగుతున్నాయి. అత్యంత శక్తిమంతమైన ఏఐ వ్యవస్థలు అదుపు తప్పితే మానవాళికి పెను ముప్పు తప్పదన్న హెచ్చరికలు వినిపిస్తున్నాయి. అయితే 2030 నాటికి ఏఐ కారణంగా ప్రపంచం అంతమయ్యే అవకాశమే లేదని ఎన్విడియా సీఈఓ జెన్సెన్ హువాంగ్ స్పష్టం చేశారు. అలాంటి విపత్తు సంభవించే అవకాశం ఏమాత్రం లేదని అని తేల్చి చెప్పారు. హువాంగ్ తాజా ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఏఐ వల్ల ప్రపంచం అంతమవుతుందన్న వాదనలో అర్థం లేదన్నారు. కొందరు చేస్తున్న హెచ్చరికల వెనుక రాజకీయ, వ్యాపార ప్రయోజనాలు లేదా ప్రజల దృష్టిని ఆకర్షించాలన్న ఉద్దేశం ఉండొచ్చని సందేహం వ్యక్తం చేశారు. ఏఐ అభివృద్ధిని కంపెనీలు వేగవంతం చేయాలని హువాంగ్ అన్నారు. అయితే భద్రత విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. పూర్తిగా సిద్ధం కాని, సురక్షితంగా లేని ఏఐ ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావద్దని స్పష్టం చేశారు. ఇదే సమయంలో ఏఐ అభివృద్ధి వేగంపై టెక్ రంగంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సురక్షిత వ్యవస్థల కోసం మరిన్ని జాగ్రత్తలు అవసరమని ఓపెన్‌ఏఐ సీఈఓ సామ్ ఆల్ట్‌మన్, ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయి సహా పలువురు చెబుతున్నారు. ఏఐను అర్థం చేసుకుని నియంత్రించే ప్రయత్నాల కంటే దాని అభివృద్ధి వేగం పెరిగిపోవచ్చని అమోడెయి ఈ నెలలో హెచ్చరించారు.

# 51 వేల నియామక పత్రాలతో కోట్లాది నిరుద్యోగ యువత సమస్య పరిష్కారం కాదు

## యువత ఉపాధిపై కేంద్రం శ్వేతపత్రం విడుదల చేయాలి: ఎఐవైఎఫ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 19, ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం 20వ రోజ్‌గార్ మేళా ద్వారా 51 వేల మందికి పైగా యువతకు నియామక పత్రాలు అందిస్తున్నట్లు ప్రకటించడం స్వాగతించదగినదేనని, అయితే కేవలం రోజ్‌గార్ మేళాల నిర్వహణతోనే దేశంలోని నిరుద్యోగ సమస్యకు పరిష్కారం లభించదని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యులు కల్లూరు ధర్మేంద్ర అన్నారు. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ ఇప్పటివరకు రోజ్‌గార్ మేళాల ద్వారా సుమారు 5 లక్షల మందికి నియామక పత్రాలు అందించినట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోందని, అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో మొత్తం ఎన్ని పోస్టులు మంజూరయ్యాయి, ఎన్ని భర్తీ అయ్యాయి, ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయనే వివరాలను శాఖల వారీగా ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. రైల్వేలు, రక్షణ, పోస్టల్, ఆరోగ్యం, విద్య తదితర కీలక రంగాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ పోస్టులను కాలపరిమితితో భర్తీ చేయాలని కోరారు. ప్రధానమంత్రి స్వయంగా నియామక పత్రాలు అందిస్తున్నారనే ప్రచారానికి ప్రాధాన్యం ఇవ్వడం కంటే, దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఇంకా ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో ప్రజలకు వెల్లడించడం ముఖ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వ కాలానుగుణ కార్మిక శక్తి సర్వే-2025 అధికారిక నివేదిక ప్రకారం తెలంగాణలో 15-29 ఏళ్ల యువతలో నిరుద్యోగిత రేటు 18.1 శాతంగా నమోదైందని తెలిపారు.

ఉన్నత విద్య పూర్తి చేసిన యువతకు తగిన ఉద్యోగాలు లభించకపోవడం, నియామక పరీక్షలు నిర్వహించడంలో, ఫలితాలు ప్రకటించడంలో, నియామక ప్రక్రియ పూర్తి చేయడంలో జాప్యం జరగడం, వయోపరిమితి దాటిపోవడం వంటి సమస్యలు నిరుద్యోగ యువతను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ధర్మేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కేవలం నియామక పత్రాల పంపిణీ కార్యక్రమాల ప్రచారానికి పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా యువత ఉపాధి పరిస్థితిపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నోటిఫికేషన్ జారీ నుంచి నియామకం వరకు ప్రతి దశకు స్పష్టమైన

కాలపరిమితిని ప్రకటించి, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ తరపున ధర్మేంద్ర కోరారు.

# రుచులే రుచులు !

## చికెన్ పాప్‌కార్న్



**కావాల్సినవి :** బోన్‌లెస్ చికెన్-500గ్రా మారినేషన్ కోసం : అల్లంవెల్లుల్లి పేస్ట్-చెంచా, ఉప్పు- తగినంత, కారం-చెంచాన్నర, పసుపు-పావుచెంచా, ధనియాలపొడి-అరచెంచా, వెనిగర్-చెంచా, కొత్తిమీర తరుగు-చెంచాన్నర, గుడ్డు-1, మొక్కజొన్నపిండి-చెంచాన్నర, కోటింగ్ కోసం: బ్రెడ్‌క్రంబ్స్-ముప్పావుకప్పు, కార్న్ ఫ్లేక్స్ పొడి-కప్పులో మూడోవంతు, ఉప్పు-అరచెంచా, కారం-చెంచా, నూనె- వేయించడానికి సరిపడ.

**తయారీ :** ఒక పాత్రలో చికెన్ వేసుకుని మారినేషన్ చేయడానికి కావాల్సిన పదార్థాలన్నీ బాగా కలిపి ఫ్రిజ్‌లో రెండు గంటపాటు ఉంచాలి. మరొక పాత్ర తీసుకుని దీనిలో కోటింగ్ కోసం మొక్కజొన్నపిండి, బ్రెడ్‌క్రంబ్స్, కార్న్‌ఫ్లేక్స్ పొడి, ఉప్పు, కారం అన్నీ బాగా కలపాలి. మారినేట్ చేసి సిద్ధంగా పెట్టుకుననన చికెన్ ముక్కలని ఈ కోటింగ్ పొడిలో వేసి దొర్లించుకోవాలి. వీటిని నూనెలో ఎర్రగా వేయించుకుంటే చికెన్ పాప్‌కార్న్ సిద్ధం. వెజ్, నాన్‌వెజ్ ఏ స్టార్టర్‌లు చేసినా.. పదార్థాల్ని ఒకటి రెండు గంటలు మారినేట్ చేసి పెట్టుకుంటే ఆ రుచి ప్రత్యేకంగా ఉంటుంది.

## మష్రూమ్ 65..



**కావాల్సినవి :** పెరుగు-అర కప్పు, అల్లంవెల్లుల్లి పేస్ట్-చెంచా, ఎర్రని కశ్మీరి కారం-రెండు చెంచాలు, జీలకర్ర- చెంచా, ధనియాల పొడి-రెండు చెంచాలు, గరం మసాలా-చెంచా, కరివేపాకు-రెబ్బ, కార్న్‌ఫ్లోర్-రెండు చెంచాలు, మైదా-4 చెంచాలు, నిమ్మరసం-అరచెంచా, ఉప్పు-తగినంత, పుట్టగొడుగులు-200 గ్రా, నూనె-వేయించ డానికి సరిపడ, ఉల్లికాడ-ఒకటి, బియ్యప్పిండి-రెండు చెంచాలు.

**తయారీ :** ముందుగా పుట్టగొడుగులని శుభ్రం చేసుకుని నిలువుగా తరిగి పెట్టుకోవాలి. ఒక పాత్రలో పెరుగుని క్రీంలా అయ్యేలా చిలికి పెట్టుకోవాలి. దీనికి అల్లం, వెల్లుల్లిపేస్ట్, గరంమసాలా, కారం, జీలకర్ర పొడి, ధనియాలపొడి, సన్నగా తరిగిన కరివేపాకు, మొక్కజొన్న పిండి, మైదా, బియ్యప్పిండి, ఉప్పు చివరిగా నిమ్మరసం వేసుకోవాలి. స్టౌ వెలిగించి కడాయి పెట్టుకుని నూనె పోసి వేడెక్కాక.. అప్పుడు మొక్కజొన్నపిండి మిశ్రమంలో మష్రూమ్స్‌ని వేసుకోవాలి. ముందే వేసుకుంటే వాటి నుంచి నీళ్లు ఊరి పిండి పలచబడుతుంది. వీలైనంత వరకూ పిండి పలచగా లేకుండా జాగ్రత్తపడాలి. లేదంటే కాస్త వియ్యప్పిండి వేసుకోవాలి. పిండిలో ముంచి మష్రూమ్స్‌ని నూనెలో దోరగా వేయించుకోవడమే. ఉల్లికాడల్ని సన్నగా తరిగి వడ్డించుకుంటే సరి.

## చట్‌పటా ఆలూ..

**కావాల్సినవి :** బేబీ ఆలూ (చిన్న బంగాళాదుంపలు)-15 (ఆలూ ముక్కలు కూడా తీసుకోవచ్చు), ధనియాల పొడి-రెండు చెంచాలు, కారం-చెంచా, ఆమ్‌చూర్ పొడి-రెండు చెంచాలు, గరంమసాలా- చెంచా, వేయించిన నువ్వులు-రెండు చెంచాలు, సోంపు పొడి-చెంచా, ఉప్పు-రుచికి తగినంత, నూనె-తగినంత, కరివేపాకు-రెబ్బ.

**తయారీ :** బంగాళా దుంపల్ని ఉడికించి పొట్టు తీసి పక్కన పెట్టుకోవాలి. వీటిని నూనెలో ఎర్రగా వేయించుకోవాలి. స్టౌ వెలిగించి మరొంక కడాయి పెట్టుకుని కొద్దిగా నూనె పోసుకుని వేడెక్కాక అందులో కరివేపాకు, వేయించిన ఆలూ, పైన చెప్పుకొన్న మసాలా పొడులు వేసి రెండు నిమిషాలు వేయించుకుంటే చట్‌పటా ఆలూ సిద్ధం.

## ప్రాన్ 65 ..



**కావాల్సినవి :** రొయ్యలు-250 గ్రా, పసుపు-పావుచెంచా, మిరియాలపొడి-పావుచెంచా, జీలకర్రపొడి-అరచెంచా, ఉప్పు-తగినం, ధనియాల పొడి-చెంచా, కారం-చెంచా, మొక్కజొన్న పిండి-చెంచా, సెనగపిండి-చెంచా, బియ్యప్పిండి-చెంచా, కరివేపాకు-రెబ్బ, నిమ్మరసం-చెంచా, నూనె తగినంత. **తయారీ :** పసుపు వేసి రొయ్యల్ని శుభ్రం చేసుకోవాలి. గిన్నెలో రొయ్యలు, మసాలా పొడులు, పిండ్లు వేసి రొయ్యలకు బాగా పట్టించాలి. చివరిగా నిమ్మరసం, ఉప్పువేసి మరో కలపాలి. ఈ మసాలా పట్టించిన రొయ్యలని ఒక్కోటిగా నూనెలో వేయించుకుంటే ప్రాన్ 65 సిద్ధం.



## క్రిస్పీ కార్న్..



**కావాల్సినవి :** స్వీట్‌కార్న్-కప్పు, మైదా-రెండు చెంచాలు, మిరియాలపొడి-అరచెంచా, వెల్లుల్లి పలుకులు-అరచెంచా, ఉప్పు-తగినంత, నూనె-వేయించడానికి సరిపడ, టాంపరింగ్ కోసం: నూనె-రెండు చెంచాలు, వెల్లుల్లి రెబ్బలు-మూడు, పచ్చిమిర్చి- రెండు, ఉల్లికాడల తరుగు-పావుకప్పు, టొమాటోసాస్-పావుకప్పు, చిల్లీసాస్-చెంచా, సన్నగా తరిగిన క్యాప్సికమ్ ముక్కలు-పావు కప్పు, వెనిగర్-చెంచా, సోయాసాస్-చెంచా, ఉప్పు-తగినంత.

**తయారీ :** ఒక పాత్రలో మొక్కజొన్న పిండి, మైదా, ఉప్పు, మిరియాలపొడి చెంచాన్నర నీళ్లు పోసి కలిపి అందులో మొక్కజొన్న గింజల్ని కలిపి.. డిప్ ఫ్రై చేసుకోవాలి. ఎక్కువగా ఉన్న నూనె పీల్చుకొనేందుకు ఒక టిష్యూ పేపర్‌పై వేసుకోవాలి. వేరే కడాయిలో.. కొద్దిగా నూనె పోసుకుని వెల్లుల్లి పలుకులు, పచ్చిమిర్చి వేయించుకోవాలి. తర్వాత ఉల్లికాడలు. వీటిని సన్నగా తరిగి ఒక నిమిషం వేయించుకుని.. క్యాప్సికమ్ ముక్కలని వేయించుకోవాలి. ఇందులో టొమాటో సాస్, చిల్లీసాస్, సోయాసాస్, వెనిగర్ వేశాక డీప్‌ఫ్రై చేసి పెట్టుకున్న కార్న్ గింజలు, ఉప్పు వేసి వేయించుకుంటే క్రిస్పీకార్న్ సిద్ధం. □

**భుక్త్వోపా విసస్థాంద్:** ఆహారాన్ని తీసుకున్న తర్వాత ఎప్పుడూ పనిలేకుండా కూర్చో వద్దు. కనీసం 100 అడుగులు అయినా నడవండి.

**క్షుత్ సాధూతం జనయతి:** ఆకలి, ఆహార రుచిని పెంచుతుంది. (ఇంకా చెప్పాలంటే, ఆకలితో ఉన్నప్పుడు మాత్రమే తినండి.)

**సతం విహాయ భోక్తవ్యం:** ఆహారం తీసుకొనే సమయం వచ్చినప్పుడు, ఎంతటి పనినైనా కూడా పక్కన పెట్టండి. నిదానంగా భోజనం చేయండి. వేగంగా తినడం, పని ఉందని అసలు భోజనమే మానివేయడం చాలా అనర్థదాయకం. □

# నెలసరి తెలిస్తేనే సరి !



**అబ్బ! ఏం చెప్పారండి.ఎంత బాధ ఉంటే కానీ మీరలా అనరు. మీరసలే బోల్డ్. అంతే బోల్డ్‌గా మాట్లాడేసారు. అని అందరూ నటి శ్రుతిహాసన్‌ను అభినందిస్తున్నారు. ఇంతకీ ఆమె ఏమన్నారో తెలుసా ! మగవాళ్లకు కూడా పీరియడ్స్ వస్తే బాగుణ్ను.**

మా కాంట్రాక్టులలో అధికారికంగా 'పీరియడ్స్ సెలవులు' అని రాసేవారేమో" అంటూ ప్రముఖ నటి శ్రుతి హాసన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. మహిళలు ముఖ్యంగా సినీ రంగంలో పనిచేసే వారు పీరియడ్స్ సమయంలో ఎదుర్కొనే శారీరక, మానసిక ఇబ్బందుల గురించి ఆమె బహిరంగంగానే మాట్లాడారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న ఓ పాడ్‌కాస్ట్‌లో శ్రుతిహాసన్ ఎన్నో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మగళ్లకు కూడా 'పీరియడ్స్' ఉంటే వాళ్లకీ కష్టాలు తెలుస్తాయి. అన్న ధోరణిలో ఆమె మాట్లాడిన మాటలు ఎంతో సానుభూతిగా తీసుకున్నారు. తాను పాలిసిస్టిక్ ఓవరీ సింద్రోమ్ (పీసీఓఎస్) అనే ఆరోగ్య సమస్యతో బాధపడు తున్నానని, దీనివల్ల పీరియడ్స్ సమయంలో తీవ్రమైన నొప్పి వలన అసౌకర్యంగా ఉండేదా న్నని అన్నారు. . కెరీర్ తొలినాళ్లలో షూటింగ్ సెట్‌లో ఈ నొప్పి గురించి ఎవరి తోనూ చెప్పుకోలేక పోయానని గుర్తు చేసుకు న్నారు. ఒకవైపు ఈ అంశంపై మాట్లాడటం నిషిద్ధం అని భావించ డం, మరోవైపు ఇబ్బందిగా ఉండటంతో మౌనంగా భరించ దాన్నని తెలిపారు. "కొన్ని రోజులు నేను చాలా నీరసంగా కనిపించేదాన్ని. నా ఎనర్జీ లెవెల్స్ పడిపోయేవి. కానీ, దర్శకులుగానీ, ఇతరులుగానీ నాలో ఆ మార్పును గమనించినా అసలు కారణం వారికి తెలిసేది కాదు" అని శ్రుతి వివరించారు. అయితే, ఓ సంఘటన తన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని శ్రుతి తెలిపారు. తన సహనటు మోకాలికి సర్జరీ అయినప్పుడు, షూటింగ్ సిబ్బంది మొత్తం అతనికి అనుకూలంగా ఏర్పాట్లు చేసి, చాలా జాగ్రత్తగా చూసుకున్నారని చెప్పారు. అది చూశాక, తన ఆరోగ్య సమస్య గురించి కూడా ధైర్యంగా చెబితే సహకరి స్తారనే ధోకణిలో చెప్పగలిగేదాన్నని అన్నారు. ఆ తర్వాత మొదటిసారి ఓ దర్శకుడికి తన ఆరోగ్య పరిస్థితిని వివరిం చానని, ఆయనకు కూడా కూతురు ఉండటంతో తన బాధ ను వెంటనే అర్థం చేసుకున్నారని శ్రుతి గుర్తుచేసు కున్నారు. "ఆయన సానుకూల స్పందనతో మా మధ్య సంభాషణ తీరే మారిపోయింది. సెట్‌లో వాతావరణం మరింత స్నేహ పూర్వకంగా మారింది. ఆ తర్వాత నుంచి నా ఇబ్బందిని ధైర్యంగా చెప్పగలుగుతున్నాను" అని ఆమె పేర్కొన్నారు. శ్రుతి వ్యాఖ్యలకు సోహా అలీఖాన్ కూడా మద్దతు తెలిపారు. □

# ఆది దైవం

**మానవ లోకంలో, మనుషులకు సాధారణంగా** ఎదురయ్యే ఆటంకాలను అడ్డుకుంటూ, నిర్విఘ్నంగా జీవితం సాగాలంటే, గణాధిపతి అయిన గణపతే శరణ్యం ఏ పుణ్యకార్యాలు జరిగినా పూజలు ఉన్నా మొదటగా, అర్చాంచబడే దేవుడు వినాయకుడు. ఏటేటా వినాయక చతుర్థి జరగని చోటు ఉండదు. ఉత్సవాలతో, ఊరేగింపులతో, తొమ్మిదిరోజులు గణపతి నవరాత్రులను నిర్వహణలతో, ఆటపాటలతో మారుమ్రోగుతూ, కళాకారుల సందళ్ళతో వినాయక చవితి పందిళ్ళు కలకలాడుతూ, భక్తులందరికీ కనువిందు చేస్తాయి. వ్రతాలు, వివాహాలు మొదలుగా ప్రతి ఇంటి పండుగల్లో, ప్రాతినిధ్యం వహిస్తూ వారి వారికోరికలను తీర్చే ఆది దైవం వినాయకుడు ఆయనే లంబోదరుడు. తల్లియైన పార్వతి చేసిన పసుపు ముద్దతో రూపుదిద్దుకున్న బాలుడు, తండ్రిని అడ్డుకున్న ఆగ్రహానికి గురై తదుపరి ఏనుగు తలతో గుజ్జు రూపంతో, ఎలుక వాహనంగా, అవతరించి అందరినీ ఆదుకునే గజముఖుడిగా, నవగ్రహాధి పతిగా నిలిచి, నీరాజనాలు అందుకునే, ప్రథముడే గణేశుడు. పార్వతీ పరమేశ్వ రులు కుమారులైన కుమారస్వామిని, వినాయకుడిని, త్రిలోక ప్రదక్షిణచేసే పరీక్షలో, తెలివిగా సోదరుడితో ఎదురైన పోటీలో, తల్లిదండ్రుల చుట్టూ మూడుసార్లు తిరిగి గెలిచి సకల గణాధిపతిగా, ఆధిక్యం పొందిన విజయుడు వినాయకుడు. ప్రపంచంలో మాతాపిత రులను సేవిస్తే దొరికే ఫలితాలు, ఎలా ఉంటాయో, వినాయకుడి ఈ చరిత్ర వింటే అర్థం అవుతుంది. తనను చూసి వికటంగా హేళనగా నవ్విన చంద్రుడికి, కోపంతో శపించిన తల్లి కారణంగా చవితినాడు చంద్రుడిని చూసిన వారు నీలాపనిందలకు గురికాగ లరని, గణపతి పూజచేసి ఆయనను చూస్తే ఆ ఆపద ఉండదని వినాయక వ్రతకథలో విశదంగా వివరంగా అందరికీ తెలుస్తుంది. పాలలో చంద్రుడిని చూసిన దోషానికి శ్రీకృష్ణుడు, శమంతకమణిని ఆపహరించిన వాడిగా, నీలా పనిందపాలనడం, తదుపరి మణిని తెచ్చినిందను బాపుకున్న వైనం విని, కృష్ణుడికి సాధ్యమయిన విషయం సామాన్యులకు ఎలా అని వేడుకొనగా పార్వతీదేవి వినాయక చవితపూజానంతరం , ఆయన కథ చదివి అక్షింతలు వేసు కుని చంద్రుడిని చూస్తే నీలాపనిందలు తొలగిపోతాయని అభయంతో అనుగ్రహిస్తుంది. □


# తెర

## 'ది ప్యారడైజ్' ఎంజాయ్ చేస్తారు: నాని



న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ది ప్యారడైజ్. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం లో, ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రెస్ మీట్‌లో న్యాచురల్ స్టార్ నాని మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. బెంగళూరు ఎప్పుడు వచ్చినా సరే చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడ ప్రేక్షకులు ఎంతగానో ప్రేమ, ఆదరణ చూపిస్తారు. ప్రేక్షకుల ప్రేమ, ఆదరణ కు నేను ఎప్పుడూ కృతజ్ఞతలు ఉంటాను. "ప్యారడైజ్ నా కెరీర్‌లో చాలా ప్రతిష్టాత్మక చిత్రం. నా కెరీర్‌లో ఎక్కువ రోజులు షూటింగ్ చేసిన సినిమా ఇదే. గొప్ప థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఇవ్వబోతున్నాం. ఇందులో ఉండే హై మూమెంట్స్ అన్నీ కూడా మీరు ఎంజాయ్ చేస్తారు. ఇందులో ఉండే ఎమోషన్ మీ అందరినీ కదిలిస్తుంది. కొన్ని యాక్షన్ ఎపిసోడ్స్ ఒక స్పెక్టక్యులర్‌గా ఉంటాయి. ప్యారడైజ్ ఒక తల్లి, కొడుకుల కథ. కన్నడలో నా క్యారెక్టర్‌కు దీక్షిత్ డబ్బింగ్ చెప్పాడు. తను నటుడిగా చాలా బిజీగా ఉన్నప్పటికీ మా అందరి మీద ప్రేమతో వచ్చి డబ్బింగ్ చెప్పాడు

## 'సంగీత్'నుంచి తొలిపాట 'నీ వల్లే' విడుదల



తన సామాజిక మాధ్యమం ఖాతా అయిన 'ఎక్స్' ద్వారా చిత్ర గీతాన్ని విడుదల చేసిన ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఎ.ఆర్.రెహ్మాన్‌అచు రాజామణి మెలోడీకి విక్రమ్ శివ హృద్యమైన సాహిత్యం.. నిఖిల్ విజయేంద్ర సింహా, తేజు అశ్విని జంటను పరిచయం చేసిన అందమైన ప్రేమగీతం ఇది. యువతను ఆకట్టుకునే ప్రేమకథా చిత్రంగా తెరకెక్కుతున్న "సంగీత్‌ నుంచి తొలి పాట "నీ వల్లే విడుదలైంది. సంగీత ప్రపంచంలో తనదైన ప్రత్యేకతను చాటుకున్న సిద్ శ్రీరామ్ గాత్రం, ప్రముఖ సంగీత దర్శకుడు అచు రాజామణి అందించిన మధురమైన స్వరాలతో 'నీ వల్లే' ఒక హృద్యమైన రొమాంటిక్ మెలోడీగా రూపుదిద్దుకుంది. విక్రమ్ శివ ఈ పాటకు సాహిత్యాన్ని అందించారు.నిఖిల్ విజయేంద్ర సింహా, తేజు అశ్విని మధ్య ప్రేమను, వారి కెమిస్ట్రీని పరిచయం చేసేలా ఈ పాటను చిత్రీకరించారు. లహరి ఫిల్మ్స్ - ఆర్‌బీ స్టూడియోస్ సంయుక్తంగా 'సంగీత్' 'రైటర్ పద్మభూషణ్, 'మెమ్ ఫేమస్' వంటి చిత్రాలతో తెలుగు సినిమాపై తనదైన ముద్ర వేసిన లహరి ఫిల్మ్స్.. భారతీయ సినిమా సంగీతంతో ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని కొనసాగిస్తూ "సంగీత్‌తో మరో ఆసక్తికర మైన తెలుగు చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, శ్రవంతి నవీన్ నిర్మాతలుగా వ్యవహరి స్తుండగా, మాజ్ ఖాన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.సంగీత్‌తో హీరోగా నిఖిల్ విజయేంద్ర సింహా పరిచయం కన్నడలో తెరకెక్కిన 'హంబుల్ పొలిటీషియన్ నోగ్రాజ్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన సాద్ ఖాన్ 'సంగీత్'కు దర్శకత్వం వహిస్తున్నారు. నిఖిల్, తేజు జంటలోని ఫ్రెష్‌నెస్ 'సంగీత్'కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. తాజాగా విడుదలైన "నీ వల్లే పాట వారి మధ్య ప్రేమ, కెమిస్ట్రీని ప్రేక్షకులకు పరిచయం చేస్తోంది.

## 'హ్యాపీ జర్నీ'కి అద్భుతమైన రెస్పాన్స్: ఝాన్సీ



అన్నపూర్ణమ్మ, ఆమని, ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రలు పోషించిన లేటెస్ట్ హిట్ హ్యాపీ జర్నీ. జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా, పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై బాలాజీ గుత్తా, కౌశిక్‌రెడ్డి నిర్మించారు. అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అయ్యారు. తరుణ్ రెడ్డి సహ నిర్మాత. ప్రెస్ మీట్ లో ఝాన్సీ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా ఇంకా చూడకపోతే వెంటనే వెళ్లి చూడండి. చాలా మంచి సినిమా చేశాం. మీరందరూ తప్పకుండా చూడాలి. ఎడిటర్ గారు ఈ సినిమా ఫస్ట్ కాపీ చూసి తప్పకుండా హిట్ కొడుతుందని చెప్పారు. అదే నిజమైంది. సినిమాకి ఆవుపట్టు వంశీ నటన. ఇందులో నవ్వులు, ఎమోషన్స్ అన్నీ ఉన్నాయి. వంశీ అన్నీ చేశాడు. మా పాత్రలన్నీ ఇతనే నడిపించాడు. పాయల్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఈ సినిమాని నా పేరెంట్స్‌తో కలిసి చూడడం చాలా ఆనందాన్నిచ్చింది. చూసిన ఆడియన్స్ అందరూ కూడా చాలా అద్భుతమైన రెస్పాన్స్ ఇస్తున్నారు.డైరెక్టర్ అభిరామ్ మాట్లాడుతూ..సినిమాకి చాలా మంచి రెస్పాన్స్ వస్తోంది. నేను అమ్మాయిల నుంచి ఎక్కువ రెస్పాన్స్ వస్తుందని ఎక్స్‌పెక్ట్ చేశాను. అబ్బాయిల నుంచి ఊహించని రెస్పాన్స్ వస్తోంది. మా ఫ్యామిలీతో కలిసి వెళ్లామ్మ అని చెప్తున్నారు. వంశీ మాట్లాడుతూ.. ఆడియన్స్ చాలా పాజిటివ్ రెస్పాన్స్ ఇస్తున్నారు. సినిమా చూసిన వాళ్లందరూ కూడా చాలా ఎంజాయ్ చేస్తున్నారు. సునైనా మాట్లాడుతూ..నటిగా అన్ని రకాల పాత్రలు చేయాలని ఉంటుంది. ఒక మంచి క్యారెక్టర్ చేయాలని ఎదురుచూస్తున్న సమయంలో హ్యాపీ జర్నీ వచ్చింది. సినిమాని ఓవర్సీస్‌లో షూట్ చేశాను.

## ఆ హాలీవుడ్ రీమేక్‌లో ఉచితంగానైనా నటిస్తా: విజయ్ సేతుపతి



విలక్షణ నటనతో దక్షిణ భారతదేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న 'మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి' తన రాబోయే చిత్రాలు, హాలీవుడ్ రీమేక్ ఆఫర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దర్శకుడు నిథిలన్ స్వామి నాథన్ తనకు 'మహారాజా 2' కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని వెల్లడించారు. 'మహారాజా' మొదటి భాగం విడుదల కాకముందు కొందరు అనుమానాలు వ్యక్తం చేసినప్పటికీ, తాను మాత్రం సినిమా విజయంపై గట్టి నమ్మకంతో ఉన్నానని గుర్తుచేసుకున్నారు.అంతే కాకుండా, మహారాజా సినిమాకు సంబంధించి ఇటీవల హాలీవుడ్ నుంచి ఒక భారీ సర్ ప్రైజ్ వచ్చిందని విజయ్ సేతుపతి తెలిపారు. ఈ సినిమా రీమేక్ హక్కులను హాలీవుడ్ సంస్థ దక్కించుకుందని, అందులో ప్రముఖ హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కొనాహే నటించబోతున్నారని నిర్మాత తనకు ఫోన్ చేసి చెప్పినట్లు వివరించారు. ఈ వార్త విన్నవెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని... ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు ఒక చిన్న పాత్ర ఇప్పించండి. ఉచితంగా నటిస్తాను అని నిర్మాతతో సరదాగా అన్నట్లు పంచుకున్నారు. మొదటి నుంచి హాలీవుడ్‌లో నటించాలనే కోరిక ఉందని, తన చిత్రం అక్కడ రీమేక్ కావడం ఎంతో గర్వంగా ఉందని చెప్పారు.

## 'పిక్ నిక్' ఫస్ట్ లుక్ రిలీజ్



బెత్లహేమ్ కుటుంబ యూనిట్ తో భారీ గ్లోబల్ సక్సెస్‌ను అందుకున్న ప్రముఖ నిర్మాణ సంస్థ భావన స్టూడియోస్ తమ కొత్త సినిమాను ప్రకటించింది. 'పిక్ నిక్' ఫస్ట్ లుక్ రిలీజ్ 'పిక్ నిక్' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సందీప్ ప్రదీప్, ఇంద్రజిత్ సుకుమారన్, దిలీష్ పోతన్ ప్రధాన పాత్రల్లో నటిస్తు న్నారు. ఫ్యామిలీ కామెడీ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా 2027 జనవరి 14న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవు తోంది. 'ప్రేమలు', బెత్లహేమ్ కుటుంబ యూనిట్ విజయాల తర్వాత భవానా స్టూడియోస్ నుంచి వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సౌత్ ఇండియాలో మంచి బజ్ ఏర్పడింది.ఈ సినిమాతో రచయిత కిరణ్ జోసీ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. సెన్సేషనల్ హిట్స్ 'ప్రేమలు', 'బెత్లహేమ్ కుటుంబ యూనిట్' చిత్రాలకు కో రైటర్‌గా పనిచేసిన కిరణ్ జోసీ.. కేరళతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆయన గత రచనలకు మంచి ఆదరణ లభించడంతో.. దర్శకుడిగా ఆయన తొలి సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. భవానా స్టూడియోస్ సినిమాలకు సౌత్ ఇండియా వ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని.. పిక్నిక్‌ను మలయాళం, తమిళం, తెలుగు, కన్నడ భాషల్లో ఒకేసారి విడుదల చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో సినిమాకు భారీ థియేట్రికల్ రిలీజ్ అందించేందుకు ప్రముఖ ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ సంస్థ షోయింగ్ బిజినెస్ భాగస్వామిగా చేరింది.

## 'హతః' చిత్రం టీజర్ లాంచ్



నవంబర్ 6న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న 'హతః' సినిమాపౌర్ణమి ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్‌తో కలిసి హీరో కిరణ్ అబ్బవరం తన కేఏ ప్రొడక్షన్స్ లో నిర్మిస్తున్న సినిమా 'హతః'. ఈ చిత్రాన్ని కిరణ్ అబ్బవరం సమర్ప ణలో శివశంకర నాయుడు. వై నిర్మిస్తున్నారు. అనుష్ గోరక్ దర్శకత్వం వహిస్తున్నారు. "హతః' సినిమాలో కుష్లు, రెహమాన్, నమిత ఎంపీ, తనూజ పుట్టుస్వామి కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఎడిటర్ అఖిల్ చక్రవర్తి మాట్లాడుతూ మా మూవీ టీజర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను. "అసోసియేట్ ప్రొడ్యూసర్ రితికేష్ గోరక్ మాట్లాడుతూ 'హతః' సినిమా కంటెంట్ పట్ల గర్వపడుతున్నాం. రెగ్యులర్ గా మనం చూసే సినిమాలకు భిన్నమైన ఒక ప్రయత్నం ఈ చిత్రంతో చేశాం. ప్రొడ్యూసర్ శివశంకర నాయుడు.వై. మాట్లాడుతూ ఈ సినిమా వెనక పెద్ద జర్నీ ఉంది. మా మూవీకి అండగా నిలబడిన కిరణ్‌కి థ్యాంక్స్. చాలా సినిమాలకు నేపథ్యంగా ప్రాంతం, సంప్రదాయం, పురణాల నుంచే రిఫరెన్స్ పాయింట్స్ ఉంటాయి. స్క్రిప్ట్ రైటర్, డీవోపీ, డైరెక్టర్ అనుష్ గోరక్ మాట్లాడుతూ 'హతః'మూవీ టీజర్ మీ అందరికీ నచ్చిందని నమ్ముతున్నాను.నటి తనూజ పుట్టుస్వామి మాట్లాడుతూ మనం మూవీస్ కు కథ ఇలా ఉంది అలా ఉంది అని చెప్పుకుంటూ ఉంటాం. కానీ ఈ సినిమా కథను చెప్పడం కంటే స్క్రీన్ మీద చూస్తేనే బాగుంటుంది. కో ప్రొడ్యూసర్, యాక్టర్ కుష్లు మాట్లాడుతూ మా టీమ్ అంతా కలిసి ఒక మంచి సినిమా చేశాం. మీకు తప్పకుండా నచ్చుతుందని నమ్ముతు న్నాం. ప్రొడ్యూసర్ కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ ఈ సినిమా మాకు ఒక స్పెషల్ ఫిలిం అవుతుందని నమ్ముతున్నాను. మా సినిమా రిలీజ్ కు ఇంకా 50 రోజుల టైమ్ ఉంది.

### డేవిస్ కప్‌లో భారత్ ఫైనల్

# ఆశలు గల్లంతు

### కొరియా 3-1తో చరిత్రాత్మక విజయం





**సియోల్:** డేవిస్ కప్ ఫైనల్ 8కి చేరిన తొలి ఆసియా దేశంగా నిలవాలన్న భారతదేశపు ఆశలు గల్లంతయ్యాయి. సియోల్‌లో శనివారం జరిగిన క్వాలిఫయర్ రౌండ్ 2 మ్యాచ్‌లో కొరియా 3-1 తేడాతో విజయం సాధించింది. ఈ ఏడాది ఆరంభంలో నెదర్లాండ్స్‌ను ఓడించిన తర్వాత భారత్ నూతన ఆత్మవిశ్వాసంతో ఈ టైలోకి అడుగుపెట్టింది, కానీ తొలి సింగిల్స్‌లో వరుస ఓటములు ఎదురయ్యాయి. డబుల్స్‌లో సాధించిన ఒక ఉత్సాహభరితమైన విజయం భారత్ ఆశలను కొద్దిసేపు సజీవంగా ఉంచినా కానీ నాలుగో సెట్‌లో కొరియా టైని ముగించింది. ధక్షినేశ్వర్ సురేష్, ఎన్ శ్రీరామ్ బాలాజీ కొరియా జోడీని 6-3, 3-6, 6-3 తేడాతో ఓడించి భారత్‌కు ఒక ఆశాకిరణం అందించారు. రెండవ సెట్ కోల్పోయిన తర్వాత, భారత జోడీ నిర్ణయాత్మక సెట్‌లో తిరిగి పట్టు సాధించి, మ్యాచ్ కోసం సర్వ్ చేసే స్థితికి చేర్చిన ఒక కీలకమైన బ్రేక్‌ను నమోదు చేసింది. మిగిలిన రెండు సింగిల్స్‌లోనూ భారత్‌కు విజయాలు అవసరం కావడంతో, నిర్ణయాత్మక రివర్స్ సింగిల్స్‌లో ఒత్తిడి సుమిత్ నాగల్‌పై పడింది. అయితే, కొరియాకు చెందిన సూన్‌వూ క్వాన్ ఆధిపత్య ప్రదర్శన కనబరచడంతో, నాగల్‌కు పుంజుకోవడానికి అవకాశం లభించలేదు. క్వాన్ తొలి సెట్‌ను 6-1 తేడాతో సునాయాసంగా గెలుచుకుని, రెండో సెట్‌లోనూ తన పట్టును కొనసాగించాడు. నాగాల్ పోటీలో నిలవడానికి ప్రయత్నించినప్పటికీ, కొరియన్ ఆటగాడు ఆధిపత్యాన్ని కొనసాగించి, సెట్‌ను 6-2 తేడాతో కైవసం చేసుకుని, డేవిస్ కప్ నాకౌట్ దశకు కొరియా ప్రవేశాన్ని ఖరారు చేయడంతో భారత్ ప్రయాణం ముగిసింది.

### కోల్‌కతా ఫుట్‌బాల్ లీగ్ ఛాంపియన్‌గా

# మోహాన్ బగాన్

### 3-2 తేడాతో మహమ్మదన్ ఓటమి



**కోల్‌కత్తా:** కలకత్తా ఫుట్‌బాల్ లీగ్ చివరి మ్యాచ్ రోజున, శనివారం బరసత్ స్టేడియంలో జరిగిన పోరులో మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు, మొహమ్మదన్ స్పోర్టింగ్‌పై 3-2 తేడాతో ఉత్కంఠభరితమైన పునరాగమన విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. బగాన్ తరఫున విజయపు గోల్ సాధించడంతో, ఆ జట్టు ఎనిమిదేళ్ల తర్వాత మరియు మొత్తంగా తమ 31వ కలకత్తా ఫుట్‌బాల్ లీగ్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. మ్యాచ్ తర్వాత భారత శిబిరంలో చేరనున్న సహల్ అబ్దుల్ సమద్, రెండు గోల్స్ చేసి, విజయపు గోల్‌కు సహకారం అందించి బగాన్ జట్టులో అత్యంత కీలక ఆటగాడిగా నిలిచాడు. బాగాన్ ఈ మ్యాచ్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగినప్పటికీ, బ్లాక్ పాంథర్స్ ప్రదర్శించిన గడ్డు ఆటతీరుతో వారికి గట్టి పోటీ ఎదురైంది. లాల్‌రెమ్‌సంగా ఫనాయ్, కెప్టెన్ మహితోష్ రాయ్ గోల్స్ చేయడంతో, బ్లాక్ పాంథర్స్ 63వ నిమిషంలో రెండు గోల్స్ చేసి 2-1 ఆధిక్యాన్ని సాధించింది. కొన్ని నిమిషాల ముందే వారి గోల్ కీపర్ దీప్రోభట్ ఘోష్‌కు రెడ్ కార్డ్ చూపడంతో, ఇది మెరైనర్స్ పనిని మరింత క్లిష్టతరం చేసింది. అయితే బస్తాబ్ రాయ్ బృందం సంయమనం కోల్పోకుండా పుంజుకుని, చివరకు సూపర్‌సబ్ సయాన్ ద్వారా విజయపు గోల్‌ను సాధించింది.




## చెస్ ఒలింపియాడ్.. రేటింగ్‌లో దారుణం

### 2700 కంటే దిగువకు గుకేశ్

**ఉజ్బెకిస్తాన్:** భార్బబీ ప్రస్తుత ప్రపంచ చెస్ ఛాంపియన్ దొమ్మరాజు గుకేష్ నాలుగేళ్లకు పైగా కాలంలో తొలిసారిగా 2700 రేటింగ్ కంటే దిగువకు పడిపోయాడు. ప్రస్తుతం జరుగుతున్న 2026 చెస్ ఒలింపియాడ్‌లో ఇండోనేషియాకు చెందిన ఐఎం సత్రియా దుతా చహోయాతో డ్రా చేసుకున్న గుకేశ్, 3.5 రేటింగ్ పాయింట్లను కోల్పోయాడు. ఫలితంగా, చెన్నైకి చెందిన 20 ఏళ్ల యువకుడు ఇప్పుడు లైవ్ రేటింగ్స్‌లో 2699.5 రేటింగ్‌ను సాధించి, ఆగష్టు 2022 తర్వాత తొలిసారిగా 2700 క్లబ్ నుండి బయటకు వచ్చాడు. దాదాపు రెండు సంవత్సరాల క్రితం, అక్టోబర్ 2024లో, బుడాపెస్ట్‌లో జరిగిన 2024 చెస్ ఒలింపియాడ్ టైటిల్‌ను భారత్ గెలుచుకోవడంలో తన అజేయ పరంపర కీలక పాత్ర పోషించిన తర్వాత, గుకేష్ 2794 అనే తన అత్యున్నత రేటింగ్‌ను సాధించాడు. విడిగా చూస్తే చాహోయాతో జరిగిన డ్రా నిరాశాజనకమైన ఫలితంగా అనిపించినప్పటికీ, బోర్డ్ 2లో నిహాల్ సరీన్ ఓటమి అంచున ఉన్న ప్రస్తుత ఛాంపియన్ భారత జట్టుకు, నల్ల పావులతో గుకేష్ అనుసరించిన రిస్క్ లేని వ్యూహం ఆ సమయానికి అత్యంత అవసరమైంది. ఒక ఎక్స్ఛేంజ్ త్యాగంతో నిహాల్ విజయం సాధించినప్పటికీ, తన జట్టుకు పాయింట్లను కాపాడటానికి తక్కువ రేటింగ్ ఉన్న ఆటగాడిపై గుకేష్ అనుసరించిన జాగ్రత్తాయుతమైన విధానంతో రేటింగ్ పడిపోయింది.

# టీమిండియా మిషన్ 300

### ఇక ప్రత్యర్థులపై దూకుడే..




**న్యూఢిల్లీ:** టీ20 క్రికెట్లో భారత జట్టు అద్భుతాలు చేస్తున్న విషయం తెలిసిందే. ద్వైపాక్షిక సిరీస్లతో పాటు టీ20 ప్రపంచ కప్ ఛాంపియన్‌గా కూడా నిలిచింది. ఇటీవల ఒకటి, రెండు సిరీస్లలో కాస్త నిరాశపర్చినా, ఇప్పుడు మరలా పుంజుకుంది. ఇందుకు కారణం దూకుడు బ్యాటింగే. ఈ క్రమంలో టీమిండియా మరో సంచలన మార్క్‌పై కన్నేసింది. భారీ స్కోర్లు సాధిస్తూ ప్రత్యర్థులపై ఆధిపత్యం చెలాయిస్తున్న భారత్ త్వరలోనే 300 పరుగుల మార్కు అందుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. జట్టులో ఉన్న ప్రతిభను చూస్తే ఈ ఘనత సాధించడం సాధ్యమేనని బిసిసిఐ భావిస్తోంది. ఆఫ్ఘనిస్థాన్‌తో ఈ నెల 17 జరిగిన మూడో టీ20లో యువ ఓపెనర్ అభిషేక్ శర్మ కేవలం 30 బంతుల్లోనే సెంచరీ చేశాడు. అభిషేక్ వ్యక్తిగత సెంచరీ కంటే అతడి ఇన్నింగ్స్ జట్టుపై చూపించిన ప్రభావమే ముఖ్యమని అంటోంది. అదే సమయంలో అతిపెద్ద సానుకూల అంశం ఏంటంటే పవర్‌ప్లేలో భారత్ తొలిసారి 100 పరుగులు చేయడం ప్రత్యేకమైన ఘట్టంగా అంచనా వేస్తోంది. మనం దూకుడుగా ఆడటం మొదలుపెడితే అదే దూకుడును కొనసాగించాలన్న సందేశాన్ని ఈ ఇన్నింగ్స్ ఇచ్చిందనే మార్పును గమనించింది. ఈ నేపథ్యంలో టీమిండియా తర్వాతి లక్ష్యం 300 పరుగులేనని బిసిసిఐ స్పష్టం చేస్తోంది. టీమిండియా ఇంకా 300 పరుగుల మార్కు చేరుకోలేదని, అదే తదుపరి లక్ష్యంగా జట్టును సిద్ధం చేస్తోంది. డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్న ప్రతిభను చూస్తే మరిన్ని అద్భుతాలు చేయాల్సి ఉంటుందని చెబుతోంది. టీ20ల్లో భారత్ అత్యధిక స్కోరు 297 పరుగులు. 2024లో బంగ్లాదేశ్‌పై భారత్ ఈ స్కోరు చేసింది. అదే ఏడాది దక్షిణాఫ్రికాపై 283/1 పరుగులు కూడా చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌తో తాజా మ్యాచ్‌లోనూ భారత్ భారీ స్కోరు చేసే అవకాశం వచ్చింది. అయితే చివరి ఐదు ఓవర్లలో బ్యాటర్లు ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేకపోవంతో భారత్ 221/7 వద్ద ఇన్నింగ్స్‌ను ముగించింది. ఈ సారి మిషన్ 300 లక్ష్యాన్ని చేరుకోవాలనే పట్టుదలతో టీమిండియా సన్నద్ధమవుతోంది.



## టెక్బాల్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో క్వీమ్సీ డిసౌజా ఓటమి

**నగోయా (జపాన్):** జపాన్‌లోని నగోయాలో ఉన్న నగోయా సిటీ హిగాషి స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం జరిగిన ఆసియా గేమ్స్ 2026 టెక్బాల్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్‌లో భారత క్రీడాకారిణి క్వీమ్సీ డిసౌజా ఇండోనేషియాకు చెందిన సుమయ చేతిలో ఓడిపోయింది. ఆసియా క్రీడల్లో తొలిసారిగా అడుగుపెడుతున్న టెక్బాల్‌లో, సుమయ 7-12, 12-9, 12-7 స్కోరుతో మూడు సెట్ల విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లి, కనీసం రజత పతకాన్ని ఖాయం చేసుకుంది. తొలి సెట్‌లో క్వీమ్సీ వేగంగా ప్రారంభించి 8-2 ఆధిక్యాన్ని సాధించింది. సుమయ పోరాడినా, భారత క్రీడాకారిణి తొలి సెట్‌ను గెలుచుకోకుండా ఆపలేకపోయింది.

రెండవ సెట్‌లో ఇండోనేషియా క్రీడాకారిణి బలంగా పుంజుకుని, ఆరంభంలోనే ఆధిక్యం సాధించింది. మధ్యలో క్వీమ్సీ తిరిగి పుంజుకుని, స్కోరును 6-6, ఆ తర్వాత 8-8తో సమం చేసింది, కానీ చివరిలో సుమయా ఆధిక్యం సాధించి మ్యాచ్‌ను సమం చేసింది. నిర్ణయాత్మక సెట్‌లో క్వీమ్సీ మళ్ళీ అద్భుతంగా ప్రారంభించి, 7-3 ఆధిక్యాన్ని సంపాదించింది. అయితే, సుమయా అద్భుతంగా పుంజుకుని, తర్వాతి తొమ్మిది పాయింట్లను గెలుచుకుని విజయాన్ని పూర్తి చేసుకుని ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. కాగా ఆదివారం కాంస్య పతకం కోసం జరిగే మ్యాచ్‌లో యుయినా సకామోటోతో తలపడనున్న క్వీమ్సీకి, భారతదేశానికి చారిత్రాత్మక పతకాన్ని గెలుచుకోవడానికి మరో అవకాశం లభించనుంది. గ్రూప్ దశలో, క్వీమ్సీ 43 నిమిషాల్లో సకామోటోను 2-1 (10-12, 12-11, 13-11) తేడాతో ఓడించింది.

# బ్యాంకులకు లాభాలు తెచ్చిపెట్టే డాలర్ డిపాజిట్లు

### ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక అంచనా



**ముంబయి, సెప్టెంబరు 19:** దేశంలోని బ్యాంకులకు డాలర్ డిపాజిట్లు భారీ లాభాన్ని తెచ్చిపెట్టే అవకాశంఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ తెలిపింది. ఎఫ్‌సీఎన్‌ఆర్ (బీ) డిపాజిట్ పథకం కింద మూడు నెలలలోపే 127 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.12.2 లక్షల కోట్లు) సమీకరించాయని ఈ మొత్తంతో వచ్చే ఐదేళ్లలో బ్యాంకులకు దాదాపు రూ.ఐదు లక్షల కోట్ల మేర నామమాత్రపు లాభం రావచ్చని అంచనా వేసింది. రిజర్వ్ బ్యాంక్‌కు మరో రూ.50 వేల కోట్ల లాభం వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ఈ పథకం వల్ల బ్యాంకులపై భారీ ఖర్చు పడుతుందన్న వాదనలను ఎస్‌బిఐ రీసెర్చ్ తోసిపుచ్చింది. డాలర్లను సమీకరించేందుకు చెల్లించే వడ్డీ, కరెన్సీ మారకం రిస్క్‌ను తగ్గించేందుకు చేసే హెడ్జింగ్ ఖర్చుప్రధాన వ్యయాలని వివరించింది. అయితే డాలర్ విలువలో మార్పును, హెడ్జింగ్ ఖర్చును కలిపి లెక్కించి భారీ నష్టాన్ని చూపడం సరికాదని నివేదిక పేర్కొంది. బ్యాంకులు తమ డాలర్ బకాయిలకు హెడ్జింగ్ చేసుకుంటాయని అందువల్ల మారకం విలువలో మార్పు ప్రభావం మెచ్యూరిటీ సమయంలో పెద్దగా ఉండదని వివరించింది. ఇక భారీగా నిధులు రావడం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెరిగిందన్న ఆందోళన అవసరం లేదని ఎస్‌బిఐ రీసెర్చ్ తెలిపింది. పండగల సమయంలో పెరిగే డిమాండ్, రుణాల పంపిణీ, కొత్త రుణాల మంజూరు, అడ్వాన్స్ ట్యాక్స్, జీఎస్‌టీ చెల్లింపుల వల్ల ఈ నిధులు వ్యవస్థలోనే వినియోగంలోకి వస్తాయని పేర్కొంది. రిజర్వ్ బ్యాంక్ విషయానికొస్తే సుమారు 100 బిలియన్ డాలర్లను విదేశీ పెట్టుబడి అవకాశాల్లో నాలుగు శాతం రాబడితో పెట్టుబడి పెడితే ఐదేళ్లలో 20 బిలియన్ డాలర్ల ఆదాయం రావచ్చని నివేదిక అంచనా వేసింది.

# సీనియర్ సిటిజెన్స్‌కోసం బ్యాంకుల్లో ప్రత్యేక డిపాజిట్లు




**ముంబయి, సెప్టెంబరు 19:** సురక్షితమైన పెట్టుబడి ఆప్షన్లలో ఇప్పటికీ చాలా మంది బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేస్తుంటారన్న సంగతి తెలిసిందే. వీటిల్లో ఎలాంటి రిస్క్ ఉండదు. నిర్దిష్ట పెట్టుబడులపై నిర్దిష్ట వడ్డీ రేట్ల ప్రకారం గ్యారెంటీ రిటర్న్స్ వస్తాయి. అన్ని బ్యాంకుల్లో వడ్డీ రేట్లు ఒకేలా ఉండవు. టెన్యూర్‌ను బట్టి మారుతుంటాయి. ఇంకా బ్యాంకుల్ని బట్టి కూడా వడ్డీ రేట్లలో మార్పులు ఉంటాయి. ఆర్బీఐ రెపో రేట్లను తగ్గిస్తూ వచ్చిన నేపథ్యంలో గత కొంత కాలంగా చాలా బ్యాంకుల్లో వడ్డీ రేట్లు తగ్గాయి. అయినప్పటికీ స్పెషల్ డిపాజిట్లు ఆఫర్ చేస్తున్నాయి. ప్రత్యేక టెన్యూర్లపై ఇక్కడ అధిక వడ్డీ అందిస్తున్నాయి. ఇదే సమయంలో సాధారణ ప్రజల కంటే ఏ బ్యాంకులో అయినా సీనియర్ సిటిజెన్లకు 50 బేసిస్ పాయింట్ల వరకు అధిక వడ్డీ వస్తుంది. ప్రత్యేక టెన్యూర్ డిపాజిట్లలోనే 555 రోజుల వ్యవధి ఉన్న ఫిక్స్‌డ్ డిపాజిట్ ఒకటి. ప్రస్తుతం కొన్ని బ్యాంకులు ఈ కాల పరిమితిపై గరిష్ఠంగా సాధారణ ప్రజలకు 7.25 శాతం వరకు వడ్డీ అందిస్తుండగా, సీనియర్ సిటిజెన్లకు అత్యధికంగా 7.50 శాతం వరకు వడ్డీ అందిస్తున్నాయి. సిటీ యూనియన్ బ్యాంకు ఈ బ్యాంకులో 555 రోజుల టెన్యూర్ ఉన్న స్పెషల్ ఎఫ్‌డీపై సాధారణ కస్టమర్లకు అత్యధికంగా 7.25 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.50 శాతం వడ్డీ ఆఫర్ చేస్తోంది. కర్ణాటక బ్యాంకులో వీరికి వడ్డీ రేట్లు వరుసగా ఇదే టెన్యూర్‌పై 7 శాతం, 7.40 శాతంగా ఉన్నాయి. బ్యాంక్ ఆఫ్ బరోడాలో 555 రోజుల స్పెషల్ ఎఫ్‌డీపై సాధారణ ప్రజలకు అత్యధికంగా 6.75 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.25 శాతం మేర వడ్డీ అందిస్తోంది.

ఇండియన్ బ్యాంకులో ఈ డిపాజిట్లపై సాధారణ ప్రజలకు 6.65 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.15 శాతం వడ్డీ వస్తోంది. కెనరా బ్యాంకులో వరుసగా వడ్డీరేట్లు 6.60 శాతం, 7.10 శాతంగా ఉన్నాయి. ఇదే యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వరుసగా సాధారణ ప్రజలకు 6.55 శాతం, సీనియర్ సిటిజెన్లకు 7.05 శాతంగా ఉన్నాయి. ఇక ఎఫ్‌డీపై వచ్చే ఆదాయానికి కొన్ని సందర్భాల్లో టిడిఎస్ వర్తిస్తుంది. 60 యేళ్లలోపు వారికి ఒక ఆర్థిక సంవత్సరంలో వడ్డీ ఆదాయం రూ. 50 వేలు దాటితే టిడిఎస్ వర్తించే అవకాశం ఉంది. సీనియర్ సిటిజెన్లకు ఈ పరిమితి రూ. 1 లక్షగా ఉంది. బ్యాంకులు వడ్డీ రేట్లను ఎప్పటికప్పుడు మారుస్తూ ఉంటాయి.




## భారత్‌లో బంగారంపై విపరీతమైన మోజు

### సీనియర్ బ్యాంకర్ ఉదయ్ కోటక్

**ముంబయి, సెప్టెంబరు 19:** భారతదేశానికి బంగారంపై ఉన్న విపరీతమైన మోజు దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద సవాలుగా మారిందని, ఈ అడ్డంకిలేకుంటే భారత్ సులభంగా కరెంట్ అకౌంట్ మిగులును సాధించి ఉండేదని సీనియర్ బ్యాంకర్ ఉదయ్ కోటక్ వ్యాఖ్యానించారు. వికసిత్ భారత్ ఫైనాన్షియల్ మినిస్టర్‌స్టేట్స్ కాన్ఫరెన్స్‌లో ఆయన ప్రసంగించారు. మారుతున్న ప్రపంచ పరిణామాల మధ్య దేశం మరింత పటిష్టంగా నిలబడాలంటే భారతదేశం ఈ బంగారు చిక్కుముడిని వెంటనే విప్పాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు విపరీతంగా పెరగడం వల్ల పరిమాణంలో పెద్ద మార్పు లేకపోయినా దిగుమతుల బిల్లు భారీగా పెరుగుతోందని ఉదయ్ కోటక్ ఆందోళన వ్యక్తం చేశారు. 2027 ఆర్థిక సంవత్సరంలో భారతదేశపు కరెంట్ అకౌంట్ లోటు సుమారు 60 బిలియన్ డాలర్లుగా ఉండే అవకాశం ఉందని అదే సమయంలో బంగారం దిగుమతులే ఏకంగా 88 నుండి 90 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని ఆయన అంచనా వేశారు.

## దిగివచ్చిన చక్కెర రిటైల్ ధరలు



**ముంబయి, సెప్టెంబరు 19:** పండుగల వేళ సామాన్యుడికి మళ్లీ ఊరట లభించనుంది. గడిచిన మూడు వారాల్లోనే బహిరంగ మార్కెట్‌లో కిలో పంచదార రిటైల్ ధర దాదాపు 10 శాతం మేర తగ్గి, రూ. 65 నుంచి రూ. 58.50 కి దిగివచ్చిన విషయం తెలిసిందే. కేవలం ధరల తగ్గింపే కాకుండా, మార్కెట్లో చక్కెర కొరత ఏర్పడకుండా కేంద్ర ప్రభుత్వం తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకుంది. పెద్ద ఎత్తున పంచదారను ఉపయోగించే వ్యాపారులు లేదా పారిశ్రామిక వినియోగదారులు ఇప్పటివరకు కేవలం 15 రోజులకు సరిపడా నిల్వలు (స్టాక్) మాత్రమే ఉంచుకోవడానికి అనుమతి ఉండగా, ఆ పరిమితిని ప్రభుత్వం ఇప్పుడు 30 రోజులకు పెంచింది. గత కొన్ని వారాలుగా తగ్గుతున్న ధరల ట్రెండ్‌ను పరిగణనలోకి తీసుకుని, పండుగల సమయంలో పెరిగే డిమాండ్‌కు తగినట్లుగా సరఫరా ఉండేలా చూసేందుకే ప్రభుత్వం ఈ సడలింపు ఇచ్చింది. పండుగల సమయంలో స్వీట్లు, ఇతర పిండివంటల తయారీ విపరీతంగా పెరుగుతుంది కాబట్టి పంచదారకు విపరీతమైన డిమాండ్ ఏర్పడటం సహజం. ఇలాంటి కీలక సమయంలో ప్రభుత్వంతీసుకున్న ఈ నిర్ణయంఎంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. కాకపోతే, చక్కెరమిల్లులవద్ద ధరలు దాదాపు 25 శాతం వరకు పడిపోయినప్పటికీ, ఆ స్థాయిలో రిటైల్ మార్కెట్‌లో కస్టమర్లకు లబ్ధి చేకూరలేదని ఆహార శాఖ పరిశ్రమల వర్గాలకు స్పష్టంచేసింది. మిల్లుల వద్ద తగ్గిన ధరల ప్రయోజనాన్ని హోల్‌సేలర్లు, రిటైలర్లు, వ్యాపారులు వెంటనే సామాన్య వినియోగదారులకు అందించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వ్యాపారులకు నిల్వ పరిమితిని 15 రోజుల నుంచి 30 రోజులకు పెంచుతూ ఇచ్చిన ఈ వెసులుబాటు వెనుక ఒక ముఖ్యమైన షరతు కూడా ఉంది. నెలకు 10 టన్నుల కంటే ఎక్కువ పంచదారను ముడిసరుకుగా వాడే పెద్ద బిస్కెట్ తయారీ కంపెనీలు, స్వీట్ షాపులు, సాఫ్ట్ డ్రింక్‌సంస్థలు, బేకింగ్ పరిశ్రమలు ఈహోల్‌సేల్ వినియోగదారుల పరిధిలోకి వస్తాయి. ప్రభుత్వం ఇచ్చిన కొత్త సడలింపు ప్రకారం.. వీరు అదనంగా ఉంచుకునే మరో 15 రోజుల నిల్వలను కేవలం టారిఫ్ రేట్ కోటా కింద దిగుమతి చేసుకున్న చక్కెర ద్వారా గానీ, లేదా అడ్వాన్స్ ఆథరైజేషన్ స్కీమ్ కింద సేకరించిన దాని ద్వారా గానీ మాత్రమే భర్తీ చేసుకోవాల్సి ఉంటుంది.

## ఎల్‌ఐసి కేసులో అనిల్ అంబానీపై మరోకేసు నమోదు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 19:** ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ గ్రూప్ మాజీ ఛైర్మన్ అనిల్ అంబానీ మరోసారి చట్టపరమైన చిక్కుల్లో పడ్డారు. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకి చెందిన సుమారు రూ.2,684.57 కోట్ల నిధులను మోసపూరితంగా మళ్లించారనే ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో అనిల్ అంబానీతో పాటు రిలయన్స్ క్యాపిటల్ లిమిటెడ్ (ఆర్ క్యాప్), రిలయన్స్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ సతీశ్ సేథ్‌తో పాటు మరికొందరు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులను నిందితులుగా చేర్చారు. ఎల్ఐసీ సమర్పించిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా సిబిఐ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. 2012 ఏప్రిల్ నుంచి 2018 మార్చి మధ్య కాలంలో రిలయన్స్ క్యాపిటల్ జారీ చేసిన ఐదు నాన్‌కన్వర్టిబుల్ డిబెంచర్లలో ఎల్ఐసి మొత్తం రూ.3,900 కోట్లు పెట్టుబడిగా పెట్టింది. సంస్థాగత అవసరాలు, పాత రుణాల చెల్లింపుల నిమిత్తం ఈ నిధులను వినియోగిస్తామని చెప్పి, ఆపై వాటిని దుర్వినియోగంచేశారని ఎల్ఐసి తన ఫిర్యాదులో ఆరోపించింది. నిందితులు నేరపూరిత కుట్రకు పాల్పడి, లెక్కలను తారుమారు చేయడం ద్వారా ఎల్ఐసికి భారీ ఆర్థిక నష్టం కలిగించారని సిబిఐ పేర్కొంది. ఈ కుట్రలో ఎవరెవరి పాత్ర ఉందో తేల్చేందుకు, అలాగే మళ్లించిన నిధుల గమ్యాన్ని గుర్తించేందుకు దర్యాప్తును ముమ్మరంచేసినట్లు సిబిఐ వెల్లడించింది. ఇదిలా ఉండగా, రిలయన్స్‌గ్రూప్‌కుచెందిన పలుకంపెనీలపై సిబిఐ ఇప్పటికే 8 ఎఫ్ఐఆర్‌లను నమోదు చేసింది. ఈ కేసులకు సంబంధించి ఇప్పటివరకు ఆరు ఛార్జిషీట్లు దాఖలుకాగా, ఏడుగురిని అరెస్ట్ చేసింది. ఈ పరిణామాలపై అనిల్ అంబానీ ప్రతినిధిస్పందిస్తూ, ఈవ్యవహారం రిలయన్స్ క్యాపిటల్‌కు సంబంధించినదని తెలిపారు. 2021 నవంబర్ వరకు అనిల్ అంబానీ ఆ కంపెనీ బోర్డులో నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గామాత్రమే కొనసాగారని వివరించారు.

## స్విఫ్ట్, డిజైన్ సిఎన్జీ మోడళ్లలో మారుతి అప్‌డేట్




**ముంబయి, సెప్టెంబరు 19:** మారుతి సుజుకి స్విఫ్ట్, డిజైర్ సీఎన్‌జీ మోడళ్లలో తొలిసారిగా ఏఎంటీ గేర్‌బాక్స్‌ను తీసుకొచ్చింది. ఫ్యాక్టరీలోనే అమర్చిన సీఎన్‌జీ యూనిట్‌తో ఆటోమేటిక్ గేర్ బాక్స్‌ను అందించడం మారుతి చరిత్రలో ఇదే తొలిసారి. స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీ ప్రారంభ ధర రూ.7.92 లక్షలు కాగా డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీ ధర రూ.8.53లక్షలు. ఇవి ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధరలు. సంబంధిత సీఎన్‌జీ మాన్యువల్ వేరియంట్లతో పోలిస్తే ఏఎంటీ మోడళ్ల ధర రూ.35 వేలు ఎక్కువ. స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీను విఎక్స్ఐ, విఎక్స్ఐ(O), జడ్ఎక్స్ఐఎన్ వేరియంట్లలో తీసుకొచ్చారు. డిజైర్ సీఎన్‌జీ ఏఎంట రెండు వేరియంట్లలో లభిస్తుంది. సీఎన్‌జీతో ఏఎంటీను అందిస్తున్న దేశంలో రెండో సంస్థగా మారుతి నిలిచింది. ఇప్పటికే టాటా మోటార్స్ ఈ కాంబినేషన్‌ను అందిస్తోంది. స్విఫ్ట్, డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీలో 1.2లీటర్, మూడు సిలిండర్ల జెడ్12ఈ పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. సీఎన్‌జీ మోడ్‌లో ఇది 70 హెచ్‌పీ శక్తి, 102 ఎన్‌ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 5స్పీడ్ ఏఎంటీ గేర్‌బాక్స్‌తో ఇంజిన్‌ను జత చేశారు. మైలేజీ విషయంలో స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీ లీటర్‌కు కాకుండా కిలోగ్రామ్ సీఎన్‌జీకి 35.34 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీ 36.47 కిలోమీటర్లు ఇస్తుందని పేర్కొంది. మాన్యువల్ మోడళ్లతో పోలిస్తే ఇవి వరుసగా 2.49, 2.74 కిలోమీటర్లు ఎక్కువ. సీఎన్‌జీ ట్యాంక్ అదనపు బరువును తట్టుకునేలా సస్పెన్షన్‌ను మార్చారు. సీఎన్‌జీ ఫ్యూయల్ లెవల్ ఇండికేటర్, పెట్రోల్ సీఎన్‌జీ మధ్య సులభంగా మారేందుకు ఫ్యూయల్ స్విచ్ కూడా ఉన్నాయి. ఇదే అప్‌డేట్‌లో భాగంగా బాలెనో సీఎన్‌జీ ఏఎంటీను కూడా మారుతి తీసుకొచ్చింది. దీని ప్రారంభ ఎక్స్ షోరూమ్ ధర రూ.8.32 లక్షలు. ఆటోమేటిక్ డ్రైవింగ్ సౌకర్యంతోపాటు సీఎన్‌జీ తక్కువ రన్నింగ్ ఖర్చు, తక్కువ ఉద్గారాలను కలపడం తమ ఆటో గ్రీన్ మిషన్ లక్ష్యమని కంపెనీ తెలిపింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.